

తర తరాల పిల్లల కథలు
రూ॥ 70/-
పేజీలు: 64
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 27, సంచిక: 223 | శనివారం | 01-02-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00


### నేడు పార్లమెంటులో బడ్జెట్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో నేడు బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. వరుసగా ఎనిమిదవ సారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం రికార్డు నెలకొల్పనున్నారు. ఈ బడ్జెట్‌తో మాజీప్రధాని మొరార్జీదేశాయ్ ప్రవేశపెట్టిన 10 బడ్జెట్‌ల రికార్డుకు నిర్మలాసీతారామన్ చేరువకానున్నారు. మాజీ ఆర్థికశాఖమంత్రి పి.చిదంబరం 9, ప్రణబ్‌ముఖర్జీ 8 సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

# జమిలిపై ముందుకే



- వక్ఫ్ సవరణ చట్టంపై త్వరితగతిన పురోగతి
- వామపక్షతీవ్రవాదం నిర్మూలన తుదిదశకు
- పేదలు, మధ్యతరగతి, యువత, మహిళలు, రైతులకు అధిక ప్రాధాన్యత
- భారత్‌ను ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చేదిశగా పయనం
- పార్లమెంట్ సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం

**న్యూఢిల్లీ :** ''ఒకే దేశం – ఒకే ఎన్నిక'', ''వక్ఫ్ సవరణ చట్టం'' వంటి కీలక అంశాలలో ప్రభుత్వం త్వరితగతిన పురోగతి సాధించిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. వామపక్ష తీవ్రవాదం నిర్మూలన తుది దశ ప్రారంభమైందని చెప్పారు. ప్రభుత్వ కృషి ఫలితంగా వామ పక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాల సంఖ్య 126 నుంచి నేడు 38కి తగ్గాయని అన్నారు. ప్రభుత్వం మూడవ విడత అధికారంలోకి వచ్చిన తరువాత పని వేగం మూడింతలు పెరిగిందని అసాధారణ వేగంతో ప్రధాన నిర్ణయాలు, విధానాలను అమలు చేయడాన్ని దేశం చూస్తోందని అన్నారు. పేదలు, మధ్యతరగతి, యువత, మహిళలు, రైతులకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. భారతదేశాన్ని ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తుందన్నారు. రాజ్యాంగం సూచించిన ఆశయాల మార్గదర్శనంలో 'వికసిత్ భారత్' ప్రయాణం కొనసాగుతుందని, సేవ, సుపరిపాలన, సంపద, గౌరవం అనే నాలుగు కీలక సూత్రాలను పాలనలో అమలు చేస్తున్నట్లు వివరించారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో గురువారం ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు. తన ప్రసంగం ప్రారంభంలో రాజ్యాంగం 75 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో బాబా సాహెబ్ అంబేద్కర్, రాజ్యాంగ నిర్మాతలందరికీ దేశ పౌరుల తరుపున ఆమె నివాళి అర్పించారు. అలాగే మహాకుంభమేళాలో మౌని అమావాస్య రోజున జరిగిన దురదృష్టకర సంఘటన పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మరణించిన మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్‌కు నివాళి అర్పించారు. మూడవ విడతలో తన ప్రభుత్వం 'అందరికీ ఇళ్ళు' అనే లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు తీసుకుందని, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకాన్ని పొడిగించి అదనంగా మూడు కోట్ల కుటుంబాలకు కొత్త ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇందుకు రూ.5.36 లక్షల కోట్లు కేటాయించామన్నారు. గ్రామీణ పేదలకు ఇంటి స్థలంపై యాజమాన్య హక్కును దఖలు చేసే స్వమిత్వ పథకం కింద 2.25 కోట్ల ప్రాపర్టీ కార్డులను జారీ చేశామని, అందులో ఆరు నెలలల్లో 70 లక్షల కార్డులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇటీవల మాసాలలో కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రూ.41 వేల కోట్లు రైతులకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. గిరిజన సమూహాలకు

తరువాయి 2లో

# ఘనమైన అంచనాలు

## ఫలితాలు నిరాశాజనకం

### లోక్‌సభలో ఆర్థిక సర్వే ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్

### 2025–26 ఆర్థిక సంవత్సరానికి 6.3–6.8 శాతం జిడిపి అంచనా




**న్యూఢిల్లీ:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే ఎప్పటిమాదిగానే భవిష్యత్తుపై ఘనమైన అంచనాలతో కొనసాగింది. గత ఆర్థిక సర్వేలో వేసిన అంచనాలను, నిర్దేశించుకున్న లక్ష్యాలను అందుకోలేకపోయామని ప్రస్తుత గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) అంచనా మేరకు 2024–25 ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటును 7 శాతంగా అంచనా వేయగా, గత ఏడాది జులై–సెప్టెంబర్ త్రైమాసికంలో ఇది కేవలం 5.4 శాతం మాత్రమే. అంచనాలకు, వాస్తవ పరిస్థితులు... ఫలితాలకు ఎక్కడా పొంతన లేదనడానికి ఇదో ఉదాహరణ. శనివారం లోక్‌సభలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న కేంద్ర ఆర్థిక మంత్రి, ఆనవాయితీగా శుక్రవారం ఈ ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టారు. దేశ ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నుల నుంచి సాధించిన అభివృద్ధి వరకూ పలు అంశాలను ఇందులో ప్రస్తావించారు. అదే విధంగా రాబోయే బడ్జెట్ అంచనాలను కూడా ఆ ఎకనామిక్ సర్వేలో ప్రస్తావించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధి రేటు 6.3 నుంచి 6.8 శాతం వరకూ ఉండవచ్చని ఈ సర్వే అంచనా వేసింది. గత ఏడాది అంచనా వేసిన జిడిపి వృద్ధి రేటును భారత్ అందుకోలేకపోయిందని ఈ సర్వే గణాంకాలు తేల్చిచెప్తున్నాయి. జులై–సెప్టెంబర్ త్రైమాసికం మాత్రమేకాదు, ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో కూడా జిడిపివృద్ధిరేటు

తరువాయి 2లో

# గొప్పలతోనే సరి

### ప్రజా సమస్యల ప్రస్తావనే లేదు

### రాష్ట్రపతి ప్రసంగంపై సిపిఐ

న్యూఢిల్లీ: వాస్తవాలకు దూరంగా, స్వీయ అభినందలభరితంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం సాగిందని భారత కమ్యూనిస్టు పార్టీ వ్యాఖ్యానించింది. ప్రజా సమస్యల ప్రస్తావనకే రాలేదని దుయ్యబట్టింది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం వేళ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ముర్ము చేసిన ప్రసంగంలో కీలక అంశాలన్నీ విస్మరణకు గురయ్యాయని సిపిఐ విమర్శించింది. స్వోత్కర్షకు ఆమె ప్రసంగం పరిమితమని వ్యాఖ్యానించింది. సామాన్యుల జీవితాలను దుర్భరం చేసే అంశాలను, పరిపాలన వైఫల్యాలను, దేశ ప్రస్తుత వాస్తవ పరిస్థితులను గురించి ఏమీ మాట్లాడలేదని దుయ్యబట్టింది. మణిపూర్ సంక్షోభం,

తరువాయి 2లో

### పూర్తిగా రాజకీయ ప్రసంగం : కాంగ్రెస్

న్యూఢిల్లీ : పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం చేసిన ప్రసంగాన్ని 'స్పష్టమైన రాజకీయ ప్రసంగం' అని కాంగ్రెస్ పార్టీ అభివర్ణించింది. దేశంలోని సాధారణ పౌరుడు రోజురోజుకూ ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఎటువంటి ప్రస్తావనా లేదని తెలిపింది. బడ్జెట్ సమావేశాల ప్రారంభాన్ని సూచిస్తూ పార్లమెంటు సంయుక్త సమావేశంలో ప్రసంగించిన రాష్ట్రపతి ముర్ము... కోవిడ్19 మహమ్మారి, యుద్ధ సంబంధిత అనిశ్చితులు వంటి ప్రపంచ ఆందోళనలు ఉన్నప్పటికీ, ఆర్థిక వ్యవస్థను 'విధాన పక్షవాతం' స్థితి నుంచి బయటకు తీసుకురావడానికి ప్రభుత్వం బలమైన సంకల్పంతో పని చేసిందని తెలిపారు. బీజేపీ నేతత్వంలోని ప్రభుత్వం

తరువాయి 2లో



# కాషాయ పాలనలో ప్రజాస్వామ్యం ధ్వంసం

### బిజెపిని గద్దె దింపేందుకు మార్చి 23 నుంచి రాజకీయ ప్రచారోద్యమం

### సెప్టెంబరు 2025 చండీగఢ్‌లో సిపిఐ జాతీయ మహాసభలు

### డిసెంబరు 24, 25న విజయవాడలో అంతర్జాతీయ సదస్సు

### సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా

**విశాఖపట్నం:** కేంద్రంలో ప్రజావ్యతిరేక పాలన సాగుతోందని, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తూ మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని... దీనికోసం వామపక్ష, లౌకిక పార్టీలతో కలిసి పనిచేస్తామని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా తెలిపారు. విశాఖలో గురు, శుక్రవారాల్లో సిపిఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు జరిగాయి. శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజా మాట్లాడుతూ బిజెపి ప్రజావ్యతిరేక పాలనపై భగత్ సింగ్ వర్ధంతి రోజైన మార్చి 23వ తేదీ నుంచి అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు దేశవ్యాప్తంగా రాజకీయ ప్రచార ఉద్యమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా జాతాలు, ప్రదర్శనలు, సభలు, సదస్సులు నిర్వహిస్తామని వెల్లడించారు. దేశంలో ప్రజల మధ్య ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలంటే కేంద్రంలో బిజెపిని అధికారం నుంచి గద్దె దించాలని రాజా అన్నారు. సీపీఐ శతవార్షికోత్సవాల సందర్భంగా విజయవాడలో డిసెంబర్ 24, 25 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తామని, దీనికి ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులను ఆహ్వానిస్తామని తెలిపారు. డిసెంబర్ 26న శతవార్షికోత్సవాల ముగింపు సభను ఖమ్మంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. దేశంలో ప్రస్తుతం సంక్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయని, ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, విదేశీ అప్పు

తరువాయి 2లో

# నేను కొడితే మామూలుగా ఉండదు

- ఇక కాంగ్రెస్‌పై ప్రత్యక్ష పోరాటమే
- ఫిబ్రవరిలో భారీ బహిరంగసభ
- మా హయాంలోకంటే రూ.13వేల కోట్లు ఆదాయం తగ్గింది
- బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు



ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి

రాష్ట్రంలో ఒక్క పథకం కూడా సక్రమంగా అమలు కావటం లేదని.. రాష్ట్రంలో ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని.. కైలాసం ఆడుతుంటే పెద్దపాము మింగినట్లు ప్రజలు దిక్కు తోచని స్థితిలో ఉన్నారని మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. మళ్లీ కరెంటు కోతలు, మంచినీళ్ల కరువు కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఓట్ల కోసం కాంగ్రెస్ ముస్లింలను వాడుకుంటున్నారని ఆరోపించారు. ఇక లాభం లేదు..ప్రత్యక్ష పోరాటాలు చేయాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పాడ్డాయన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓటస్తే..నట్టెట్లో ముంచారని..మంచి గుణపాఠం చెప్పారని విమర్శించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో జరిగిన బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాజీ సిఎం కెసిఆర్ మాట్లాడుతూ సంగమేశ్వర, బసవేశ్వర, ఎత్తిపోతల పథకాల గురించి మాజీ మంత్రి హరీష్ రావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని బిఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్

తరువాయి 2లో



# జోలి చెప్పొద్దు అసెంబ్లీకి రా..

- మేము చేసిన రుణమాఫీ లెక్కలు చూపిస్తాం
- హామీలు ఎగ్గొట్టి పంగనామాలు పెట్టిన చరిత్ర బిఆర్ఎస్‌ది
- మొగిలిగిద్దలో ప్రభుత్వ పాఠశాల 150వ వార్షికోత్సవ సభలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి/షాద్ నగర్

అసెంబ్లీ ఎన్నికలను అడ్డుపెట్టుకుని రైతుబంధు ఎగ్గొట్టిన ఘనత కెసిఆర్‌కు దక్కిందని.. ఎగ్గొట్టిన రైతుబంధు నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు ఖాతాల్లో జమ చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్దలో 150 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హెలిపాడ్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి,స్థానిక శాసనసభ్యులు వీర్లపల్లి శంకర్ ఘనంగా స్వాగతం పలికారు. ప్రభుత్వ పాఠశాలలో గత చరిత్ర ఆనవాళ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్

తరువాయి 12లో

# రాజ్యాంగంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ

### ముఖ్యమంత్రికి కూనంనేని లేఖ

ప్రజాపక్షం/ హైదరాబాద్



భారత రాజ్యాంగం 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శాసనసభలో రాజ్యాంగంపై ప్రత్యేక చర్చ నిర్వహించాలని సిపిఐ శాసనసభాపక్ష నాయకులు, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బిసి రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి

తరువాయి 2లో

### లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి

# బిజెపి ఖర్చు రూ.1,737 కోట్లు

**న్యూఢిల్లీ:** 2024 లోక్‌సభ ఎన్నికల కోసం బిజెపి రూ.1,737 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్ర ఎన్నికల సంఘానికి ఆ పార్టీ సమర్పించిన నివేదిక పేర్కొంది. ఈ మొత్తంలో... పార్టీ ప్రచారానికి రూ.884.45 కోట్లు, తన అభ్యర్థులకు సంబంధించిన ఖర్చుల కోసం రూ.853.23 కోట్లు కేటాయించింది. పత్రికా, ఎలక్ట్రానిక్ మీడియా సహా మీడియా ప్రకటనలు, బల్క్ ఎస్ఎంఎస్‌ల ప్రచారం, కేబుల్, వెబ్‌సైట్, టివి ఛానల్స్ వ్యాప్తంగా పార్టీ అంశాల ప్రచారం నిమిత్తం దాదాపు రూ.611.50 కోట్లు ఖర్చు చేసింది. ఎన్నికల్లో ప్రచారాన్ని బలోపేతం చేయడానికి పార్టీ జెండాలు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, పోస్టర్లు వంటి ప్రచార సామాగ్రిపై కూడా రూ.55.75 కోట్లు ఖర్చు చేసింది. అదనంగా బహిరంగ సభలు, ప్రదర్శనలు, ర్యాలీలు, ఆడియో ఏర్పాట్లు, బారికేడ్లు, వాహనాలు సహా వేదికల ఏర్పాటు కోసం రూ.19.84 కోట్లు వ్యయం

తరువాయి 12లో

### కరీంనగర్ పట్టభద్రుల ఎంఎల్‌సి కాంగ్రెస్ అభ్యర్థిగా ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



మెదక్,నిజామాబాద్, ఆదిలాబాద్,కరీంనగర్ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ కాంగ్రెస్‌అభ్యర్థిగా ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి పేరు ఖరారైంది. ఈ మేరకు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ శుక్రవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు.


ఢిల్లీ ఎన్నికలు
బెడిసికొట్టిన బిజెపి వ్యూహాలు 04




# ఉస్మానియాకు సిఎం శంకుస్థాపన

ప్రజాపక్షం/హైదరాబాద్

గోషామహల్ మైదానంలో ఏర్పాటు చేసిన ఉస్మానియా జనరల్ ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియాన చొంగ్తు తో పాటు పలువురు హాజరయ్యారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

తరువాయి 2లో

## 2027 ఎన్నికల్లో పోటీకి

## 'కమ్యూనిస్టు ప్లాట్‌ఫామ్ ఆఫ్ మెక్సికో' ఏర్పాటు

### మెక్సికో కమ్యూనిస్టు పార్టీ ప్రకటన




**మెక్సికో సిటీ:** మెక్సికోలోని షెయిన్‌బామ్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు మెక్సికో కమ్యూనిస్టు పార్టీ (పీసీఎం) సంకల్పించింది. 2027, 2030లో జరగబోయే ఎన్నికల్లో పోటీకి 'కమ్యూనిస్ట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ మెక్సికో' వేదికను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. పార్టీ కేంద్ర కమిటీ ఆరవ ప్లీనరీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు పీసీఎం ఒక ప్రకటనలో తెలిపింది. దేశీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, మెక్సికో శ్రామిక వర్గ హక్కులు, 2025 కోసం పీసీఎం కార్యాచరణ ప్రణాళికపై ప్లీనరీ చర్చించినట్లు వెల్లడించింది. పెట్టుబడిదారీ దేశాల ఉచ్చులో పడవద్దని ప్రజలకు, శ్రామికులకు పిలుపునిచ్చింది. నియో వలస పరిస్థితి కొనసాగుతోందని హెచ్చరించింది. తమకు మద్దతుగా నిలవాలని కోరింది. అదే సమయంలో అమెరికా సామ్రాజ్యవాద దౌర్జన్యాలకు, అణచివేతకు గురవుతున్న క్యూబా, వెనిజులా దేశాలకు సంఘీభావాన్ని ప్రకటించింది. గత ఒబ్రడోర్ ప్రభుత్వం కొనసాగింపుగా షెయిన్‌బామ్ పరిపాలన సాగుతోందని పీసీఎం వ్యాఖ్యానించింది. ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, సైనికీకరణ, కార్పొరేట్ అనుకూల విధానాల అమలును ఆక్షేపించింది. సమాజాన్ని నియంత్రించే అన్యాయ సంక్షేమ మార్గంలో ఆందోళన వ్యక్తం చేసింది. యూఎస్ఎంసీఏ ఆధారిత గుత్తాధిపత్యదారులకే షెయిన్‌బామ్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టింది. 'సెకెండ్ ఫ్లోర్ ఆఫ్ ది ఫోర్త్ ట్రాన్స్‌ఫర్మేషన్'ను పూర్తిస్థాయిలో వ్యతిరేకిస్తున్నట్లు పీసీఎం ప్రకటించింది.

## మైన్మార్, ట్యునీసియాలో ఎమర్జెన్సీ పొడిగింపు



ప్రపంచం

**యాంగాన్/ట్యునిస్:** మైన్మార్, ట్యునీసియా దేశాల్లో అత్యవసర పరిస్థితులు అమల్లో ఉన్నాయి. ఎమర్జెన్సీ కాలాన్ని మరింత కాలం పొడిగిస్తూ ఆ దేశాల ప్రభుత్వాలు తాజాగా ప్రకటనలు చేశాయి. తమ దేశంలో అత్యవసర పరిస్థితి మరో ఆరు నెలలు కొనసాగనున్నట్లు మైన్మార్ జాతీయ రక్షణ, భద్రతా మండలి (ఎన్‌డీఎస్‌సీ) తెలిపింది. నే పై తావ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు తెలిపింది. రాజ్యాంగంలోని సెక్షన్ 425 ప్రకారం ఎమర్జెన్సీని పొడిగించినట్లు వెల్లడించింది. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంతో పాటు శాంతి, సుస్థిరత నెలకొల్పే ఉద్దేశంతో ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు అధికారులు చెప్పినట్లు మైన్మార్ రేడియో టెలివిజన్ (ఎంఆర్‌టీవీ) నివేదించింది. ఎన్నికలకు సన్నద్ధత, వ్యవసాయ ఉత్పత్తి పెంచుకోవడం, విద్యా, ఆరోగ్య రంగాలలో జాతీయస్థాయి అభివృద్ధి వంటి అంశాలను ఎన్‌డీఎస్‌సీ చర్చించినట్లు ప్రకటన పేర్కొంది. విపత్తు అనంతరం కల్పించే పునరావాసం, సాయుధ ఘర్షణలకు ముగింపు పలకడం, శాశ్వత శాంతి సాధన దిశగా తీసుకోవాల్సిన చర్యలపైనా సమాలోచనలు జరిగినట్లు వెల్లడించింది. 2021 ఫిబ్రవరిలో మైన్మార్‌లో ఒక ఏడాది పాటు ఎమర్జెన్సీని ప్రకటించారు. ఇప్పుడు దానిని మరో ఆరు నెలలు పొడిగించారు. ఇదిలావుంటే, 2025 చివరి వరకు ఎమర్జెన్సీని పొడిగిస్తూ ట్యునీసియా అధ్యక్షుడు కైస్ సయీద్ ఒక ప్రకటన చేశారు. అధ్యక్షుడి గార్డుల బస్సుపై బాంబు దాడి అనంతరం 2015, నవంబరు 24న ట్యునీసియాలో మొదటిసారి ఎమర్జెన్సీని విధించారు. అప్పటి దాడిలో 12 మంది ఏజెంట్లు చనిపోయారు. కాగా, ట్యునీసియాలో ఎమర్జెన్సీ వేళ అధికారులకు కొన్ని అసాధారణ అధికారాలు ఉంటాయి. వాటిలో గృహ నిర్బంధాలు చేయడం, అధికారిక సమావేశాలు నిషేధించడం, కర్ఫ్యూ విధించడం, మీడియా, ప్రెస్‌ను పర్యవేక్షించడం, అసెంబ్లీలను రద్దు చేయడం, న్యాయ స్థానాల అనుమతి లేకుండా మీడియా సెన్సార్‌షిప్ అమలు చేయడం వంటివి ఉన్నాయి.

## కొత్త కరెన్సీ తెస్తే

## 100 శాతం పన్నులేస్తాం

### బ్రిక్స్ దేశాలకు ట్రంప్ హెచ్చరిక




**వాషింగ్టన్:** కొత్త కరెన్సీని తెచ్చే ప్రయత్నాలను మానుకోవాలని బ్రిక్స్ దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించారు. కాదు కూడదు అంటే 100శాతం పన్నులు విధిస్తామంటూ హెచ్చరించారు. అంతర్జాతీయ వాణిజ్యంలో అమెరికన్ డాలర్‌ను తలదన్నే కరెన్సీ రావడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. ఆ దిశగా జరిగే ప్రయత్నాలను అణచివేస్తామన్నారు. అందుకు ఏ దేశమైనా ప్రయత్నిస్తే పన్నులు, సుంకాలకు హాయ్ చెప్పి... అమెరికాకు గుడ్ బై చెప్పాల్సిందేనని ట్రూత్ మాధ్యమంగా ట్రంప్ హెచ్చరికలు చేశారు. 'డాలర్ వినియోగాన్ని ఉపేక్షించాలన్న బ్రిక్స్ దేశాల ఆలోచన. ఇందుకు అనుమతించబోం' అని అన్నారు. కొత్త కరెన్సీ సృష్టించే ఆలోచనను మానుకుంటామని, అమెరికా డాలర్‌ను దెబ్బతీసే విధంగా ప్రత్యామ్నాయ కరెన్సీ తీసుకు రాబోమని బ్రిక్స్ దేశాలు స్పష్టమైన హామీ ఇవ్వాలని అన్నారు. లేనిపక్షంలో 100 శాతం పన్నులు వారికి తప్పబోవని, అమెరికాతో వాణిజ్యానికి స్వస్తి పలకాల్సి ఉంటుందని ట్రంప్ బెదిరించారు

## మామూలుగా ఉండదు (మొదటి పేజీ తరువాయి)

వేధిస్తుందన్నారు. గురుకులాల్లో విద్యార్థుల పరిస్థితి చూస్తుంటే గుండె తరుక్కుపోతుందన్నారు. బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన పథకాలు సంగతి పక్కన పెడితే కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సైతం గంగలో కలిపారని ఎద్దేవా చేశారు. కరోనా సమయంలో తాను రైతుబంధు,దళితబంధు, పింఛన్లు ఇలా ఏవి సంక్షేమ పథకాలు ఆపలేదని గుర్తు చేశారు. కొత్త ప్రభుత్వానికి కాస్త సమయం ఇవ్వాలనే ఇన్ని రోజులు మౌనంగా ఉన్నానని, గంభీరంగా చూస్తున్నా నేడు కొడితే మామూలుగా ఉండదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సంగమేశ్వర ,బసవేశ్వర ఎత్తిపోతల పథకాలను టెండర్లు ఎందుకు పిలవలేదని వాటిని అడ్డుకోవడంలో మతలబు ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్‌రంగం కుదేలైందన్నారు. నాలుగు ఎకరాలుంటే నాలుగు కోట్లతో దర్జాగా,ఏంతో ధీమాగా ఉండేవారన్నారు. మారుమూల ప్రాంతాల్లో ఎకరానికి 40 లక్షలకు తక్కువగా పలుకలేదని, ఇప్పుడు సగానికి పైగా ధరలు పడిపోయయన్నారు. రాష్ట్రంలో అన్ని రకాల వ్యాపారాలు దెబ్బతిన్నాయన్నారు. రాష్ట్రంలో కెసిఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారన్నారు. తాను యాభై ఏండ్లుగా రాజకీయాల్లో ఉన్నానని.. రాజకీయాల్లో గెలుపుఓటమిలు సహజమన్నారు.ఏడాదిలోనే కాంగ్రెస్ పాలనలో ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందని,. కాంగ్రెస్ నాయకులు దొరికితే కొడుతామనే కోపంగా ప్రజలు ఉన్నారన్నారు. కాంగ్రెస్ సోషల్ మీడియా ఆధ్వర్యంలో ఫాంహౌజ్ పాలన బాగుందా? ప్రజాపాలన బాగుందా అని ఓటింగ్ పెడితే కెసిఆర్ పాలనకు 70 శాతంకు పైగా ఓటేసారని, కాంగ్రెస్‌కు 30 లోపు వేశారన్నారు. ఇది తాను సర్వే చేసింది కాదని..కాంగ్రెస్ నాయకులు చేసిన సర్వే అని కెసిఆర్ స్పష్టం చేశారు. ఫాంహౌజ్ అంటే ఏదో ఉందని కాంగ్రెస్ ప్రచారం చేసిందని. ఇక్కడ వ్యవసాయం తప్పా ఏమిలేదన్నారు. ప్రజలకు అన్న విషయాలు అర్థమవుతున్నాయన్నారు. మరో నాలుగు నెలలు గడిస్తే ఉద్యోగులకు వేతనాలు, పింఛన్లు సైతం ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే రిటైర్‌మెంట్ ఉద్యోగులు బెనిఫిట్స్ రాలేదని న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అర్థిక పరిస్థితిని పూర్తిగా దివాళ తీయించారన్నారు. కంట్రోలర్ ఆడిట్ జనరల్ రిపోర్టు వచ్చిందని.. బిఆర్ఎస్ ప్రభుత్వ ఆదాయం కంటే 13వేల కోట్ల ఆదాయం తగ్గిందన్నారు. మరో రెండునెలల్లో ఇంకా రెండు నుండి మూడు వేల కోట్లు అంటే బిఆర్ఎస్ కంటే 15వేల కోట్ల ఆదాయం తగ్గిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడ ప్రతి ఏడాది 10 వేల నుండి 15 వేల కోట్లు ఆదాఐం పెంచిన విషయాన్ని కెసిఆర్ గుర్తు చేశారు. ప్రజలు తెలివైన వాళ్లు అన్ని గమనిస్తున్నారని,, తెలంగాణ భవిష్యత్తు కోసం మరోమారు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి మాసంలో రాష్ట్రంలో భారీ బహిరంగ సభను నిర్వహించి తెలంగాణ శక్తిని చాటుతామన్నారు. ప్రత్యక్ష రాజకీయాలకు సిద్ధం కావలని, ప్రజలతో కలసి పోరాటం చేయాలని కెసిఆర్ పిలుపునిచ్చారు. తాను వంద శాతం చెపుతానని,.రాబోయే రోజుల్లో వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వామేనన్నారు. బిఆర్ఎస్ విజయం ప్రజల విజయం కావాలని పిలుపునిచ్చారు. ఆనంతరం బిఆర్ఎస్ శ్రేణులు బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌ను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఎంఎల్‌ఏలు హరీష్‌రావు, సునితాలక్ష్మారెడ్డి, చింత ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాణిక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యం ధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

700 బిలియన్ డాలర్లకు చేరుకుందని, రూపాయి విలువ భారీగా పడిపోతోందని, నిరుద్యోగం పెరిగి యువతలో నిస్పృహ అలుముకుంటోందని, ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని చెప్పారు. బీజేపీ చెబుతున్న వికసిత్ భారత్ ఎక్కడా కనిపించడం లేదని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజల ప్రయోజనాలను విస్మరించి కార్పొరేట్ల సేవలో మునిగితేలుతోందని మండిపడ్డారు. కార్పొరేట్ల రుణాలను మాఫీ చేస్తున్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని తెలిపారు. రైతు ప్రయోజనాలకు వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చిందని..కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందన్నారు. బీజేపీ పాలనలో రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ముప్పు పొంచి ఉందన్నారు. దేశ ప్రజలు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్ పై పార్లమెంటులో హోంమంత్రి అమిత్ షా అవమానకరంగా మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండించామని, అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 31న వామపక్ష పార్టీలు నిరసన కార్యక్రమం నిర్వహించాయన్నారు. అయినా ప్రధాని నరేంద్ర మోదీ దీనిపై నోరు ఎత్తడం లేదని విమర్శించారు.

**ఎన్‌కౌంటర్లపై నిజనిర్ధారణ కమిటీ**

చత్తీస్‌గఢ్ ఎన్ కౌంటర్లపై సీపీఐ నిజ నిర్ధారణ కమిటీ నిజాలను నిగ్గుతేలుస్తుందని రాజా చెప్పారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న మేథావులను జైలుకు పంపుతున్నారని, వారికి బెయిల్ కూడా రాకుండా చేస్తున్నారని, ప్రశ్నిస్తున్న గొంతులను కేంద్ర ప్రభుత్వం అణిచివేస్తోందని చెప్పారు. 1991 ప్రార్థన స్థలాల చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు సీపీఐ పూర్తిగా వ్యతిరేకమని, కార్యవర్గ సమావేశాల్లో విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేసినట్టు తెలిపారు. సీపీఐ జాతీయ మహాసభలు సెప్టెంబర్ 21 నుంచి 25 వరకు చండీగఢ్ లో నిర్వహించనునట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకష్ణ మాట్లాడుతూ... విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరించబోమని కేంద్రం నుంచి స్పష్టమైన ప్రకటన రాలేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం సొంత గనులు ఇస్తామని కేంద్రం చెప్పలేదని, విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కేంద్ర ప్రభుత్వం చూపించలేదని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లౌకిక రాజ్యం విధానానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ మైనారిటీలను రెండో శ్రేణి పౌరులుగా చూస్తోందని విమర్శించారు. ఖమ్మంలో పార్టీ శతవార్షికోత్సవాల ముగింపు సభ, డిసెంబర్ 24, 25 తేదీల్లో విజయవాడలో అంతర్జాతీయ సదస్సు ల విజయవంతానికి పార్టీ శ్రేణులు కషి చేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో శుక్రవారం రాష్ట్రపతి ప్రసంగంలో కూడా కుంభమేళా ప్రమాదాలపై ప్రస్తావన లేదని విమర్శించారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అజీజ్ పాషా, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకతీతంగా రాష్ట్ర ప్రయోజనాలు కాపాడండి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజకీయాలకతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని, రాజనీతిజ్ఞతను ప్రదర్శించాలని తెలంగాణ జాగృ తి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత సూచించారు.''తెలంగాణ జలవనరులు,ప్రాజెక్టలపై నీళ్ల నిజాలు'' అనే అంశంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సోమాజిగూడలోని హైదరా బాద్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం రౌండ్ టేండ్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కవితతో పాటు మాజీ కార్పొరేషన్ ఛైర్మన్ వి.ప్రకాశ్, సాగునీటి శాఖ మాజీ ఒఎస్‌డి శ్రీధర్ రావు దేశ్ పాండే, బిఆర్ఎస్ నాయకులు పల్లె రవి కుమార్ గౌడ్, తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ ఫోరం మాజీ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు టంకశాల అశోక్, కామెర నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించి సిఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. అంతకుముందు కవిత మాట్లాడుతూ వైఎస్ఆర్ ప్రారంభించిన ఆరోగ్య శ్రీని కెసిఆర్ కొనసాగించారని, కాంగ్రెస్ ప్రారంభించిన ఉపాధి హామీ పథకాన్ని బిజెపి కొనసాగిస్తోందని,ఇదే తరహాలో కెసిఆర్ ప్రారంభించిన పనులను కూడా సిఎం రేవంత్ రెడ్డి కొనసాగించాలని కోరారు.

## కులాంతర వివాహం చేసుకున్నవారి భద్రతకు ప్రత్యేక చట్టం తేవాలి: జాన్ వెస్లీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కులాంతర వివాహాలు చేసుకున్న వారి కోసం ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. చట్టాలు ఎన్ని వచ్చినా కులాంతర వివాహం చేసుకున్న వారిపై జరుగుతున్న హత్యలు, దాడులు, బహిష్కరణలపై ప్రభుత్వాలు, రక్షణ వ్యవస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, రాష్ట్రంలో ఇప్పటికే 45 కుల దురహంకార హత్యలు జరిగాయని ఆయన తెలిపారు. ఘటనలు జరిగిన వెంటనే నిర్ణీత కాలవ్యవధిలో విచారణ జరిపి అందుకు బాధ్యులైన వారికి భరోసా ఇవ్వాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. తుంగతుర్తి మండలం అన్నారం గ్రామంలో జరిగిన కుల దురహంకార హత్యను తీవ్రంగా ఖండించారు. గత ఐదు నెలల కింద దళితుడైన వడ్లకొండ కృష్ణ, బిసిసి కులానికి చెందిన భార్గవి కులాంతర వివాహం చేసుకోవడంతో తమ కుటుంబం పరువు పోయిందనే నెపంతో కృష్ణను హత్య చేశారని, ఈ నిందితులపై గతంలో అనేక కేసులున్నాయని, వీరి అరెస్టుతోనే సరిపెట్టకుండా, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి, కఠినశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. భార్గవికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు, భద్రత కల్పించాలని, కృష్ణ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలన్నారు.

## రాజకీయ ప్రసంగం : కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

మూడవసారి పదవీకాలంలో గత పరిపాలనల కంటే మూడు రెట్లు వేగంగా పనులు జరుగుతున్నాయని, వక్ఫ్ బోర్డు, 'ఒకే దేశం ఒకే ఎన్నిక' వంటి అంశాలపై నిర్ణయాలను ఉటంకిస్తూ అన్నారు. ముర్ము ప్రసంగం గురించి అడిగినప్పుడు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, పార్టీ సంస్థాగత వ్యవహారాల ఇంఛార్జ్ కె.సి.వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రపతితో 'స్పష్టమైన రాజకీయ ప్రసంగం' చేయించిందని అన్నారు. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ స్పందిస్తూ, ఇది చాలా ఊహించదగిన ప్రసంగం అని, ఎటువంటి ఆశ్చర్యాలు లేవని అన్నారు. 'ఆమె సొంత ప్రభుత్వాన్ని ప్రశంసించడం ఆమె పని, ఆమె అలా చేసింది. కానీ ఆమె ప్రసంగంలో ఏమి తొలగించబడ్డాయో, ప్రభుత్వం సాధించడంలో విఫలమైన విషయాల గురించి ప్రస్తావించకపోవడంపై మేము ఆందోళన చెందుతున్నాం. ఆర్థిక వ్యవస్థ పరిస్థితి, నేడు పేదలు, మధ్యతరగతి ప్రజలు బాధపడుతున్నారనే విషయం, నిరుద్యోగం చాలా ఎక్కువగా ఉందనేది వాస్తవం. యువత రికార్డు స్థాయిలో నిరుద్యోగాన్ని ఎదుర్కొంటున్నారు. విద్యావంతులైన యువతకు కూడా ఉద్యోగాలు లేవు' అని థరూర్ తన పీటీఐ వీడియోలో అన్నారు. 'ఈ పరిస్థితులన్నింటిలోనూ మేము నిజంగా సవాలును ఎదుర్కొంటున్నాం. భారతదేశంలోని సాధారణ పౌరుడు రోజురోజుకూ ఎదుర్కొంటున్న సమస్యల గురించి రాష్ట్రపతి ప్రసంగంలో ఎటువంటి అంగీకారం లేదు' అని ఆయన అన్నారు. కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ మాట్లాడుతూ ముర్ము ప్రసంగం 'దురదృష్టవశాత్తు ప్రభుత్వం సాధించిన విజయాల జాబితాను ఆచారంగా పునరావతం చేయడం తప్ప మరొకటి కాదు' అని తెలిపారు.

## గొప్పలతోనే సరి (మొదటి పేజీ తరువాయి)

పేపర్ లీకేజి ఘటనల ఊసే లేదని పేర్కొంది. ఉద్యోగావకాశాల కల్పనలో పాలక పక్ష అసమర్థత, తారస్థాయికి చేరిన నిరుద్యోగం గురించి ఒక్క మాటైనా రాష్ట్రపతి మాట్లాడలేదని దుయ్యబట్టింది. కోట్లాది మంది పౌరుల జీవితాలను ప్రభావితం చేసే వాస్తవాలను విస్మరిస్తూ... కేవలం గొప్పలు చెప్పుకోవడమే పనిగా రాష్ట్రపతి ప్రసంగించినట్లుగా ఉందని సీపీఐ విమర్శించింది. 'అధిక ధరలతో సామాన్యుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. భారత్‌లో విదేశీ రుణం 700 బిలియన్ డాలర్లను దాటడం ఆందోళన కలిగిస్తోంది. రూపాయి విలువ పడిపోతోంది. ఆర్థిక వ్యవస్థను అస్థిరంగా ఉంది. ప్రమాద ఘంటికలు మోగించే ఇలాంటి సమస్యలు ఉన్నప్పటికీ... అసలు కష్టాలు, సమస్యలే లేనట్లుగా దేశం సుభిక్షంగా ఉన్నట్లు రాష్ట్రపతి మాట్లాడారు. భారత్ ఆర్థిక స్వావలంభన, వృద్ధిపై గొప్పలు చెప్పుకున్నారు. ప్రభుత్వ విధానాల్లో లోటుపాట్లు, వైఫల్యాలను కప్పిపుచ్చుకున్నారు. చేదు నిజాలన్నీ విస్మరించారు. కార్పొరేట్లపై ప్రేమ ఒలకపోయడం, పర్యావరణం క్షీణిస్తుండటం, దేశంలో అసమానలు, సామాజిక అనిశ్చితి పెరుగుతుండటం గురించి కనీసం ప్రస్తావించలేదు' అని సీపీఐ దుయ్యబట్టింది. 2015–25లో బడా కార్పొరేట్లకు రూ.14లక్షల కోట్ల మేర రుణ మాఫీ జరిగినప్పటికీ మౌలిక రంగాభివృద్ధికి కానీ ఉద్యోగ సృష్టికి కానీ వారి నుంచి పెద్దగా తోడ్పాటు అందిన దాఖలాలు లేవని వ్యాఖ్యానించింది.బీజేపీ ఆర్ఎస్ఎస్ పాలనలో మైనారిటీలు, దళితులు, గిరిజనులు, మహిళలపై అకృత్యాలు, దురాగతాలు అనేకరెట్లు పెరిగాయని సీపీఐ తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తం చేసింది.

**ఎంఎస్‌పీ, సామాజిక ఘర్షణలు పట్టవా: ఎంపీ సంతోశ్ కుమార్**

రాష్ట్రపతి ప్రసంగంపై సీపీఐ ఎంపీ పి.సంతోశ్ కుమార్ స్పందిస్తూ రైతుల సమస్యలు, సామాజిక అసమానతలు, ఘర్షణలు పట్టవా అని ప్రశ్నించారు. రైతుల పోరాటం, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత, ఆల్ టైమ్ రికార్డుకు చేరిన సామాజిక ఘర్షణలకు రాష్ట్రపతి ప్రసంగంలో చోటు దక్కలేదని వ్యాఖ్యానించారు. 'మహా కుంభమేళలో తొక్కిసలాట జరిగి 40 మందికిపైగా ప్రాణాలు కోల్పోవడం దిగ్భ్రాంతికరమే అయినా దీని వెనుక తీవ్రమైన నిర్వహణ లోపం ఉంది. పోలీసులపై, సంస్థలపై నెపం నెట్టి తమ తప్పులను యూపీ ప్రభుత్వం చాకచక్యంగా కప్పిపుచ్చుకున్నది' అని విమర్శించారు. మణిపూర్‌లోని వాస్తవాలను ప్రజల ముందురకు తెచ్చేందుకు ప్రయత్నించిన కార్యకర్తలపై ఉక్కుపాదం మోపారని గుర్తుచేశారు.రాష్ట్రపతి ప్రసంగంలో ఎంఎస్‌పీకి చట్టబద్ధత, మత ఘర్షణలు వంటి కీలక అంశాల ప్రస్తావనకు రాలేదని సంతోశ్ కుమార్ అన్నారు.

## జమిలిపై ముందుకే

(మొదటి పేజీ తరువాయి)

చెందిన ఐదు కోట్ల మంది ప్రజల అభ్యున్నతికి రూ.80 వేల కోట్లతో ''ధర్తీ ఆబా ట్రైబల్ విలేజ్ ఉత్కర్ష్'' పథకం ప్రారంభమైందన్నారు.ప్రభుత్వ చర్యల ఫలితంగా 25 కోట్ల మంది పేదరికం నుంచి బైటపడి జీవితంలో ముందుకు సాగుతున్నారని రాష్ట్రపతి అన్నారు. వీరంతా నయా మధ్య తరగతి వర్గంగా ఆవిర్భవించారని, భారత అభివృద్ధి గమనంలో నూతన శక్తిని అందిస్తున్నారని తెలిపారు. భారత్ వంటి దేశంలో మధ్యతరగతి ఆకాంక్షలు, వాటిని నెరవేర్చడమే ఆర్థిక పురోగతిని నిర్వచిస్తుందని పేర్కొన్నారు. మధ్యతరగతి స్వపాలు ఎంత పెద్దగా ఉంటే, దేశం అంతగా అభివృద్ధి చెందుతుందన్నారు. మధ్యతరగతి వర్గం తోడ్పాటును తమ ప్రభుత్వం ప్రతి సందర్భంలో గుర్తించడంతో పాటు ప్రశంసిస్తుందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులలో మధ్య తరగతి కూడా కీలక ప్రతినిధులు అని వ్యాఖ్యానించారు. ఇటీవలనే తమ ప్రభుత్వం వారికి ఎనిమిదవ వేతన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 50 శాతం పెన్షన్ గ్యారెంటీగా ఇవ్వాలని నిర్ణయించిన ఏకీకృత పెన్షన్ పథకాన్ని విస్తృతంగా స్వాగతించారని అన్నారు. ఉడాన్ పథకం ద్వారా విమానం ఎక్కాలనే 1.5 కోట్ల ప్రజల కలలు నెరవేరాయని, జన్ ఔషధీ కేంద్రాల ద్వారా పౌరులకు రూ.30వేల కోట్లకు పైగా ఆదా అయ్యాయని తెలిపారు. విద్యారంగంలో వివిధ విభాగాలలో బహుళ సంఖ్యలో సీట్లు పెరగడం ద్వారా మధ్య తరగతి లబ్ది పొందిందన్నారు.విధానపరమైన ప్రతిష్టంభన స్థితి నుంచి ఆర్థిక వ్యవస్థను దృఢ నిశ్చయంతో తమ ప్రభుత్వం బైటకు తీసుకువచ్చిందన్నారు. కొవిడ్ 19 మహమ్మారి, అనంతర ప్రభావం, యుద్ధ సంబంధిత అస్థిరతలు వంటి అంతర్జాతీయ ఆందోళనల నేపయలో కూడా భారతీయ ఆర్థిక వ్యవస్థ అమోఘమైన స్థిరత్వాన్ని, పూర్వ స్థితిని సాధించడంలో తన శక్తిని నిరూపించుకున్నదని ముర్ము అన్నారు. తమ ప్రభుత్వం మూడు కోట్ల లక్‌పతి దీదీలను తయారు చేయాలని లక్షంగా పెట్టుకోగా, 1.15 కోట్ల మంది లక్‌పతి దీదీలుగా గౌరవప్రద జీవనం సాగిస్తుండగా, అందులో 50 లోల మంది ఆరు నెలల్లోనే లక్‌పతి దీదీలుగా మారారని రాష్ట్రపతి చెప్పారు. మన యువత స్టార్టప్‌ల నుంచి క్రీడలు, అంతరిక్ష అన్వేషణ వరకు ప్రతి రంగంలో దేశానికి గర్వకారణమవుతున్నారని తెలిపారు. గత రెండేళ్ళలో ప్రభుత్వం పది లక్షల మందికి శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిందన్నారు. జాతీయ విద్యా విధానం ద్వారా తమ ప్రభుత్వం ఆధునిక విద్యా వ్యవస్థను విద్యార్థులకు అందించే ఏర్పాటు చేస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. ఎవరు కూడా విద్యకు దూరం కాకుండా మాతృభాషలో చదువుకునే అవకాశం కల్పించామని వెల్లడించారు. వివిధ నియామక పరీక్షలను 13 భారతీయ భాషలలో నిర్వహించడం ద్వారా భాష సరిహద్దులను తొలగిస్తున్నామన్నారు. విద్యా వ్యవస్థల్లో పరిశోధనలను ప్రోత్సహించేందుకు రూ.50 వేల కోట్లతో జాతీయ పరిశోధన ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసామన్నారు. కొద్ది రోజుల క్రితం ఇస్రో వందవ ఉపగ్రహాన్ని విజయవంతంగా అంతరిక్ష క్షక్షలో ప్రవేశపెట్టిందని, ఇస్రో సాధించిన ఘనతకు దేశ ప్రజల తరుపున అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ స్థాయి క్రీడల ఈకో సిస్టమ్‌ను దేశంలో సృష్టించేందుకు కీలక చర్యలు తీసుకున్నామని, ఖేలో భారత్ పథకం, జాతీయ క్రీడల విశ్వవిద్యాలయం వంటి చర్యలను తీసుకున్నామన్నారు. కృత్రిమ మేథా రంగాన్ని భారత్‌లో పైకి తీసుకెళ్ళేందుకు ఇండియా ఎఐ మిషన్‌ను ప్రారంభించామని తెలియజేశారు. గడిచిన పదేళ్ళలో తమ ప్రభుత్వం పురోగతిలో నూతన అధ్యాయాలను లిఖించిందని, అందులో ఒకటైన భారత డిజిటల్ విప్లవం స్వర్ణ మైలురాయి అని రాష్ట్రపతి అభివర్ణించారు. ప్రపంచంలోని 50 శాతం రియల్ టైమ్ డిజిటల్ లావాదేవీలు భారతదేశంలోనే జరుగుతున్నాయన్నారు. డిజిటల్ టెక్నాలజీని తమ ప్రభుత్వం సామాజిక న్యాయం, సమానత్వానికి పరికరంగా ఉపయోగించుకున్నామని తెలిపారు. అదే సమయంలో డిజిటల్ వ్యవస్థ పెరిగిన నేపథ్యంలో సైబర్ భద్రత జాతీయ ప్రాధాన్యతల్లో కీలక అంశంగా మారిందని రాష్ట్రపతి అన్నారు. డిజిటల్ మోసాలు, సైబర్ నేరాలు, డీప్ ఫేక్ వంటి నతన టెక్నాలజీలు మన సామాజిక, ఆర్థిక, జాతీయ భద్రతపై సవాళ్ళను విసురుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశం మెట్రో రైల్ నెట్‌వర్క్ వెయ్యి కిలోమీటర్ల మైలు రాయిని దాటిందని, ఇది ప్రపంచంలో మూడవ స్థానమని తెలిపారు. పరిశుభ్రమైన పట్టణ రవాణాకు రూ.8వేల కోట్లతో 52 వేల కోట్ల అదనపు ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురానున్నట్లు చెఅప్పరు. 2023–24లో భారతదేశం రికార్డు స్థాయిలో 332 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పతి చేసిందన్నారు. పాలు, పప్పు ధాన్యాలు, మసాలలను అత్యధికంగా ఉత్పత్తి చేస్తున్న దేశం మనదన్నారు. పోలవరం నీటి పారుదల ప్రాజెక్టుకు అదనంగా రూ.12వేల కోట్లు మంజూరు చేసామన్నారు.ఈశాన్య భారత ప్రజల ఆకాంక్షలు తమ ప్రభుత్వానికి తెలుసునని, వారిలో వేరు అనే భావాన్ని తొలగించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్రపతి తెలిపారు. పది శాంతి ఒప్పందాల ద్వారా పలు ముఠాలను శాంతి మార్గంలోకి తీసుకువచ్చామన్నారు. భౌగోళిక అస్థిరత్వ వాతావరణంలో భారతదేశంల ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థిరత్వానికి స్థంభంగా నిలచిందని, ప్రపంచానికే ఉదాహరణగా నిలిచిందన్నారు. జి 7 శిఖరాగ్ర సదస్సు, క్వాడ్, బ్రిక్స్, ఎస్‌సిఓ లేదా జి 20 వంటి సదస్సులేవైనా భారత దేశ బలం, విధానాలు, ఆలోచనలపై ప్రపంచం విశ్వాసం ఉంచాయన్నారు. భారతదేశాన్ని రాబోయే సంవత్సరాలలో అభివృద్ధి చెందిన దేశంగా రూపొందించేందుకు కట్టుబడి ఉన్నామని రాష్ట్రపతి అన్నారు. ఈ నిశ్చితాభిప్రాయానికి దేశం కోసం త్యాగాలు చేసిన అమరులు, బాపూజీ ఆదర్శాలు, మనతో ఐక్యత ప్రమాణం చెయించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ లాంటి భారత మాత పుత్రులు స్ఫూర్తిదాయకులని పేర్కొన్నారు.

## ఘనమైన అంచనాలు

(మొదటి పేజీ తరువాయి)

ఆర్‌బిఐ అంచనాలను అందుకోలేకపోయింది. వృద్ధి రేటు మందగించడం, ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణ పరిస్థితులు, నిరుద్యోగం, వ్యవసాయాభివృద్ధి తదితర కీలక అంశాల్లో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయితే, భవిష్యత్తును మాత్రం నిర్మల గొప్పగా ఆవిష్కరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం (జనవరి–మార్చి)లో ఆహార ద్రవ్యోల్బణం తగ్గుతుంది ఆర్థిక సర్వే జోస్యం చెప్పింది. కాలానుగుణ పండ్ల సరఫరా పెరగడం, ఖరీఫ్ పంట రావడం వంటి అంశాలు ధరల తగ్గదలకు బాటలు వేస్తాయని పేర్కొంది. ఈ ప్రభావమే 2025–2026 ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలోనూ కొనసాగవచ్చని అంచనా వేసింది. అయితే, వాతావరణ పరిస్థితులు, అంతర్జాతీయ వ్యవసాయిక ఉత్పత్తుల తీరతెన్నులు, వాటి ధరలు వంటి పలు అంశాలు ఆహార ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపుతాయని పేర్కొంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ లక్ష్యాలను అందుకోలేకపోతే చూపాల్సిన కారణాలను ముందుగానే ప్రస్తావించింది. 2024–25 ఆర్థిక సంవత్సరం జాతీయ ఆదాయం డాటాను పరిశీలిస్తే, దేశం అన్ని రంగాల్లోనూ బలోపేతమైందని ఈ సర్వే పేర్కొంది. వ్యవసాయ రంగం పటిష్టంగా ఉందని, గత అంచనాలకంటే మెరుగైన ఫలితాలను సాధించిందని తెలిపింది. అదే విధంగా కొవిడ్ 19 కారణంగా ఎదురైన సమస్యల నుంచి దేశం బయటపడిందని, పారిశ్రామిక రంగం క్రమంగా కోలుకుందని ఈ సర్వే ప్రకటించింది. సేవా రంగంలోనూ అభివృద్ధి నమోదైనట్టు తెలిపింది. అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్లో హెచ్చుతగ్గుల ప్రభావం భారత్‌పైన కూడా పడవచ్చని పేర్కొంది. అయితే, విదేశీ మారక ద్రవ్య నిల్వలు 2024 జనవరిలో 616,7 బిలియన్ డాలర్లుకాగా, సెప్టెంబర్ నాటికి 704.9 బిలియన్ డాలర్లకు పెరిగినట్టు ఆర్థిక సర్వే వివరించింది. ఉద్యోగితా శాతం పెరిగిందని, అదే క్రమంలో ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్ఒ) ఖాతాలు రెండింతలు పెరిగాయని పేర్కొంది. 2018–2019 ఆర్థిక సంవత్సరంలో ఉన్న 61 లక్షల సబ్‌స్క్రిప్షన్లు ఉండగా, 2023–2024 ఆర్థిక సంవత్సరానికి 131 లక్షలకు చేరినట్టు వివరించింది. ఇలాంటి ఘనమైన అంకెలు, వివరాలు, అంచనాలో ఆర్థిక సర్వే దేశం అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నట్టు చూపించింది. కానీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని పెరుగుతున్న ధరలు, వేధిస్తున్న నిరుద్యోగం వంటి సమస్యలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సర్వే ఆధారంగా శనివారం (ఫిబ్రవరి 1న) నిర్మల ప్రవేశపెట్టబోయే బడ్జెట్ తీరుతెన్నులు ఎలా ఉంటాయన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

**ఆర్థిక సర్వే కీలకాంశాలు..**

ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) ముగింపు నాటికి దేశ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధి రేటును 6.4 శాతంగా అంచనా. అదే విధంగా 2025–26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.36 నుంచి 6.8 శాతంగా ఉండే అవకాశాలున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా రాజకీయ, వాతావరణ పరిస్థితుల్లో మార్పులు రావచ్చు. భారత ఆర్థిక వ్యవస్థపై వీటి ప్రభావం ఎక్కువగా ఉండవచ్చు. ఖరీఫ్ పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది కాబట్టి, రాబోయే కాలంలో ఆహార ద్రవ్యోల్బణం తగ్గే సూచనలు ఉన్నాయి. ప్రైవేటు రంగ స్థిరీకరణ కారణంగా, వచ్చే ఆర్థిక సంవత్సరంలో వస్తూత్పత్తి పెరిగి ద్రవ్యోల్బణ రేటు గణనీయంగా తగ్గే అవకాశాలున్నాయి. ప్రభుత్వ మూలధనం పెరుగుతున్నది. ఫలితంగా వ్యాపార అంచనాలు పెరుగుతున్నాయి. మరింత ఎక్కువ పెట్టుబడులు సాధ్యంగా కనిపిస్తున్నది. అయితే, అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా తయారీ రంగం ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉంది. దేశంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయి. దీనితో జిడిపి రేటు పెరుగుతుంది. 2020తో పోలిస్తే ఇప్పుడు ఈ రంగంలో వృద్ధి 38.8 శాతంగా ఉంది. మౌలిక సదుపాయల కల్పనలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 5853 కిలోమీటర్ల జాతీయ రహదారుల నిర్మాణం పూర్తయింది.

**సగటు జీవికి ఊరట లభించేనా?**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం (ఫిబ్రవరి 1) లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న 2025–26 ఆర్థిక సంవత్సర వార్షిక బడ్జెట్‌పై సామాన్యులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. అయితే, వారికి ఊరట లభిస్తుందా లేక పన్నుల భారం మరింత పెరుగుతుందా అన్నది ప్రశ్న. ప్రజల నుంచి మాత్రం పలు డిమాండ్లు ఉన్నాయి. వాటిలో ప్రధానమైనవి ఆదాయ పన్ను స్లాబ్ పెంపు, జిఎస్‌టి రేట్లు తగ్గింపు. ఎలక్ట్రిక్ వాహనాలు (ఇవి)పై పన్ను, హౌసింగ్ ప్రయోజనాలతోపాటు సేవింగ్ ఇన్సెంటివ్‌లలో మార్పులు జరగాలన్న ప్రతిపాదనలు చాలాకాలంగా ఉన్నాయి. వీటిపై నిర్మలమ్మ ఎలా స్పందిస్తారో చూడాలి. ఆదాయ పన్ను పరిమితిని రూ. 4 లక్షలకు పెంచి, ఓవరాల్ టాక్స్ స్లాబ్‌ను రూ. 10 లక్షలు చేయాలన్నది సాధారణ ప్రజల కోరిక. ఆదాయ పన్నులో హోమ్‌లోన్‌పై వడ్డీ మినహాయింపును సెక్షన్ 24 'బి' కింద రూ. 2 లక్షల నుంచి రూ. 3 లక్షలకు పెంచాలని కూడా కోరుతున్నారు. అదే విధంగా జాతీయ పింఛన్ వ్యవస్థలో టాక్స్ డిడక్షన్ పరిధిని రూ. 50,000 నుంచి రూ. 1,00.000కు పెంచాలన్న అభ్యర్థన ఉంది. టైప్ II నగరాల్లో హెచ్‌ఆర్‌ఎ మినహాయంపును 50 శాతంగా ఖరారు చేయాలని కోరుతున్నారు. సెక్షన్ 80 'డి' కింద ఆరోగ్య బీమాలో వ్యక్తిగత ఆదాయపన్ను చెల్లింపుదారుల టాక్స్ మినహాయింపును రూ. 50,000లకు పెంచుతారన్న ఆశాభావం వ్యక్తమవుతున్నది. అదే సెక్షన్ కింద టాక్స్ కడుతున్న వృద్ధులకు డిడక్షన్ లిమిట్‌ను రూ. 1,00,000గా మార్చాలన్న సూచన వినిపిస్తున్నది.

## శంకుస్థాపన (మొదటి పేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడుతూ నూతన ఉస్మానియా ఆస్పత్రిని రానున్న రెండున్నరేళ్లలో పూర్తి చేస్తామన్నారు. రూ. 2700ల కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే నూతన భవనంలో మొత్తం 40 డిపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేస్తున్నామని, దూర ప్రాంతాలనుంచి వచ్చే పేదలకు అన్ని వైద్య సేవలను ఉచితంగాఅందూలా చూస్తామని తెలిపారు. అత్యాధునిక సౌకర్యాలతో, అంతర్జాతీయ స్థాయిలో ఆసుపత్రిని నిర్మిస్తామని, నూతన భవన నిర్మాణానికి అనేక ఆటంకాలు ఏర్పడినప్పటికీ ప్రస్తుతం అన్నీ అంశాలు ఆస్పత్రి నిర్మాణానికి కలిసొస్తున్నాయని చెప్పారు. ఆస్పత్రి నాలుగు వైపుల రోడ్లను, స్కైవాక్‌ను ఏర్పాటు చేస్తున్నామని, స్థానికులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని భరోసనిచ్చారు. 11 ఎకరాలను పోలీసు విభాగానికి వదిలిపెట్టామని, ఇందులో హెలిప్యాడ్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో ఉన్న ఉస్మానియా బ్రాండ్‌ను కాపాడుతామన్నారు.

## ప్రత్యేక చర్చ (మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 7వ తేదీన శాసనసభ ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వివిధ పత్రికలలో వార్తలు వచ్చాయన్నారు. రాజ్యాంగం 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'రాజ్యాంగం, దాని అమలు, విజయాలు, భవిష్యత్ కార్యాచరణ'పై ప్రత్యేక చర్చ పెట్టాలని కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఇటీవల పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో 75 సంవత్సరాల రాజ్యాంగంపై ఉభయ సభలు చర్చించిన విషయం తెలిసిందేనని లేఖలో గుర్తుచేశారు. ఫిబ్రవరి 7న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన శాసనసభ ప్రత్యేక సమావేశాల్లో కూడా ప్రత్యేకంగా ఒక రోజు కేటాయించి 75 ఏళ్ల భారత రాజ్యాంగంపై చర్చ జరపటం సముచితంగా వుంటుందని సూచించారు. దీనికోసం శాసనసభ నాయకులుగా ఉన్న ముఖ్యమంత్రి చొరవ చూపాలని కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఈ లేఖ ప్రతులను స్పీకర్‌తో పాటు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రికి సైతం పంపించినట్లు కూనంనేని సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు.



## బిసిలకు చెందిన 40 కులాలను.. కేంద్ర ఒబిసి జాబితాలో చేర్చాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలకు చెందిన 40 కులాలను కేంద్ర ఒబిసి జాబితాలో చేర్చాలని, రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని బిసి సంక్షేమ శాఖ నిర్ణయించింది. బిసి రాష్ట్ర కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి హైదరాబాద్‌లోని సచివాలయంలో రవాణ, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, కమిషన్ మెంబర్ సెక్రటరీ బాల మాయాదేవి తదితరులు పాల్గొన్నారు. ఇటీవల బిసి కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా పది ఉమ్మడి జిల్లాల్లో పర్యటించిందని, ఈ సందర్భంగా వచ్చిన పలు సిఫారసులు, సమస్యలు, అభ్యంతరాలను కమిషన్ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని కులాల పేర్లను మార్చాలని, తదితరులు ప్రాస్తావించి, కమిషన్ దృష్టికి తీసుకొచ్చిన అంశాలను వారు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకొచ్చారు. బిసిల అభ్యున్నతికి కమిషన్, మంత్రిత్వ శాఖ చర్చించి, కొన్ని కీలక అంశాలతో ముందుకు పోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

## ప్రతిపంట గరిష్ట ధరకు అమ్మించాల్సిన బాధ్యత అధికారులదే

మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** రైతులు మార్కెట్లకు తీసుకువచ్చే ప్రతి పంటను గరిష్ట ధరకు అమ్ముకునే విధంగా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. పలు మార్కెట్లల్లో రైతులకు గిట్టుబాటు ధర లభించడంలేదన్న అంశం మంత్రి దృష్టికి రావడంతో శుక్రవారం సంబంధిత అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. రైతులు నష్టపోకుండా క్రయవిక్రయాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత మార్కెటింగ్ డైరెక్టర్లు, ప్రాంతీయ, జిల్లా అధికారులదేనని, ఎవరు నిర్లక్ష్యంవహించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్‌లకు మార్కెటింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను పంపించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలకు తగ్గట్టు ఉన్న పంట ఉత్పత్తులకు మద్దతు ధర అందించాల్సిందే అని, ఈ విషయంలో ప్రత్యేక బృందాలు చొరవ తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఇందుకు సంబంధిత జిల్లా అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

## కుంభమేళాలో జగిత్యాల, కడెంకు చెందిన నలుగురు మహిళలు మిస్సింగ్

**ప్రజాపక్షం/కడెం :** కుంభమేళాకు వెళ్లిన తెలంగాణకు చెందిన నలుగురు మహిళలు తప్పిపోయారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా జరుగుతున్న విషయం తెలిసిందే. కోట్లాదిమంది భక్తులు తరలివచ్చి పవిత్రస్నానాలు అచరిస్తున్నారు. కాగా గత మంగళవారం అర్ధరాత్రి జరిగిన తొక్కిసలాటలో 30 మంది దుర్మరణం చెందారు. వందమందికి పైగా గాయాలపాలయ్యారు. ఈ ఘటనకు ముందే జగిత్యాలకు చెందిన ఇద్దరు, నిర్మల్ జిల్లా కడెంకు చెందిన ఇద్దరు మహిళలు కుంభమేళాకు చేరుకున్నారు. జగిత్యాలలోని విద్యానగర్‌కు చెందిన నర్సవ్వ(55), కొత్తవాడకు చెందిన రాజవ్వ(55), కడెంకు చెందిన బుచ్చవ్వ (65) అక్కా చెల్లెళ్లు. కడెంకు చెందినర సత్తవ్వ(55) బుచ్చవ్వకు వియ్యపురాలు అవుతుంది. వీరితోపాటు మరో ఏడుగురు మహిళలు మొత్తం 11 మంది కలిసి ఈనెల 20వ తేదీన కుంభమేళాకు వెళ్లారు. శుక్రవారం ఉదయం నుంచి ఈ నలుగురు మహిళలు కుటుంబ సభ్యులకు ఫోన్‌లో టచ్‌లో లేరు. మిగతా మహిళలు క్షేమంగా ఉన్నారు. వీరి నుంచి విడిపోయిన నలుగురు మహిళలు ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు.? ఎలా ఉన్నారో తెలియరావడంలేదు. వీరి ఆచూకీ కోసం కడెం, జగిత్యాల నుంచి కుటుంబ సభ్యులు కుంభమేళా బయలుదేరి వెళ్లారు.



## టూరిజం ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

మంత్రి జూపల్లి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పర్యాటక శాఖలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను త్వరలో పరిష్కార మార్గం చూపిస్తానని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. శుక్రవారం పర్యాటక శాఖ ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం (ఎఐటియుసి)ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి జూపల్లి సచివాలయంలో ఆవిష్కరించారు. పర్యటకశాఖలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను యూనియన్ అధ్యక్షులు వివిఎస్ బోస్, ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి జూపల్లి కృష్ణారావుస్పందిస్తూ తదుపరి సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించి తప్పకుండా పరిష్కరిస్తామని యూనియన్ నాయకులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటకశాఖ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ నాయకులు శంకర్ రావు, ప్రసాద్ పాల్గొన్నారు.

## మాజీ చైర్మన్లు, కౌన్సిలర్లు ప్రజల్లోనే ఉండాలి : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పదవీ కాలం ముగిసిన చైర్మన్లు, కౌన్సిలర్లు ప్రజల్లోనే ఉండాలని, మళ్లీ ఎన్నికలు వస్తే ప్రజలు గెలిపించుకుంటారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధితో పట్టణాలతో పాటు ప్రజల ఆస్తుల విలువ పెరిగితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పట్టణాల అభివృద్ధి కుంటుపడిందని, ప్రజల ఆస్తుల విలువ కూడా భారీగా పడిపోయిందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం జరిగిన మున్సిపల్ చైర్‌పర్సన్ సన్మాన కార్యక్రమంలో కెటిఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ తమ పదేళ్ల పాలనలో పక్కా ప్రణాళికతో పాటు అవసరమైన సంస్కరణలు, నిరంతర పర్యవేక్షణ,అవసరమైన నిధులను కేటాయించడం లాంటి నిరంతర ఫోకస్‌తోనే పట్టణాలు మోడల్ పట్టణాలుగా మారాయన్నారు. తెలంగాణ పట్టణాలకు పదేళ్ల కాలంలో అనేక జాతీయ అవార్డులు దక్కాయన్నారు. ప్రభుత్వాన్ని నడిపేవారి ఆలోచనలు సానుకూలంగా ఉంటేనే రాష్ట్రం, పట్టణాలు అభివృద్ధి చెందుతాయన్నారు. మోసపూరిత 420 హమీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పరిపాలన చేయడం రావడంలేదని ఎద్దేవా చేశారు. టకీటకీ మంటూ పైసలు పడుతాయని చెప్పారని, కానీ టకీ టకీమని ఢిల్లీలో పైసలు పడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ మంత్రులు జి.జగదీష్ రెడ్డి, మల్లారెడ్డి, మహమూద్అలీ, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతిరాథోడ్, ఎంఎల్‌సి మధుసూదనచారి హాజరయ్యారు.

# కెసిఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపాటు

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన పూర్తిగా విఫలమైందని, దీనిని ఎండగట్టేందుకు త్వరలోనే తాను బయటికి వస్తానని బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు, మంత్రులు మండిపడ్డారు. బిఆర్ఎస్ పార్టీ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి, నేతలు పార్టీ మారకుండా ఉండేందుకే కెసిఆర్ ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నారని వారు పేర్కొన్నారు. కెసిఆర్ వ్యవహారం కుంభకర్ణుడు సుధీర్ఘ నిద్ర నుంచి లేచి పెడబొబ్బలు పెట్టినట్లుగా ఉందని వారు వ్యాఖ్యానించారు. కెసిఆర్ వ్యాఖ్యలపై టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాశ్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ ఎంపి మల్లు రవి, సీనియర్ నాయకులు అద్దంకి దయాకర్ తీవ్రంగా స్పందించారు.

**కెసిఆర్ ఫామ్‌హౌస్‌లో ఉండి కలలు కనడం మానుకోవాలి : మహేశ్ కుమార్ గౌడ్**

మాజీ సిఎం కెసిఆర్ ఫామ్‌హౌస్‌లో ఉండి కలలు కనడం మానుకోవాలని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి అభ్యర్థులు కూడా దొరికే పరిస్థితి లేకపోవడంతో అభ్యర్థుల కోసం కెసిఆర్ ఇటువంటి ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు ఫామ్ హౌస్ పాలన, గడీలపాలనను కోరుకోవడంలేదని, ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. పదేళ్ల కెసిఆర్ పాలనలో సాధించలేని ప్రగతిని కాంగ్రెస్ ఏడాది పాలనలో సాధించడంతో కెసిఆర్ దిక్కుతోచక వాస్తవ పరిస్థితులకు భిన్నంగా మాట్లాడుతున్నారని మహేష్‌కుమార్ విమర్శించారు. ఇప్పటికే ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కూరుకుపోయిన కెసిఆర్ కుమార్తె కవితపై ఇప్పుడు మరో లిక్కర్ స్కామ్ ఆరోపణలు రావడంతో ఆయన ఆ అంశాన్ని పక్కదారి పట్టించేలా మాట్లాడుతున్నారని అన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను ప్రజలు గద్దెదించినా, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటూ దక్కకపోయినా గుణపాఠం నేర్వని కెసిఆర్ ఫామ్‌హౌస్‌లో పగటి కలలు కంటున్నారన్నారు. ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి రాకుండా విఫలమైన కెసిఆర్, కాంగ్రెస్ విఫలమైందని వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధితో బిఆర్ఎస్ ఉనికికే ప్రమాదం ఏర్పడడంతో,



రానున్న స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి అభ్యర్థులే కరువైన నేపథ్యంలో ఆయన కాంగ్రెస్‌పై అవాకులు చవాకులు పలుకుతున్నారని అన్నారు. ప్రజలు ఛీకొట్టినా కెసిఆర్ వ్యవహారశైలి, మాటతీరులో మార్పు రాకుంటే రానున్న స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకి మరోసారి భంగపాటు తప్పదని హెచ్చరించారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనపై, ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు ఎన్నిసార్లు సవాల్ విసిరినా స్పందించని కెసిఆర్ ఫామ్‌హౌస్‌లో కూర్చుని ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో 50వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేయడం ఆయనకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కెసిఆర్ ప్రభుత్వం చేసిన అప్పులతో రాష్ట్ర ఖజానా ఖాళీ అయినా, ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ, రైతు భరోసా, వరికి బోనస్, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనతో రేషన్ కార్డుల కోసం నిరుపేదలు ఎదురు చూస్తే పట్టించుకోని కెసిఆర్, కాంగ్రెస్ ప్రభుత్వం 40 లక్షల వరకు రేషన్ కార్డులు ఇస్తుంటే తట్టుకోలేకపోతున్నారని మహేష్‌కుమార్ విమర్శించారు.

**ప్రజలన్నా, ప్రజాతీర్పు అన్నా కెసిఆర్‌కు ఏనాడూ గౌరవంలేదు : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

ప్రజలన్నా, ప్రజాతీర్పు అన్నా కెసిఆర్‌కు ఏనాడూ గౌరవం లేదని, పదేండ్లు అధికారం ఇచ్చిన ప్రజలకు ఓడిపోయిన తర్వాత ఇప్పటివరకు వరకు కూడా కనీసం కృతజ్ఞత తెలపలేదని, ప్రజాతీర్పును శిరసావహిస్తున్నామని కూడా ప్రకటించలేదని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. కెసిఆర్ గర్జనలు, గంభీరాలు గమనిస్తున్నామని, ఫామ్ హౌస్‌లోనే ఉండి మాట్లాడతారా లేదా అసెంబ్లీకి వస్తారా? అని ప్రశ్నించారు. గత 13 నెలల పాటు ఫామ్‌హౌజ్‌కే పరిమితమై ఇంతకాలం మౌనంగా ఉన్నారని, ప్రతిపక్ష నాయకుడంటే ప్రజల్లో



తిరగాలన్నారు. ప్రజా సమస్యలు ప్రస్తావించాలని, వర్షాలు వచ్చినా, వరదలు వచ్చినా కనీసం ప్రజలను కెసిఆర్ పరామర్శించలేదని, ఫామ్‌హౌస్ దాటలేదని ఆయన విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు సచివాలయానికి రాలేదని, ప్రతిపక్ష నేతగా ఏడాది నుంచి అసెంబ్లీకి రాలేదని, ప్రజల్లోకి రాలేదని, కెసిఆర్ జీవితమంతా ఫామ్‌హౌస్‌కే పరిమితమైందన్నారు. ఈ ఏడాది కాలంలో నల్గొండ, కరీంనగర్ బిఆర్ఎస్ సభల్లో కూడా, ఇప్పటిమాదిరిగానే గంభీర ప్రకటనలు చేశారని, ఆ తర్వాత ఏమయ్యారో అందరికీ తెలిసిందేనన్నారు. ప్రతిపక్షనేతగా అసెంబ్లీ ముఖం చూడని కెసిఆర్ తన ఉనికిని చాటుకోవడానికి, నేనున్నానని చెప్పుకోవడానికి తుపాకీ రాముడిలా, పిట్టల దొరలా మాట్లాడుతున్నారు.

**పార్టీ నేతలను కాపాడుకునేందుకే ప్రగల్భాలు : మల్లు రవి**

కాంగ్రెస్ ప్రభుత్వంపై కెసిఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ ఎంపి మల్లు రవి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోషల్ మీడియాలో మాత్రమే బిఆర్ఎస్ పార్టీనేతలకు, నాయకులు, కార్యకర్తలు పనిచేస్తున్నారన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం సోషల్ మీడియా కాకుండా రాష్ట్ర ప్రజలను నమ్ముకున్నదని, ఈ క్రమంలోనే తాము పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికలకు వెళ్తామని ఆయన చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ జిమ్మిక్కులు చేసి, బిఆర్ఎస్ నేతలే సోషల్ మీడియాలో పోల్స్‌కు ఓట్లేసి వారికే మెజార్టీ వచ్చిందని చెప్పుకునే ప్రయత్నం చేశారని, ఇది కేవలం చెప్పుకోవడానికి మాత్రమే పనికొస్తుందని అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీ ప్రజల కోసం పోరాటం చేయడంలేదని, వారి పార్టీ అస్థిత్వాన్ని కాపాడుకునే ప్రయత్నం చేసి కెటిఆర్, హరీష్ రావు విఫలమయ్యారని, తాజాగా ఆ పని కెసిఆర్ ఆ ప్రయత్నం మొదలు పెట్టాడన్నారు.



**రేవంత్ దెబ్బకు ఫామ్‌హౌస్‌లో పడ్డ కెసిఆర్ : ఆది శ్రీనివాస్**

అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి టిపిసిసి అధ్యక్షుడు, ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొట్టిన దెబ్బకు కెసిఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితమైన విషయం మరిచిపోవద్దని, ప్రజలు ఇందిరమ్మ రాజ్యం తీసుకురాగా రేవంత్‌రెడ్డి సిఎం అయ్యారనే విషయాన్ని మరిచిపోతున్నారని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ అన్నారు. గత 13 నెలలుగా అసెంబ్లీకి రాకుండా, ప్రజలను కలవకుండా ఫామ్‌హౌస్‌లో ఎంజాయ్ చేసిన కెసిఆర్ నేడు పంచాయతీ ఎన్నికలు వస్తున్నాయని బయటకు వస్తానంటున్నారన్నారు. కెసిఆర్‌కు ఎన్నికలు తప్ప ప్రజల సంక్షేమం ముఖ్యం కాదని ఆయన వైఖరితో అందరికి అర్థమైందన్నారు.

**కెసిఆర్ బయటికి వస్తే ఆయన బండారం బయటపడుతుంది : అద్దంకి దయాకర్**

కెసిఆర్ ఫామ్ హౌజ్ నుంచి బయటకు రావాలనే ఎదురు చూస్తున్నామని, అప్పుడే ఆయన బండారం బయటపడుతుందని కాంగ్రెస్ నాయకులు దయాకర్ అన్నారు. మాజీ సిఎం కెసిఆర్ బయటకు రావాలనే చూస్తున్నామని, ఆయన బయటకు వస్తే ప్రజలు ఎలా స్వీకరిస్తారో చూద్దామని అన్నారు. తెలంగాణ సమాజానికి ద్రోహం చేసి బిజెపి పార్టీ ముసుగులో భారత రాష్ట్ర సమితి అని పెట్టుకుని మళ్ళీ తెలంగాణ సెంటిమెంట్ రగిలిస్తే కెసిఆర్‌ను ప్రజలు ఎట్లా స్వీకరిస్తారో చుద్దామని దయాకర్ వ్యాఖ్యానించారు. కెసిఆర్‌ను ఇంకా తెలంగాణ ప్రజలు మిమ్మల్ని భరించడానికి సిద్ధంగా లేరనే విషయం కెసిఆర్ బయటకు వచ్చిన అనంతరం తెలుస్తుందన్నారు. కెసిఆర్‌పై, ఆయన కుటుంబంపై ఎన్ని కేసులున్నాయో, బిజెపి ఎలా సహకరిస్తుందో, బిజెపి ఆటలో బిఆర్ఎస్ కీలుబొమ్మగా ఎలా మారారో ప్రజలకు తెలుసునని దయాకర్ దుయ్యబట్టారు.

## దళిత సంక్షేమానికి సరిపడ నిధులు కేటాయించాలి

కుల దురహంకార హత్యలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** దళితుల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులను కేటాయించడంతోపాటు వీరిపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం రాజ్ బహదూర్‌గౌర్ హాల్‌లో దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బాలనరసింహ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టిన తర్వాత దళిత సంక్షేమానికి నిధుల కోత విధించడంతోపాటు దాడులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ భద్రత, దళితుల భద్రత, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు, జనాభాకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు, ప్రమోషన్లలో రిజర్వేషన్లు, అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలకు సన్నద్ధం కావాలన్నారు. దీర్ఘకాలిక సామాజిక ఉద్యమం ద్వారానే దళితులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులను సాధించుకోగలుగుతామని తెలిపారు. దళిత కుటుంబాలు పరిమిత విద్య ద్వారా కొన్ని ఉద్యోగాలను పొందగలుగుతుండగా, ప్రభుత్వరంగ సంస్థలను ప్రభుత్వం ప్రైవేటీకరించడం ద్వారా ఉపాధి అవకాశాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రైవేటీకరణను నిలిపివేయాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. సామాజికంగా గుర్తింపులేని దళితులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించడమే సబ్ ప్లాన్ ముఖ్య ఉద్దేశం కాగా, ప్రభుత్వం ఈ నిధులను దళితుల ప్రత్యేక కార్యక్రమాలకు వినియోగించకుండా సాధారణ కార్యక్రమాలకు మళ్లిస్తోందన్నారు. అసైన్డ్ భూములు కాంగ్రెస్ ప్రభుత్వాల్లో ఇచ్చినవేనని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు బిసి, ఎస్‌సి, ఎస్‌టి, పేద అసైన్డ్ రైతులకు మేలు జరిగేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

గత ప్రభుత్వంలో దళితుల నుండి అభివృద్ధి పేరుతో లాగేసుకున్న భూమిని తిరిగి దళితులకి ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనవరి 26న వడ్ల కొండ కృష్ణ అలియాస్ మాలబంటిని అత్యంత కిరాతకంగా హత్య చేశారని, కులదురహంకార హత్యకు పాల్పడిన హంతకులను కఠినంగా శిక్షించాలని, పౌర సమాజం మానవీయ కోణంలో ఈ హత్యలను ఖండించాలని అయన కోరారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా చూడాలని, కులాంతర వివాహితులకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్ కుమార్, ఆఫీస్ బేరర్స్ కె.సహదేవ్, ఎ.రాజ్ కుమార్, జె.కుమార్ స్వామి, టి.రామకృష్ణ, కె.వెంకటస్వామి, వై .ఉష్రశీ, బిలక్ష్మీ పతి, కె.రాజ రత్నం తదితరులు పాల్గొన్నారు.



## కస్తుర్బా పాఠశాలల్లో.. దేశ్‌పాండే ఫౌండేషన్ సేవలు అందించాలి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్రంలోని కస్తుర్బా బాలికల పాఠశాలల్లో దేశ్‌పాండే ఫౌండేషన్ సేవలు అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక పరిస్థితుల మార్పు కోసం పనిచేస్తున్న దేశ్‌పాండే ఫౌండేషన్ ప్రతినిధులు శుక్రవారం సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఆంగ్లంలో శిక్షణ ఇస్తున్న, విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచడానికి పనిచేస్తున్నామని ఫౌండేషన్‌ను సిఎం ఈ సందర్భంగా అభినందించారు. రాష్ట్రంలో తమ కార్యక్రమాల విస్తరణకు ప్రభుత్వ సహకారం అందించాలని ఫౌండేషన్ ప్రతినిధులు సిఎంను కోరారు. మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను దత్తత తీసుకోవాలని సిఎం చేసిన సూచనలకు ఫౌండేషన్ అంగీకరించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు గురు రాజ్ దేశ్‌పాండే, జయశ్రీ దేశ్‌పాండే, రాజురెడ్డి, జి.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## నీచమైన రాజకీయాల గురించి ఎంఎల్‌సి కవిత మాట్లాడడం విడ్డూరం

ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీచమైన రాజకీయాల గురించి ఎంఎల్‌సి కవిత మాట్లాడడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. 'నీచమైన రాజకీయాలు ఎవరు చేస్తున్నారో, కవిత ఫ్యామిలీ డైవర్షన్ పాలిటిక్స్ ఏమిటో యావత్ తెలంగాణ ప్రజలకు అందరికీ తెలిసిపోయింది' అని ఆయన పేర్కొన్నారు. లిక్కర్ కేసుల బాగోతం ఇప్పటివరకు ఢిల్లీలోనే అనుకున్నారని, తాజాగా కేరళలో కూడా కవిత మూలాలు బయట పడుతున్నాయన్నారు. ఈ కేసుల భాగోతం దేశవ్యాప్తంగా బయట పడుతుండడంతో వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్ళించేందుకే డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా సిఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ నీళ్ల విషయంలో మాజీ సిఎం కెసిఆర్ చేసినంత అన్యాయం తెలంగాణకు ఇంకెవరూ చేయలేదని, కృష్ణాలో పోతిరెడ్డిపాడు సోరంగం పెద్దది కావడానికి కెసిఆరే కారణమని, దీంతో శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా 40 వేల క్యూసెక్కుల నుంచి 90 వేల క్యూసెక్కులకు పెరిగిందని ఆయన విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అంతేకాకుండా రోజుకు 2 టిఎంసిలు నీటిని తీసుకెళ్లడం కోసం జగన్ రాయలసీమ ఎత్తిపోతల పథకం మొదలు పెడితే నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం కోసం ఏకంగా అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్నే వాయిదా వేసిన ఘనత కెసిఆర్‌దేనన్నారు. కృష్ణా జలాలలో దక్షిణ తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసింది మాజీ సిఎం కెసిఆరే అన్నారు. గోదావరి జలాల విషయంలో ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదని, లక్ష కోట్లు ఖర్చు పెట్టి గోదావరిపై కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కుంగిపోయిందన్నారు.

## రాష్ట్రపతిని అడ్డుపెట్టుకుని బిజెపి రాజకీయ పబ్బం

గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆదివాసీలకు అడుగడునా అన్యాయం చేసి, ఇప్పుడు రాష్ట్రపతిని అడ్డుపెట్టుకుని బిజెపి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క విమర్శించారు. అటవీ హక్కు చట్టాన్ని నీరుగార్చి, ఏజెన్సీ ప్రాంతాల్లో ఇష్టారీతిన మైనింగ్ కు అనుమతులిస్తూ, పెసా చట్టాన్ని తుంగలో తొక్కిన బిజెపి, ఆదివాసీల గౌరవం గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ వ్యాఖ్యలను బిజెపి వక్రీకరిస్తోందని మండిపడ్డారు. అసలు సమస్యలను పక్కదారి పట్టించేలా లేనిపోని వివాదాలు సృష్టిండం బిజెపికి వెన్నతో పెట్టిన విద్య అని ఆమె శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో సామాన్యులను, నిరుద్యోగ సమస్య, ఆర్థికరంగ ఒడిదుడుకులను కనిపించలేదనే విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకే సోనియా గాంధీ వ్యాఖ్యలపై బిజెపి వివాదాన్ని సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆహ్వానించకుండా బిజెపి తన కురుచ బుద్ధిని ప్రదర్శించిందని సీతక్క మండిపడ్డారు.

## గురుకులాల్లో ఆహార నాణ్యతపై ఎన్‌ఐఎన్ సహకారం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇటీవల రాష్ట్రంలోని కొన్నివిద్యాసంస్థలలో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు, మరి కొన్నిచోట్ల ఆహార నాణ్యత లోపించిందనే ఫిర్యాదుల నేపథ్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (జాతీయ పోషకాహార సంస్థ) ఎన్‌ఐఎన్ సహకారం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే ప్రభుత్వ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూల్స్‌లలో ఆహార భద్రతతో పాటు నాణ్యత ప్రమాణాలను పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలకు పూనుకున్నది. రాష్ట్ర వ్యాప్తంగా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ (టిజిఎస్‌డబ్ల్యుఆర్‌ఇఐఎస్) అధ్వర్యంలో రాష్ట్రంలో 268 రెసిడెన్షియల్ విద్యాసంస్థలలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు దాదాపు 1.70 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ప్రతి రోజు భోజనంతో పాటు స్నాక్స్‌ను అందించే 'కామన్ డైట్ ప్రోగ్రాం'ను ప్రభుత్వం ఇటీవలే ప్రారంభించింది. ఆహార నాణ్యత ప్రమాణాలతో పాటు సిబ్బంది పాటించాల్సిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ రూపొందించేందుకు, అలాగే సిబ్బందికి తగిన శిక్షణ మాడ్యూల్‌ను అభివృద్ధిచేయాలని ఆ సంస్థను ప్రభుత్వం కోరింది. విద్యా సంస్థలకు సరుకుల సరఫరా, ఆహార తయారీ, వడ్డించే విషయంలో కూడా ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఇది వరకే రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగుల నిరక్ష్యం లేకుండా, 'డైట్ మెనూ, వంట పద్ధతుల్లో నాణ్యత లోపించకుండా నిర్ణీత ప్రమాణాలు పాటించనుంది. వంట గదితోపాటు, స్టోర్ రూమ్, భోజనం వడ్డించే చోట నిర్దిష్టమైన పద్ధతులను కూడా అనుసరించాలని అధికార యంత్రాంగానికి ప్రభుత్వం సూచించింది.

## ఏటుకూరి ప్రసాద్ ప్రసంగం.. ముఖాముఖి

సాహితీ ప్రియులందరికీ సాదర ఆహ్వానం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో, సాహిత్య అకాడమీ భాషా, సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న 'విమర్శకునితో ఒక సాయంత్రం' కార్యక్రమంలో సుప్రసిద్ధ విమర్శకుడు, కవి, పరిశోధకుడు ఏటుకూరి ప్రసాద్ ప్రసంగిస్తారు. అనంతరం ఆహూతులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుంది. శనివారం (1 ఫిబ్రవరి) సాయంత్రం 6.00 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే. 90 వసంతాల 'నవ యువకుడు' ఏటుకూరి అనుభవాలను పంచుకునే అవకాశం సాహితీప్రియులకు లభిస్తుంది.



ప్రజాపక్షం
శనివారం, ఫిబ్రవరి 01

# ‘వచ్చే సంవత్సరమూ ఇంతే’

శుక్రవారం పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభదినాన ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ప్రసంగం, అనంతరం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించిన 2024–25 ఆర్థిక సర్వే మోదీ ప్రభుత్వ స్వోత్కర్షతో నిండి ఉన్నాయి. అది పేరుకు రాష్ట్రపతి ప్రసంగమైనా ప్రభుత్వం రాసి ఆమోదముద్రవేసి ఆర్థిక సర్వేను ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు రాస్తారు కావున అదీ ఆశాభావాల దండకంలాగే ఉంటుంది. శనివారం ఆర్థికమంత్రి సమర్పించే 2025–26 ఆర్థిక సంవత్సర (ఏప్రిల్ 25 మార్చి 26) సాధారణ బడ్జెట్ దిశకు ఆర్థిక సర్వే ముందస్తు సూచీ. రాష్ట్రపతి ప్రసంగం అంతా ‘గత 10 సంవత్సరాల్లో నా ప్రభుత్వం’ సాఫల్యాల చిట్టా, వికసిత భారత్ ప్రాధాన్యతలతో కూడి ఉంది. వాస్తవానికి ప్రజలకు ఆసక్తిదాయకమైంది ‘ఆర్థిక సర్వే’. ఆర్థికాభివృద్ధిలో ఎగుడు దిగుళ్లకు అది విమర్శనాత్మకం కాకపోయినా, విశ్లేషణాత్మక పత్రంగా ఉండాలి. ముఖ్య ఆర్థిక సలహాదారు డాక్టర్ వి.అనంత నాగేశ్వరన్ బృందం రూపొందించిన ఈ ఆర్థిక సర్వేలో ఆశాజనకాలు తప్ప ఆత్మవిమర్శ మచ్చుకైనా లేదు.

> **అంతర్జాతీయ ఒడిదుడుకులు, అనిశ్చితాలతో పాటు మనదేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ద్రవ్యోల్బణం,ఆదాయ పంపిణీలో అసమానతలు ఏటేటా పెరుగుతున్న స్థితిలో మెజారిటీ ప్రజల నిజ ఆదాయాలు తరుగుతూ కొనుగోలు శక్తి తరుగుతున్నది.**

2025–26సంవత్సరంలో భారతదేశ వాస్తవిక జిడిపి వృద్ధిరేటు 6.3–6.8శాతం మధ్య ఉంటుందని సర్వేచెప్పింది. వర్తమాన సంవత్సరంలోని వృద్ధి మందగమనం వచ్చే సంవత్సరం కొనసాగుతుందని దీని అర్థం. 2024–25లో వృద్ధిరేటు 6.4 శాతం ఉంటుందని ముందస్తు అంచనాలు తెలుపుతున్నాయి. ఇది గత నాలుగేళ్లలోకెల్లా తక్కువ. 2023–24లో వృద్ధి రేటు 8.2శాతం నుండి 6.4 శాతానికి దిగజారటానికి కారణాలపై లోతైన విశ్లేషణలేదు. ఈ బృందం 2024 జనవరిలో ‘భారతదేశ ఆర్థిక వ్యవస్థ: ఒక సమీక్ష’లో ఇలా చెప్పింది: దేశ ఆర్థిక వ్యవస్థ 24 వ సంవత్సరంలో 7శాతం, అంతకుపైన వృద్ధిరేటు సాధించేలా ఇప్పుడు కనిపిస్తున్నది. 25 సం.లో కూడా 7శాతం వాస్తవ వృద్ధి ఉంటుందనీ కొందరు జోస్యం చెబుతున్నారు. కాగా ‘‘జాతీయ ఆవజ్ఞాల తొలి అడ్వాన్స్ అంచనాల ప్రకారం 2025 సం.లో దేశ జిడిపి వాస్తవ వృద్ధి 6.4 శాతంగా ఉంటుందని’’ 2024–25ఆర్థిక సర్వే చెబుతోంది. కాబట్టి 2025–26 వృద్ధిరేటు కూడా ఈ బృందం ప్రస్తుత అంచనాలను చేరుకోకపోయినా ఆశ్చర్యంలేదు.

ఆర్థిక వ్యవస్థ ముందున్న సవాళ్లను పరిష్కరించటం ఎలా? అనంత నాగేశ్వరన్ దృష్టి ప్రకారం, వ్యాపారాలపై నియంత్రణలు తొలగిస్తే వ్యాపారం ఖర్చు తగ్గుతుంది. కనీవినీ ఎరుగని ప్రపంచసవాళ్ల మధ్య ఆర్థిక వృద్ధిని, ఉపాధి కల్పనను వేగవంతం చేయటానికిది అవసరం’. కాబట్టి రేపటి వార్షిక బడ్జెట్‌లో వృద్ధి, ఉపాధి కల్పన పేరుతో ఆర్థిక మంత్రి పారిశ్రామిక, వాణిజ్య తరగతులకు వ్యాపారాలను సులభతరం చేయవచ్చు. రాయితీలివ్వవచ్చు, విదేశీపెట్టుబడులకు ద్వారాలు మరింతగా తెరవవచ్చు, స్వదేశీ–విదేశీ కొలాబరేషన్ వ్యాపారాలను, మరింతగా ప్రైవేటుకరణను ప్రోత్సహించవచ్చు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను పోటీకి తట్టుకునేటట్లు, కొత్త అన్వేషణలకు ప్రోత్సాహకరంగా మలచాలని ఆర్థిక సలహాదారు సలహాయిస్తున్నారు.

అంతర్జాతీయ ఒడిదుడుకులు, అనిశ్చితాలతో పాటు మనదేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ద్రవ్యోల్బణం, ఆదాయ పంపిణీలో అసమానతలు ఏటేటా పెరుగుతున్న స్థితిలో మెజారిటీ ప్రజల నిజ ఆదాయాలు తరుగుతూ కొనుగోలు శక్తి తరుగుతున్నది. కాబట్టి దేశప్రజల వినిమయశక్తి పెరగాలంటే అధికధరలు, నిరుద్యోగం తగ్గాలి, వేతనాలు పెరగాలి. రెండో వైపున మందకొడిగా ఉన్న పెట్టుబడులు పెరగాలి, మౌలిక వసతుల వృద్ధి, ప్రభుత్వ రంగాన్ని, సేవలను పటిష్టంగావించటానికి ప్రభుత్వ పెట్టుబడివ్యయం పెంపుచేయాలి. డాలర్‌తో మారకంలో రూపాయి విలువను నిలబెట్టటమే కాదు, మెరుగుపరచాలి, ఎగుమతులను ఇంకా పెంపుచేయాలి. జనాభాలో మెజారిటీ శాతం ఆధారపడిఉన్న వ్యవవసాయం, అనుబంధపరిశ్రమలకు ప్రోత్సాహకాలతో మరింతగా వృద్ధిరేటు పెంపుదలకు దోహదం చేయాలి. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు తగ్గుతాయని, ఉపాధిమార్కెట్ మెరుగవుతుందని సర్వే ఆశిస్తుంది. ఐదారు సంవత్సరాల పాటు వార్షిక వృద్ధిరేటు 8 శాతంపైగా ఉంటేనే వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవటం సాధ్యం.

# ఢిల్లీ ఎన్నికలు : బెడిసికొట్టిన బిజెపి వ్యూహాలు

**డాక్టర్ జ్ఞాన్ పాఠక్**

ఢిల్లీ ఎన్నికల ప్రచారం చివరి వారంలోకి ప్రవేశించింది. ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుండగా, 3న ప్రచారం ముగియనుంది. ఎన్నికల ప్రచారం ప్రారంభంలో బిజెపి దూకుడును ప్రదర్శిస్తూ, ఆప్ రాజకీయ కథనం మీదపై చేయి సాధించినట్లు కనిపించింది. ఎన్నికల ప్రచారం తారాస్థాయికి చేరుకున్న ప్రస్తుత సమయంలో బిజెపి ఆత్మరక్షణలో పడిపోయి, తనకు తెలియకుండానే సొంత రాజకీయ ఉచ్చులో చిక్కుకున్నట్లుగా ఉంది.

ఎన్నికల ప్రచారం ప్రారంభంలో బిజెపి రెండు ప్రత్యేక వ్యూహాలపై దృష్టి సారించింది. అందులో మొదటిది, అవినీతి విషయంలో ఆప్ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడం, ఉచితాలతో ఖజానాకు భారీ నష్టం కలిగించి, ఢిల్లీ అభివృద్ధిపై ప్రతికూల ప్రభావాన్ని చూపించిందని ప్రచారం చేయడం. రెండవది, కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకొని ఇండియా కూటమి కుప్పకూలిపోతుందంటూ బలంగా ప్రచారం చేయడం. ఇండియా కూటమిలో కాంగ్రెస్, ఆప్ భాగస్వాములైనప్పటికీ ఢిల్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని రెండు పార్టీలూ నిర్ణయించుకున్నాయి. దీంతో ఇరు పార్టీల మధ్య బిజెపి వ్యతిరేక ఓట్లు చీలిపోయి తమకు ప్రయోజనం కలుగుతుందని బిజెపి ఆశించింది.

**తిరగబడ్డ బిజెపి వ్యూహం**

2020లో జరిగిన ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 5 శాతం లోపే ఓట్లు లభించాయి. ఈసారి అది 15 శాతానికి పెరుగుతుందని, తద్వారా తమ విజయానికి మార్గం సుగమం అవుతుందని బిజెపి భావించింది. అయితే, కాంగ్రెస్ పార్టీని లక్ష్యంగా చేసుకోవాలనే బిజెపి వ్యూహం బెడిసికొట్టింది. బిజెపి ప్రచారం కాంగ్రెస్ అవకాశాలను దెబ్బతీసినప్పటికీ, దాని ప్రత్యర్థి ఆప్‌ను పరోక్షంగా బలోపేతం చేసినట్లయింది. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి), సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) వంటి ఇతర ఇండియా కూటమి పార్టీలు బహిరంగంగా ఆప్‌కు మద్దతు ప్రకటించడంతో పాటు ప్రచారం కూడా చేస్తుండడంతో పరిస్థితి మారిపోయింది. మొదట కాంగ్రెస్ పార్టీ.. బిజెపి లక్ష్యంగా ఉండటం, రెండవది ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా ఉందనే స్పష్టమైన సంకేతం ఢిల్లీ ఓటర్లకు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ మరింత బలహీనపడింది. దీంతో ఆ పార్టీకి బిజెపి వ్యతిరేక ఓట్లను చీల్చే సామర్థ్యం తగ్గింది.వీటిలో ఎక్కువ భాగం ఇప్పటికీ ఆప్ వైపు ఉన్నాయి. కొద్ది భాగం మాత్రమే కాంగ్రెస్ వైపు మళ్లే అవకాశం ఉంది. ఢిల్లీలో వేగంగా మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో బిజెపి ఆశించిన స్థాయిలో కాంగ్రెస్ ఎన్నికల అవకాశాలు పెరగదు. ఇందుకు బిజెపి స్వీయ వ్యూహాత్మక తప్పులు కూడా కారణమయ్యాయి. మరో మాటలో చెప్పాలంటే బిజెపి తన సొంత అవకాశాలను దెబ్బతీసుకుంది. ఆప్‌కు మద్దతుగా నిలిచిన ఇండియా కూటమి పార్టీలు వాస్తవానికి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా లేవు. కానీ బిజెపిని వ్యతిరేకించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నాయి. దీంతో ఎన్నికల యుద్ధం ప్రధానంగా ఆప్, బిజెపి మధ్యే కేంద్రీకృతమైందని, కాంగ్రెస్ పార్టీ రాజకీయ యుద్ధం అంచున ఉందని క్షేత్రస్థాయిలో రాజకీయ పరిస్థితి స్పష్టం చేస్తోంది.

మొదట్లో ఆప్‌కు వ్యతిరేకంగా బిజెపి రాజకీయ వ్యూహం అవినీతి ఆరోపణల చుట్టూనే తిరిగాయి.






ఎన్నికల ముంగిట కేంద్ర ప్రభుత్వం అరవింద్ కేజ్రీవాల్‌పై విచారణకు ఇడికి అనుమతి ఇచ్చింది. అప్పటికే ఢిల్లీ మద్యం కేసులో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రతి ఒక్కరూ బెయిల్‌పై ఉన్నారు.సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లపై సుప్రీం కోర్టు ప్రతికూల వ్యాఖ్యలు చేసింది. ఆ వ్యాఖ్యలు నేపథ్యంలో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేతిలో అరవింద్ కేజ్రీవాల్, ఆయన పార్టీ బాధితులుగా సగటు ఓటరు నుంచి ఆమోద యోగ్యత లభించింది.

**కేజ్రీవాల్ ప్రభుత్వానికి బిజెపి పరోక్ష ప్రచారం**

ప్రతిపక్ష రాజకీయ పార్టీలు సామాన్య ప్రజల సంక్షేమం కోసం ప్రారంభించిన ఉచిత పథకాలను బిజెపి నాయకత్వం, ముఖ్యంగా భారత ప్రధాన మంత్రి ‘రేవ్డీ’లుగా సంబోధించారు. ఉచితాలు ఖజానాకు, దేశాభివృద్ధికి భారీ నష్టాన్ని కలిగిస్తున్నాయని బిజెపి నాయకత్వం ఆరోపించింది. ఆప్ అధినేత కేజ్రీవాల్ అప్పుడు ‘రేవ్డీ పే చర్చ’ అనే రాజకీయ ప్రచారాన్ని ప్రారంభించారు. ఆయన ప్రచారానికి ప్రజల నుండి చాలా మంచి స్పందన లభించింది. దీంతో అధికారంలోకి వస్తే తాము కూడా అనేక ఉచితాలను ఇస్తామని బిజెపి హామీ ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఉచితాల కోసం బిజెపి ఇచ్చిన వాగ్దానాలు, ఓటర్లకు పైకి ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ, అరవింద్ కేజ్రీవాల్ చేతికి కొత్త ఆయుధాన్ని అందించినట్లయింది. బిజెపి సైతం ఉచితాలను వాగ్దానం చేస్తుంది కాబట్టి ఆప్ ఉచితాలను ఇవ్వడం జాతీయ అభివృద్ధికి నష్టం కాదని ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పుడు అంగీకరించాల్సిందేనని ఆయన అన్నారు.

బిజెపి అధికారంలోకి వచ్చినట్లయితే ప్రజల కోసం తమ ప్రభుత్వం ప్రారంభించిన సంక్షేమ పథకాలన్నిటినీ ఆపేస్తుందంటూ అరవింద్ కేజ్రీవాల్ కొత్త ప్రచారం మొదలెట్టారు. బిజెపి పాలనలో ఉచిత విద్యుత్, నీరు, విద్య లేదా ఆరోగ్య సంరక్షణ ఉండదని ఆయన ప్రజలకు వివరిస్తుండడంతో ఉచితాలపై బిజెపి వైఖరి మరింత హాస్యాస్పదంగా మారింది.ఇది బిజెపిని మళ్ళీ ఆత్మరక్షణలో పడేసింది. బిజెపి అధికారంలోకి వస్తే కేజ్రీవాల్ ప్రభుత్వం ప్రారంభించిన ఏ సంక్షేమ పథకాన్ని కూడా ఆపబోమని చివరి దశ ఎన్నికల ప్రచారంలో బిజెపి చెప్పుకోవాల్సి వస్తోంది. వాటికి అదనంగా అనేక కొత్త సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభిస్తామని బిజెపి నాయకులు చెప్పడంతో పాటు, వాటిని అంచెలంచెల మ్యానిఫెస్టోలో కూడా చేర్చింది. దీంతో బిజెపి పరోక్షంగా కేజ్రీవాల్ ఆప్ ప్రభుత్వానికి ప్రచారం చేస్తోంది.

**ప్రభుత్వాధికారులతో ప్రచారం**

ఢిల్లీలో ఎన్నికల ప్రచారంలో బిజెపి తరపున ప్రభుత్వ అధికారులు ప్రత్యక్ష భాగస్వామ్యం స్పష్టంగా కనిపించింది. ఇది ప్రజాస్వామ్యానికి ఎంతో నష్టదాయకం. ఢిల్లీలో అధికారులు ఎన్నికైన ఆప్ ప్రభుత్వం ప్రత్యక్ష నియంత్రణలో లేరు. వారు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పనిచేసే లెఫ్టినెంట్ గవర్నర్ నియంత్రణలో ఉంచబడ్డారు.

ఎన్నికల ప్రచారంలో మహిళలకు మరింత నగదు సహాయం, ఉచిత వైద్య సదుపాయాలను కల్పిస్తామని ఆప్ హామీ ఇచ్చినప్పుడు, ప్రభుత్వ అధికారులు ఆ హామీలు మోసపూరితమైనవంటూ పత్రికల్లో బహిరంగ నోటీసు జారీ చేశారు.యమునా నది జలాలను హర్యానా విషపూరితం చేస్తోందని అరవింద్ కేజ్రీవాల్ చేసిన ఆరోపణను ఢిల్లీ జల మండలి(డిజెపి) సిఇఒ ఖండించడం, ఆప్‌కి వ్యతిరేకంగా అధికారులు రాజకీయాలు చేస్తున్నారనేందుకు తాజా ఉదాహరణ. హర్యానాపై కేజ్రీవాల్ చేసిన ఆరోపణ ‘వాస్తవంగా తప్పు, నిరాధారమని’ ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి డిజెబి సిఇఒ లేఖ పంపారు. లేఖ ప్రతిని లెఫ్టినెంట్ గవర్నర్‌కు కూడా పంపాలని కూడా కోరారు. ఈ లేఖ మీడియాకు లీక్ అవ్వడం, విస్తృతంగా ప్రచురితమవడం జరిగింది.

హర్యానాతో సహా , యమునా నది ప్రవహించే ప్రతి ప్రాంతంలో శుద్ధి చేయని నీరు, పారిశ్రామిక వ్యర్థాలను నీటిలోకి విడుదల చేయడం ద్వారా నదిజలాలు కలుషితమవటం సర్వవిదితమే. హర్యానాపై అరవింద్ కేజ్రీవాల్ చేసిన ఆరోపణ పూర్తిగా తప్పేమి కాదు. నీటి సరఫరా నాణ్యత , యమునా నది నీరు ఇటీవల ఒక ప్రధాన రాజకీయ సమస్యగా మారడంతో ఆయన ఆరోపణ రాజకీయ ప్రాముఖ్యత సంతరించుకుంది. హర్యానాను బిజెపి పరిపాలిస్తుండగా, ఢిల్లీని ఆప్ పాలిస్తుంది. బిజెపి పాలిత హర్యానాను ఢిల్లీ అధికారి సమర్థించడం ఆయన పని చేస్తున్న ఢిల్లీ ప్రభుత్వ నాయకత్వాన్ని, ఆప్‌ను అప్రతిష్ట పాలు చేయడమే అవుతుంది. ఇది ప్రజల చేత ఎన్నుకోబడిన తమ సొంత ప్రభుత్వాన్ని వ్యతిరేకించడంలో అధికారుల రాజకీయ ప్రమేయం కనిపిస్తుంది. యమునా జాలాలపై కేజ్రీవాల్ ఆరోపణపై ఆయనకు ఎన్నికల కమిషన్ నోటీసు, ఇసి ప్రధాన కమిషన్ రాజకీయాలు చేస్తున్నాడంటూ ఆప్ అధినేత ప్రత్యారోపణతో ఢిల్లీ ఎన్నికలు క్షేత్రం తాజాగా వేడెక్కింది. కేజ్రీవాలపై ఇసి కేసు పెడితే అది బిజెపి పక్షాన పనిచేస్తోందనే ఆరోపణ బలం పుంజుకుంటుంది. కేసు పెట్టకపోతే దాని అసమర్థత బయట పడుతుంది. ఇందులో ఏది జరిగినా అది ఆప్‌కు మేలు చేకూరుతుంది. ఏమైనా అంతిమ ఫలితం వేచిచూడవలసిందే!

(ఐపిఎ సర్వీస్)

సిపిఐ శతాబ్ది ఉత్సవాల

# ప్రథమ ప్రధాన కార్యదర్శి

# సచ్చిదానంద్ విష్ణు ఘాటే

సచ్చిదానంద్ విష్ణు ఘాటే 1896 డిసెంబర్ 14న మెంగుళూరులో దిగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో గడిపే కుటుంబం వారిది. ఆయన తండ్రి, అన్న పురోహితులు. అందువల్ల కుటుంబంలో ‘ఛాందస, సనాతన’ వాతావరణం ఉండేది. వాటిని సహించలేని సచ్చిదానంద్ తిరుగుబాటుచేసి ఛాందసాలను విసర్జించి నాస్తికుడిగా మారారు.ఆయన 1914లో కెఇఎం హైస్కూలు నుంచి మెట్రిక్యులేషన్, సైంట్ అల్సోసియస్ కాలేజీ నుంచి ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత పొందారు. ఆ రోజుల్లో, అనీబీసెంట్ ‘హోంరూల్ లీగ్’ ఉద్యమం కార్చిచ్చులా విస్తరించింది. దాని పత్రిక ‘ది న్యూ ఇండియా’ను ప్రజల్లోకి తీసుకెళ్లటంలో సచ్చిదానంద్ పాల్గొన్నారు.

గణితాన్ని అసహ్యించుకున్న ఆయన బొంబాయిలోని సైడెన్ హామ్ కాలేజీలో బి.కాంలో చేరారు. 1918లో అనారోగ్యం నుండి కోలుకోవటానికి అహ్మదాబాద్‌లో ఉన్నారు. అక్కడ సిజి షాను కలిశారు. అతడే తన భావి సహచరుడు.

**సోషలిజం దిశగా:** 1919లో బొంబాయి తిరిగివచ్చిన సచ్చిదానంద్ ఒక బీమా కంపెనీలో ఉద్యోగిగా చేరారు. అది త్వరలోనే దివాలా తీసింది. ఈలోపు, మెంగుళూరుకు చెందిన గోపాల్ భట్ అనే ఒకాయనను కలిశారు. ఆతడు గిర్‌గాంలో శ్రీకృష్ణా లాడ్జి యజమాని. అతడు ఘాటేను మేనేజరుగా నియమించాడు. ఆ లాడ్జితో ఆయన సంబంధం చారిత్రాత్మకంగా రుజువైంది. ఆయన కస్టమర్ల నుంచి బిల్లులు వసూలు చేసేవాడు, రికార్డులు నిర్వహించేవాడు. స్వేచ్ఛగా సినిమాలు వగైరా చూస్తుండేవాడు. అప్పుడు, 1923లో సచ్చిదానంద్ సైంట్ జేవియర్ కాలేజీ నుండి బిఎ ఆనర్స్ చేశారు. ఈలోపు, ఆసక్తికరమైన వ్యక్తిత్వం కలిగిన ఆర్‌బి.లోత్‌వాలా అనే వ్యాపారికి ప్రైవేటు కార్యదర్శిగా పనిచేసేందుకు సిజి షా బొంబాయి వచ్చాడు. లోత్‌వాలా ప్రతి సంవత్సరం ఇంగ్లండ్ వెళుతుండేవాడు, వస్తూవస్తూ మార్క్సిస్టు సాహిత్యం సహా పుస్తకాలు తెస్తుండేవాడు. అతడికి పెద్ద లైబ్రరీ ఉంది. దాన్ని షా చూస్తుండేవాడు. ఘాటే అక్కడ సమయం గడుపుతుండేవాడు. వారిరువురూ ఒక అధ్యయన కేంద్రం కూడా ఏర్పాటు చేశారు.

ఎస్‌ఎ డాంగే ప్రచురించిన ‘సోషలిస్టు’ అనే పత్రిక ఒక రోజు ఘాటేకు తటస్థపడింది. అది అతనికి ఎంతో నచ్చింది. డాంగేను తీసుకురమ్మని మనిషిని పంపాడు. దాని గూర్చి తనకు చెప్పనందుకు డాంగేను కోపగించుకున్నాడు. వారు కలుసుకోవటం అదే తొలిసారి. ఆయన్ను హృదయపూర్వకమైన భోజనానికి ఆహ్వానించారు. వారు సుదీర్ఘంగా చర్చించుకున్నారు. ఆ విధంగా వారి జీవితకాల స్నేహం ఆరంభమైంది. ఆ తర్వాత అతడు అనేక బాధ్యతలు నిర్వహించారు. సిపిఐ, ఇంకా అనేక సంస్థల కోశాధికారిగా పనిచేశారు.

వారిరువురూ త్వరలోనే కాంగ్రెస్ బొంబాయి యూనిట్‌లో పనిచేయటం ఆరంభించారు. అందులో కొత్త రాడికల్ గ్రూపును ఏర్పాటు చేశారు. మాస్కో నుంచి ఎం.ఎన్. రాయ్ జారీ చేస్తున్న ఆదేశాలను వారు తిరస్కరించారు. ఘాటె లాడ్జింగ్ రహస్య కార్యకలాపాలకు కేంద్రమైంది. ఇతర కామ్రేడ్స్‌తోపాటు ఘాటేకు కొమింటర్న్‌తో సంబంధం ఏర్పడింది. ఘాటే, డాంగే కలిసి ఒక క్రియాశీల గ్రూపు ఏర్పాటు చేశారు. జోగ్లేకార్, మిరాజ్‌కార్, నింబేకార్ తదితరులు అందులో ఉన్నారు. బొంబాయిలో, ఇతర చోట్ల భవిష్యత్ కార్మికోద్యమ నిర్మాణానికి వారు పూనుకున్నారు. డాంగేను 1924లో కాన్పూర్ బోల్షివిక్ కుట్ర కేసులో పోలీసులు అరెస్టు చేయగా, ఘాటే తన సహచరులతో కలిసి డిఫెన్స్ కమిటీ ఏర్పాటు చేశారు.




**సిపిఐ వ్యవస్థాపన, కాన్పూర్ 1925:** కాన్పూర్‌కు చెందిన సత్యభక్త్ అఖిల భారత మహాసభ నిమిత్తం దేశవ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టులను ఆహ్వానించారు. దాదాపు 300 మంది కాన్పూర్‌లో సమావేశమైనారు. బొంబాయి నుంచి ఘాటే ఆయన సహచరులు పాల్గొన్నారు. 1925 డిసెంబర్ 25న ప్రారంభమైన ఆ సభ డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ)ని ఏర్పాటు చేసింది. ఆ మహాసభ విడుదల చేసిన ప్రకటన, సిపిఐని ఏర్పాటు చేసినట్లు, కార్యవర్గాన్ని, ఆఫీసు బేరర్లను ఎన్నుకున్నట్లు, జెండాను, సభ్యత్వ ఫారంను ఆమోదించినట్లు తెలియజేసింది. ఒక సంక్షిప్త కార్యక్రమ ప్రకటనను ఆమోదించింది. 1920లో ఏర్పడిన ‘తాష్కెంట్ పార్టీ’ ప్రస్తావన దాని పత్రాల్లో లేదు. పార్టీ నిబంధనావళి ప్రకారం ముగ్గురు ప్రధాన కార్యదర్శుల, ఇద్దరు కోశాధికారుల ఏర్పాటు ఉండటం ఆసక్తిదాయకం. ఎస్‌వి.ఘాటే, జె.పి. బగెర్‌హట్ట ప్రధాన కార్యదర్శులుగా ఎన్నుకోబడ్డారు. ఘాటే క్రియాశీలంగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. మహాసభకు అధ్యక్షత వహించిన ఎం.సింగారవేలును పార్టీ ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. 1927 మే 31న బొంబాయిలో జరిగిన సిఇసి విస్తృత సమావేశం ఒకే ఒక్క ప్రధాన కార్యదర్శి ఉండేటట్లు కొత్త నిబంధనావళిని ఆమోదించింది. అది ఘాటే. దానితో ఆయన ప్రథమ ప్రధాన కార్యదర్శి’గా గుర్తింపుపొందారు. ఐదుగురితో అధ్యక్షవర్గాన్ని, కార్యవర్గాన్ని, సంక్షిప్తమైన పార్టీ కార్యక్రమాన్ని కూడా ఆ సమావేశం ఆమోదించింది.

**వర్కర్స్ అండ్ పెజెంట్స్ పార్టీ (డబ్ల్యుపిపి):** కాంగ్రెస్ లోపల పనిచేస్తున్న సోషలిస్టు గ్రూపును ఘాటే ఆయన సహచరులు 1927లో డబ్ల్యుపిపిగా పరివర్తన గావించారు. ఎస్ఎస్ మిరాజ్‌కార్ దాని ప్రధాన కార్యదర్శి. అది త్వరలోనే ఇతర రాష్ట్రాలకు విస్తరించింది. ఘాటే యువ కార్మికుల లీగ్‌ను కూడా ప్రారంభించారు. 1927 సైమన్ కమిషన్ బహిష్కరణోద్యమంలో ఆయన కీలక పాత్ర వహించారు. బొంబాయిలో అది పెద్ద ప్రజా వెల్లువ. దాంతో కమిషన్ బొంబాయిని దాటవేసి పూనా వెళ్లింది. కమిషన్‌లోని ఏడుగురు సభ్యులకు సంకేతంగా ఏడు దిష్టిబొమ్మలు దగ్ధం చేయబడినాయి. డబ్ల్యుపిపి ఆధ్వర్యంలో జరిగిన చరిత్రాత్మక ప్రదర్శనలో 50 వేల మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు.

1927 జనవరిలో షాపూర్జీ సకలత్‌వాలా బొంబాయి వచ్చినప్పుడు ఘాటే, మిరాజ్‌కార్ ఆయన్ను కలిశారు. ఆయన గౌరవార్థం గొప్ప బహిరంగ సన్మానసభ ఏర్పాటు చేశారు. 1928లో గిర్నీ కాంగార్ యూనియన్ నేతృత్వంలో చరిత్రాత్మక జౌళి కార్మిక సమ్మె జరిగినప్పుడు ఒక కేంద్రానికి ఘాటే ఇన్‌ఛార్జిగా ఉన్నారు. డాంగే, జోగ్లేకార్, ఎన్.ఎం.జోషీ తదితరులతో కూడిన కేంద్ర సమ్మె కమిటీలో ఆయన సభ్యుడిగా ఉన్నారు.

డబ్ల్యుపిపి అఖిల భారత మహాసభ 1928 డిసెంబర్‌లో కలకత్తాలోని ఆల్బర్ట్ హాల్‌లో జరిగింది. ఘాటే ముఖ్యపాత్ర పోషించారు. పూర్ణ స్వరాజ్‌పై తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ మహాసభ పెండాల్ వద్ద డబ్ల్యుపిపి పెద్ద ప్రదర్శన నిర్వహించింది. ఆయన మార్గదర్శకంలో కమ్యూనిస్టుపార్టీ సమావేశాలు కూడా జరిగాయి.

**మీరట్ కుట్ర కేసు, 1929:** దేశవ్యాప్తంగా 31 మంది అగ్రశ్రేణి కమ్యూనిస్టు, టియు నాయకులపై బ్రిటీష్ ప్రభుత్వం బనాయించిన ఈ కుట్ర కేసులో ఇతరులతోపాటు ఎస్‌వి.ఘాటేను కూడా అరెస్టు చేసి మీరట్ జైల్లో ఉంచారు. ఆయనకు 12 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించబడింది. తర్వాత శిక్షాకాలాన్ని తగ్గించారు. 1933లో విడుదలైన తర్వాత 1934లో బొంబాయి తిరిగి వచ్చారు. కమ్యూనిస్టు ఉద్యమ పునర్నిర్మాణంలో నిమగ్నమైనారు, కాని త్వరలోనే మళ్లీ అరెస్టు చేశారు, అస్వస్థులైనారు. సతారా జైల్లో దాదాపు ఒంటరి సెల్‌లో ఉంచారు. డాంగేను కలుసుకున్నారు. జైలునుండి తప్పించుకునే ప్రయత్నం చేశారు. విడుదల తర్వాత మద్రాసులోనే ఉండాలని ఆంక్ష విధించబడింది. ఈలోపు, పిసి జోషీ పార్టీ ప్రధాన కార్యదర్శి అయినారు.

**మద్రాసు ప్రెసిడెన్సీలో:** మద్రాసులో అప్పటికే చిన్న పార్టీ కేంద్రం ఉంది. సింగారవేలుతోపాటు అమీర్ హైదర్‌ఖాన్, సుందరయ్య, ఎఎస్‌కె అయ్యంగార్, కృష్ణ పిళ్లయ్ అందులో ఉన్నారు. ఘాటే, సింగారవేలు సన్నిహిత సహకారంతో పనిచేశారు. ఘాటే 1936లో లక్నో కాంగ్రెస్ సభకు హాజరైనారు. సిపిఐ, సిఎస్‌పి(కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ) కలిసికట్టుగా పనిచేయాలని పిసి జోషీ, జయప్రకాశ్ నారాయణ్, ఘాటే నిర్ణయానికి వచ్చారు.



ఘాటే ప్రయత్నాలవల్లనే ఇఎంఎస్ నంబూద్రిపాద్ సిపిఐలో చేరారు. ఆయన, ఎకె గోపాలన్ సిఎస్‌పిలో, కాంగ్రెస్‌లో ఉన్నారు. దక్షిణాదిన సిఎస్‌పి పనిలో ఘాటే ముఖ్యుడు. మద్రాసు నుంచి వెలువడిన మాసపత్రిక ‘న్యూఏజ్’కు ఆయన సంపాదకుడు కూడాను. దక్షిణ భారత్‌లో పార్టీ, పలు ట్రేడ్ యూనియన్‌ల నిర్మాణానికి దోహదం చేశారు.

**వెల్లూరు జైలు, దియోలీ డిటెన్షన్:** ఘాటేను 1940లో మెంగుళూరులో నిర్బంధంలో ఉంచారు. 1940 మార్చిలో అరెస్టు చేసి వెల్లూరు జైలుకు పంపి, అటు తర్వాత దియోలీ డిటెన్షన్ క్యాంపుకు తరలించారు. పంజాబ్‌లోని సిపిఐ కామ్రేడ్స్, కీర్తి గ్రూపు కమ్యూనిస్టుల మధ్య ఐక్యత తీసుకురావటంలో దియోలీలో కీలకపాత్ర పోషించారు. ఆయన ఓపిగ్గా నచ్చజెప్పే పద్ధతి కీర్తి గ్రూపులో పలువురిని ఆకర్షించింది. సోహన్‌సింగ్ భాక్నా, తేజాసింగ్ స్వతంత్ర, తదితరులు వారిలో ఉన్నారు. ధన్వంతరి, సోహన్‌సింగ్ జోష్ తదితరులతో కూడా ఆయన దీర్ఘంగా చర్చలు జరిపారు. పర్యవసానంగా కీర్తి పార్టీ సిపిఐలో చేరింది.

1942లో ఘాటేను మళ్లీ అరెస్టు చేసి ముందుగా రాజమండ్రి జైలుకు, అటు తర్వాత వెల్లూరు జైలుకు పంపారు. 1943లో బొంబాయిలో జరిపిన సిపిఐ ప్రథమ మహాసభలో ఘాటే స్వయంగా పాల్గొనక పోయినా ఆయన్ను కేంద్ర కార్యవర్గ సభ్యునిగా ఎన్నుకున్నారు. విడుదలైన తర్వాత బొంబాయిలో పార్టీ కేంద్ర కార్యాలయం చేరుకున్నారు.

**మూడు ‘పి’ల లేఖ రచయిత:** దేశ స్వాతంత్ర్య సముపార్జనను సిపిఐ స్వాగతించింది. అయితే ప్రధాన కార్యదర్శిగా పిసి జోషిని తొలగించి బిటిఆర్ ఎన్నిక కావటంతో పార్టీ ఆత్మహత్యా సదృశ పంథా ఎంచుకుంది. ఆ పంథాను ఘాటే గట్టిగా వ్యతిరేకించాడు. రహస్య జీవితంలోకి వెళ్లాడు. పోలీసులు అరెస్టు చేసి 1950లో విడుదల చేశారు.తాను, డాంగే, అజయ్‌ఘోష్ తయారు చేసిన ప్రసిద్ధ మూడు ‘పి’ల లేఖ రచయితల్లో ఘాటే ఒకరు. రహస్య జీవితంలో ఆ ముగ్గురి మారు పేర్ల తొలి అక్షరం ఆంగ్ల అక్షరం ‘పి’. ఆ లేఖ ఒంటెత్తు పోకడ నుండి పార్టీని ఆరోగ్యకరమైన పంథాలోకి తేవటానికి బాట వేసింది. 1951లో అజయ్‌ఘోష్ నాయకత్వంలో జరిగిన పార్టీ రహస్య మహాసభలో ఆ లేఖ ప్రభావవంతంగా పనిచేసింది. సిపిఐ తన పంథా దిద్దుబాటు ఆరంభించింది. ఘాటె, డాంగె, అజయ్ ఘోష్ పార్టీ కేంద్రాన్ని పునర్నిర్మాణం చేసి పునరోత్సాహ కార్యక్రమం చేబట్టారు. ఘాటే పార్టీ ప్రచురణల బాధ్యతతోపాటు కోశాధికారిగా పనిచేశారు.

**సిపిఐలో చీలిక (1964):** 1962 అక్టోబర్‌లో భారత్‌పై చైనీయుల దురాక్రమణ యుద్ధాన్ని ఘాటే తీవ్రంగా ఖండించారు. మావోయిజం విధ్వంసం సృష్టించి ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో చీలిక తెచ్చింది. దానివల్ల భారీ నష్టం పొందిన పార్టీల్లో సిపిఐ ఒకటి. పోటీ, చీలిక వాద కార్యకలాపాలు సిపిఐని స్తంభింపజేశాయి. చీలికవాదుల కార్యకలాపాలను దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాల్సిందిగా ఘాటే ఛైర్మన్‌గా ఉన్న కేంద్ర కంట్రోలు కమిషన్‌ను కోరటం జరిగింది. దాదాపు 9 మాసాల తర్వాత, 1964 ఏప్రిల్‌లో చీలిక కార్యకలాపాలను ఖండిస్తూ నివేదిక సిద్ధం చేసింది. 1964లోనే పార్టీ చీలిపోయింది.

పార్టీ చరిత్రపై, పార్టీ వ్యవస్థాపనపై మంచి సమాచారంతో కూడిన వ్యాసాలు రాశారు. ఘాటే దీర్ఘకాల అస్వస్థత తదుపరి 1970 నవంబర్ 28న న్యూఢిల్లీలో కన్నుమూశారు.

## భారతీయ తీర రక్షణ దళం విశిష్ట సేవలు అమోఘం

**(01 ఫిబ్రవరి భారత తీర రక్షణ దళ దినోత్సవం సందర్భంగా)**

భారతం ఓ దివ్యమైన ద్వీపకల్పం. మూడు వైపుల సముద్ర జలాలు, నాలుగో వైపు హిమశీతల హిమాలయాల కట్టని గోడలతో భరతమాత సహజ సరిహద్దు కంచెలతో రక్షించబడుతోంది. భారతదేశ తొమ్మిది రాష్ట్రాల పరిధుల్లో 7516.60 కిమీ సముద్ర తీరం విస్తరించి ఉన్నది. సముద్ర ప్రాంతాల పరిరక్షణ చట్టాల అమలు, సముద్ర తీరప్రాంతాల రక్షణలతో పాటు స్మగ్లింగ్ చీకటి కార్యకలాపాలు, మానవ అక్రమ రవాణా, అక్రమ సముద్ర వేటలు, సముద్ర జలాల కాలుష్యాలను కట్టడి చేసే బాధ్యతలను ఒక నాడు ఇండియన్ నావీ చూసేది. 1977, 01 ఫిబ్రవరి నుంచి ఈ ప్రత్యేక విధులను మరింత మెరుగైన రీతిలో అంకితభావంతో నిర్వహించడానికి భారత తీర రక్షణ దళం లేదా ఇండియన్ కోస్టల్ గార్డ్స్ అనబడే విలక్షణ దళాన్ని భారత ప్రభుత్వం చట్టం ద్వారా ఏర్పాటు చేసింది. భారత తీర రక్షణ దళాన్ని ఏర్పాటు చేసిన శుభ సందర్భంగా ప్రతి ఏట 01 ఫిబ్రవరిన భారత తీర రక్షణ దళ దినోత్సవం (ఇండియన్ కోస్టల్ గార్డ్స్ డే)ను పాటించుట ఆనవాయితీగా మారింది. అతి కొద్ది నావలు, గస్తీ చేసే పడవలతో 1977లో ప్రారంభమైన భారత తీర రక్షణ దళం నేడు అనేక రెట్లు విస్తరించి 20,000 మంది చురుకైన సిబ్బంది, 157 ఆధునిక నావలు లేదా వెసెల్స్, 62 ఏయిర్‌క్రాఫ్టులు, 5 ఎయిర్ స్టేషన్లు, 42 తీర ప్రాంతాల స్టేషన్లతో పాచు అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఉపకరణాలతో అత్యంత బలమైన నాన్‌మిలిటరీ సంస్థగా తన ప్రత్యేకతలు నిలుపుకుంటున్నది.

**వారసత్వం, ప్రగతి పథంతో స్వర్ణ భారతం:** ఇండియన్ కోస్టల్ గార్డ్స్ వ్యవస్థాపక దినంగా 01 ఫిబ్రవరిన నిర్వహించే భారత తీర రక్షణ దళ దినోత్సవం2025 ఇతివృత్తంగా స్వర్ణ భారతం ఘన వారసత్వం, శీఘ్ర ప్రగతి అనే అంశాన్ని తీసుకొని నిర్వహించడం జరుగుతున్నది. భారత తీర రక్షణ దళ దినోత్సవం వేదికగా సిబ్బంది ధైర్యసాహసాలను, అంకితభావాన్ని గుర్తిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. సాధారణ విధులతో పాటు అత్యవసర సమయాల్లో ప్రజలను కాపాడడం, తుఫానుల వేళ రక్షణ దళంగా నిలవడం భారత తీర రక్షణ దళానికి ఒక అదనపు బాధ్యతగా పేర్కొనబడింది. భారత రక్షణ మంత్రిత్వశాఖలో భాగమైన భారత తీర రక్షణ దళం నినాదంగా వాయమ్ రక్షమహ్ (మేం రక్షిస్తాం) అనేసూత్రాన్ని తీసుకుంది. న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంగా సేవలు అందిస్తున్న భారత తీర రక్షణ దళం సముద్ర జలాల్లో చమురు లీకేజీలను కూడా పసిగట్టి జలాలు కాలుష్యం కాకుండా చర్యలు తీసుకుంటుంది.

# సోనియాగాంధీ వ్యాఖ్యలు సరికాదు

## రాష్ట్రపతి కార్యాలయం ప్రకటన



**న్యూఢిల్లీ :** బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలను రాష్ట్రపతి కార్యాలయం తప్పుబట్టింది. దేశంలోనే అత్యున్నత వ్యక్తి గౌరవానికి భంగం వాటిల్లేలా ఆమె ప్రవర్తించారని పేర్కొంది. రాష్ట్రపతి ప్రసంగంపై కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలు దురదృష్టకరమని తెలిపింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. కాంగ్రెస్ నేతలు మాట్లాడకుండా ఉండాల్సిందని హితవు పలికింది. 'నిజాన్ని ఎవరూ దాచలేరని రాష్ట్రపతి కార్యాలయం చెప్పదలచుకుంది. ప్రసంగం సమయంలో రాష్ట్రపతి అలసిపోయిటన్లు కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలు అవాస్తవం. ఆమె అసలు అలసిపోలేదు. అణగారిన వర్గాలు, మహిళలు, రైతుల కోసం మాట్లాడుతున్నప్పుడు ఆమెకు అలసట దరిచేరదు. రాష్ట్రపతి ప్రసంగంపై వ్యాఖ్యలు చేసిన నాయకులకు భారతీయ భాష, యాసలతో పరిచయం లేకపోయి ఉండొచ్చు. అందుకే రాష్ట్రపతి అలసిపోయినట్లు వాళ్లకు అనిపించొచ్చు. ఏదేమైనా రాజ్యాంగబద్ధంగా అత్యున్నత స్థానంలో ఉన్న వ్యక్తి గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదు' అని రాష్ట్రపతి భవన్ ఓ ప్రకటనలో తెలిపింది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం పూర్తయిన అనంతరం సోనియా, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను మీడియా పలకరించింది. ఆ సందర్భంగా సోనియా మాట్లాడుతూ.. 'ప్రసంగం చివరకు వచ్చేసరికి రాష్ట్రపతి బాగా అలసిపోయారు. ఆమె మాట్లాడలేకపోయారు' అంటూ బదులిచ్చారు. ఇక లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. రాష్ట్రపతి ప్రసంగం బోరింగ్‌గా ఉందన్నారు. చెప్పిన అంశాన్నే పదే పదే ఆమె చెప్పుకొచ్చారని పేర్కొన్నారు. దీనిపై అధికార బిజెపి కూడా తీవ్రంగా స్పందించింది. సోనియా గాంధీ వ్యాఖ్యలను తప్పుబట్టింది. ఇవి అభ్యంతరకర వ్యాఖ్యలు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ వంటి నేతలు ఇలాంటి మాటలు మాట్లాడకూడదు. మరీ ముఖ్యంగా రాష్ట్రపతిని ఉద్దేశించి చేయకూడదు. ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చిన ద్రౌపదీ ముర్ము.. రాష్ట్రపతిగా ఉన్నారు. కాంగ్రెస్ జమిందారీ మైండ్‌సెట్ ఆ విషయాన్ని అంగీకరించలేకపోతోంది. అందుకే ఆమె ప్రసంగాన్ని వారు వ్యతిరేకిస్తున్నారు' అని ఆ పార్టీ ఎంపిలు విమర్శించారు. జెపి నడ్డా స్పందిస్తూ.. గిరిజన వర్గాలకు క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. ఈ తరహా పదాలను ఉద్దేశపూర్వకంగా ఉపయోగించడం కాంగ్రెస్ పార్టీ స్వభావాన్ని సూచిస్తుందంటూ ఆయన తన ట్విట్టర్ వేదికగా ట్వీట్ చేశారు. ఇక మరో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు సైతం ఈ వ్యాఖ్యలను ఖండించారు, ఇది రాష్ట్రపతి కార్యాలయాన్ని అవమానించడమే అని అన్నారు.

### గిరిజనులను అవమానించడమే సోనియా వ్యాఖ్యలు తప్పుపట్టిన ప్రధాని

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం 'పేలవం'గా ఉందంటూ కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం తప్పుపట్టారు. రాష్ట్రపతి పార్లమెంటు ప్రసంగంపై చేసిన వ్యాఖ్యలను 'దురదృష్టకరం, పూర్తిగా నివారించదగినది' అని రాష్ట్రపతి భవన్ పేర్కొన్న కొన్ని గంటల తర్వాత ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలోని ద్వారకలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ మాట్లాడుతూ కాంగ్రెస్ కుటుంబం 'అహంకారం ఈరోజు పూర్తిగా బయటపడింది' అని అన్నారు. 'రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటులో ప్రసంగించారు. కానీ రాజకుటుంబ సభ్యురాలు ఒకరు ఆ భాష బోరింగ్‌గా ఉందని అన్నారు. ఒక సభ్యురాలు తన భాష అలసిపోయేలా అనిపిస్తుందని అంటున్నారు. అర్బన్ నక్సల్స్ మాటలు రాజకుటుంబానికి మరింత ఆసక్తికరంగా ఉంటాయి' అని ప్రధాని మోదీ అన్నారు. 'కాంగ్రెస్, ఆప్ రెండూ అహంకారాన్ని ప్రదర్శిస్తాయి. ఆప్ ఢిల్లీ తమ సొంతమన్నట్లుగా వ్యవహరిస్తుండగా, కాంగ్రెస్ కుటుంబం అహంకారం నేడు పూర్తిగా బయటపడింది. సోనియా గాంధీ వ్యాఖ్యలు పూర్తిగా అనుచితమైనవి. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అలసిపోయినట్లు కనిపించి బోరింగ్ ప్రసంగం చేశారని చెప్పిన తర్వాత ఆమె 'పేలవం' అని అభివర్ణించారు. ఈ వ్యాఖ్య అధ్యక్షురాలిని మాత్రమే కాకుండా ప్రతి పేద, గిరిజన సమాజాన్ని కూడా అవమానిస్తుంది' అని తెలిపారు.

# ఈ దఫా పార్లమెంట్ సెషన్ విశిష్టమైనది

## అగ్గి రగిల్చేందుకు విదేశాల నుంచి ఎలాంటి ప్రయత్నమూ జరగలేదు : ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ సెషన్ ప్రారంభం కావడానికి ముందు దేశంలో 'అగ్గి రగిల్చేందుకు' బహుశా 2014 తరువాత మొదటిసారిగా విదేశాల నుంచి ఎటువంటి ప్రయత్నమూ జరగలేదని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారంచెప్పారు. పార్లమెంట్ బడ్జెట్ సెషన్‌కు ముందు విలేకరులతో మాట్లాడిన ప్రధాని మోదీ ప్రతిపక్షాల తీరుపై కూడా వ్యంగ్యోక్తులు విసిరారు. 2014 దరిమిలా ప్రతి సెషన్‌కు ముందు ఏదో ఒక అలజడి రేకెత్తించేందుకు విదేశాల్లో కొందరు సిద్ధంగా ఉండేవారని, అటువంటి యత్నాలను ఎగసనదోసేవారికి ఇక్కడా కొరత ఉండేది కాదని ఆయన ఆరోపించారు. (బహుశా 2014 తరువాత మొదటిసారిగా పార్లమెంట్ బడ్జెట్ సెషన్‌కు ఒకటి రెండు రోజుల ముందు విదేశాల నుంచి అగ్గి రగిల్చేందుకు ఎటువంటి యత్నమూ జరగలేదు' అని అన్నారు. 'విదేశాల్లో ఎక్కడ నుంచీ అగ్గి రగిల్చే యత్న ఏదీ జరగకనపోవడం గల పది సంవత్సరాల్లో మొదటిసారిగా చూస్తున్నాను' అని ప్రధాని చెప్పారు. తన ప్రభుత్వం మూడవ విడత శనివారం తన పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండడంతో, నిరుపేద, మధ్య తరగతి వర్గాలవారిని లక్ష్మీ దేవి కనికరించాలని తాను ప్రార్థించినట్లు తెలియజేశారు. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించడంలో కొత్త విశ్వాసాన్ని, శక్తిని ఈ బడ్జెట్ సెషన్ ఇస్తుందనే దృఢనమ్మకాన్ని మోదీ వ్యక్తం చేశారు. సర్వతోముఖ అభివృద్ధి కోసం తన ప్రభుత్వం మూడవ విడత మిషన్ తరహాలో వ్యవహరిస్తోందని ఆయన చెప్పారు. సృజనాత్మకత, సమ్మిళితం, పెట్టుబడి ప్రభుత్వ ఆర్థిక అజెండాను తీర్చిదిద్దాయని ఆయన తెలిపారు. ఈ సెషన్‌లో పలు చరిత్రాత్మక బిల్లులు చేపట్టనున్నట్లు, దేశ పటిష్ఠతకు సమగ్ర చర్చ అనంతరం అవి చట్టాలు కానున్నట్లు మోదీ చెప్పారు. 'ముఖ్యంగా, మహిళలు సమాన హక్కులు పొందేందుకు, వర్గ లేదా మతవిశ్వాస ఆధారిత వివక్ష తొలగించేందుకు వీలుగా వారి సాధికారతకు ఈ సెషన్‌లో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోనున్నారు' అని ఆయన సూచించారు. ప్రతి ఎంపి, ముఖ్యంగా యువ ఎంపిలు ఈ సెషన్‌లో 'వికసిత్ భారత్' అజెండాకు దోహదం చేస్తారనే దృఢనమ్మకాన్ని కూడా మోదీ వ్యక్తం చేశారు. 'సంస్కరణ, వ్యవహరణ, పరివర్తన' మంత్రం గురించి మోదీ వక్కాణిస్తూ, శీఘ్రతర అభివృద్ధిని సాధించవలసి ఉంటుందని, సంస్కరణపైననే గరిష్ఠ స్థాయిలో ప్రాధాన్యం ఉందని చెప్పారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలసి వ్యవహరించవలసి ఉంటుందని, ప్రజల భాగస్వామ్యం ద్వారా పరివర్తనను చూడవచ్చునని ఆయన సూచించారు. 'మనది పిన్న వయస్క దేశం. ఇప్పుడు 2025 వయోవర్గంలో ఉన్న యువజనులు 45, 50 ఏళ్ల వారు అయినప్పుడు వారి అభివృద్ధి భారత దేశ అతిపెద్ద లబ్ధిదారులు అవుతారు. వారి వయో దశలో వారు విధాన నిర్ణయ వ్యవస్థలో కూర్చుంటారు. వారు గర్వంగా అభివృద్ధి చెందిన భారత్‌తో పాటు ముందుకు సాగుతారు' అని మోదీ పేర్కొన్నారు. ఈ బడ్జెట్ సెషన్‌లో ఎంపిలు అందరూ అభివృద్ధి భారతం సంకల్పాన్ని పటిష్ఠం చేసేందుకు కృషి చేస్తారని మోదీ అన్నారు. 'ముఖ్యంగా మన యువ ఎంపిలకు ఇది సువర్ణావకాశం, ఎందుకంటే ఇప్పుడు సభలో మరింత చైతన్యం, భాగస్వామ్యంతో అభివృద్ధి భారత ఫలాలను వారు తమ కళ్ల ముందు చూడగలరు. అందువల్ల ఇది యువ ఎంపిలకు అమూల్య అవకాశం' అని ప్రధాని అన్నారు. 'మనం ఈ బడ్జెట్ సెషన్‌లో దేశం ఆశలు, ఆకాంక్షల సాఫల్యానికి కృషి చేయగలమని ఆశిస్తున్నాను' అని మోదీ చెప్పారు. కాగా, శుక్రవారం బడ్జెట్ సెషన్ ప్రారంభానికి ముందు లోక్‌సభలో సమీకృతమైన పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించారు. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఎనిమిదవ సారి శనివారం కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

# 'ఆప్'కు గట్టి షాక్

## పార్టీకి ఏడుగురు ఎమ్మెల్యేలు రాజీనామా

**న్యూఢిల్లీ :** మరో ఐదు రోజుల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనున్న వేళ ఢిల్లీలో కేజ్రీవాల్‌కు గట్టి షాక్ తగిలింది. బిజెపితో నువ్వా నేనా అన్నట్లుగా పోటీ నెలకొన్న అత్యంత కీలక సమయంలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఆమ్ ఆద్మీ పార్టీని వీడారు. పార్టీలో తమ ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు భావనా గౌర్, మదన్‌లాల్ కేజ్రీవాల్‌పైనా, పార్టీపైన విశ్వాసం కోల్పోయినట్లు తెలిపారు. ఈ మేరకు ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు లేఖలు పంపారు. 'మీ పట్ల, పార్టీ పట్ల విశ్వాసం కోల్పోయాను. అందువల్లే ఈ నిర్ణయం తీసుకున్నా. దయచేసి నా రాజీనామాను ఆమోదించండి' అని భావనా గౌర్ తన లేఖలో పేర్కొన్నారు. మరోవైపు, త్రిలోక్‌పురి ఎమ్మెల్యే రోహిత్ మెహ్రౌలియా, జనక్‌పురి ఎమ్మెల్యే రాజేశ్ రిషి, కస్తూర్బానగర్ ఎమ్మెల్యే మదన్‌లాల్, మెహ్రౌలి ఎమ్మెల్యే నరేశ్ యాదవ్‌తో పాటు పవన్ శర్మ (ఆదర్శ్ నగర్) బీఎస్ జూన్ (బిజ్వాసన్) ఆప్‌నకు రాజీనామా చేశారు. అయితే, ఈసారి ఎన్నికల్లో తిరిగి పోటీ చేసేందుకు వీరెవరికీ అవకాశం రాకపోవడం గమనార్హం.

# విఐపి దర్శనాలపై నిషేధం విధించలేం:సుప్రీం

**న్యూఢిల్లీ:** దేవాలయాల్లో విఐపి దర్శనాలపై నిషేధం విధించాలంటూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. దేవాలయాలలో విఐపిలకు ప్రాధాన్యత ఇచ్చే వ్యవహారాన్ని నిరోధించేలా మార్గనిర్దేశకాలు జారీ చేయలేమని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు నిర్ణయం తీసుకొంది. దర్శనాల్లో ప్రాధాన్యతలు ఇవ్వకూడదనే అభిప్రాయం తమకూ వ్యక్తిగతంగా ఉన్నప్పటికీ... ఈ విషయంలో మార్గనిర్దేశకాలు జారీ చేయడానికి న్యాయస్థానానికి వీలు లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ సమస్యను నిర్ణయించాల్సింది సమాజంతో పాటు ఆలయ నిర్వహణ బాధ్యులని స్పష్టం చేసింది. దీనిపై కోర్టు ఎటువంటి దిశానిర్దేశం చేయలేదని పేర్కొంది. అయితే ఈ అంశంపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడానికి తమకు ఎలాంటి అడ్డంకీ లేదని వివరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం న్యాయస్థానం విఐపి దర్శనాలపై మార్గనిర్దేశకాలు జారీ చేయలేదని ధర్మాసనం తెలిపింది. దేవాలయాల్లో విఐపి దర్శనాలపై నిషేధం విధించాలంటూ బందావన్‌లోని శ్రీ రాధా మదన్ మోహన్ ఆలయంలో 'సేవక్' విజయ్ కిషోర్ గోస్వామి ఈ పిటిషన్ దాఖలు చేశారు. దేవాలయాల్లో వీఐపీలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్లనే అనేక సందర్భాల్లో తొక్కిసలాటలు చోటుచేసుకొంటున్నాయని, ఈ అసమానతలు తొలగించాల్సిన బాధ్యత రాష్ట్రాలకు ఉందని పిటిషనర్ తన పిటిషన్‌లో స్పష్టం చేశారు. ఈ ఆచారం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21లో పొందుపరిచిన సమానత్వ సూత్రాలను ఉల్లంఘిస్తుందని, రుసుము చెల్లించలేని భక్తులపై వివక్ష చూపుతుందని పేర్కొన్నారు. అలాగే ప్రత్యేక దర్శనం పేరుతో రూ.400 నుంచి రూ.500 మధ్య రుసుము వసూలు చేయడం వల్ల సంపన్న భక్తులకు, ఆయా చార్జీల భారం భరించలేని వారికి... ముఖ్యంగా వెనుకబడిన మహిళలు, వికలాంగులతోపాటు వృద్ధుల మధ్య తీవ్ర అంతరం ఏర్పడిందని పిటిషనర్ పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులందరికీ సమాన ఆదరణ లభించేలా ఆదేశాలు ఇవ్వడంతోపాటు దేవాలయాల్లో అందరికీ సమాన ప్రవేశం ఉండేలా కేంద్రం ప్రామాణిక విధి విధానాలు రూపొందించాలని కోరారు.

# ప్రజా సమస్యలపై మాట్లాడరేం?

## మోదీపై ప్రియాంకా గాంధీ ధ్వజం



**న్యూఢిల్లీ :** 'అగ్ని రాజేయడానికి' విదేశాల నుంచి ఎటువంటి ప్రయత్నం జరగలేదంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా శుక్రవారం స్పందించారు. ప్రధాని మోదీ ప్రజల సమస్యల గురించి ఎప్పుడూ మాట్లాడరని, వాటిని పరిష్కరించరని అన్నారు. బడ్జెట్ సమావేశానికి ముందు విలేకరులతో మోదీ మాట్లాడుతూ పార్లమెంటు సమావేశం ప్రారంభానికి ముందు భారతదేశంలో 'అగ్నిని రగిలించడానికి' విదేశాల నుంచి ఎటువంటి ప్రయత్నం జరగకపోవడం బహుశా ఇదే మొదటిసారి' అని అన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పార్లమెంటు ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ 'ఆయన ప్రజల సమస్యల గురించి మాట్లాడరు. వాటిని పరిష్కరించరు. గత సమావేశంలో మనం చూశాం. ఆయన చర్చను (అనుమతించలేదు). అందువల్ల ఆయన అలాంటి మాటలు చెబుతారు' అని అన్నారు. సమావేశానికి ముందు మోదీ ప్రతిపక్ష పార్టీలను విమర్శించారు. 2014 నుంచి ప్రతి సమావేశానికి ముందు దుష్ప్రవర్తన చేయడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తులు ఉన్నారని, అలాంటి ప్రయత్నాలను ప్రేరేపించే వారికి కూడా కొరత లేదని అన్నారు. 'షాయద్ 2014 సే లేకర్ అబ్ తక్, యే పెహ్లా పార్లమెంట్ కా సత్ర్ హై, కి జిస్కే ఏక్‌దో దిన్ పెహ్లే కోయి విదేశీ చింగారీ నహీ పక్డీ హై, దేశ్ మే సే ఆగ్ లగానే కి కోషిష్ నహీ హుయీ హై (బహుశా 2014 నుంచి పార్లమెంటు సమావేశానికి ఒకటి లేదా రెండు రోజుల ముందు, విదేశాల నుంచి మంటలను రేకెత్తించే విదేశీ ప్రయత్నం జరగని మొదటి సెషన్ ఇది)' అని తెలిపారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం స్పందిస్తూ, 'గత 10 సంవత్సరాలలో తన పర్యవేక్షణలో విదేశీ జోక్యం జరిగిందని ప్రధాన మంత్రి చెప్పడం ఆశ్చర్యకరం' అని అన్నారు. 'దేశంలోని అన్ని వ్యవస్థలను ఉపయోగించి, అంతర్జాతీయంగా ఆయనకు ఉన్న అన్ని వేదికలను ఉపయోగించి వాటిని బహిర్గతం చేయడం, చట్టబద్ధంగా వారిపై చర్యలు తీసుకోవడం ఆయన బాధ్యత' అని పేర్కొన్నారు.

# వరుసగా ఎనిమిదోసారి..

## రికార్డు బ్రేక్ చేయనున్న నిర్మలమ్మ



**న్యూఢిల్లీ :** ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరో సరికొత్త రికార్డు సృష్టించబోతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరాని (2025–26)కి సంబంధించిన పూర్తి స్థాయి బడ్జెట్‌ను రేపు నిర్మలమ్మ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న విషయం తెలిసిందే. వరుసగా ఎనిమిదో సారి కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంట్‌కు సమర్పించనున్నారు. తద్వారా వరుసగా ఎనిమిదిసార్లు పార్లమెంటులో కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన మంత్రిగా నిర్మలా సీతారామన్ రికార్డు నెలకొల్పనున్నారు. నిర్మలమ్మ ఇప్పటికే ఒక తాత్కాలిక బడ్జెట్, ఏడు పూర్తిస్థాయి బడ్జెట్‌లు సమర్పించిన విషయం తెలిసిందే. రేపు అంటే ఫిబ్రవరి ఒకటో తేదీన సమర్పించే బడ్జెట్ ఎనిమిదవది. ఈ బడ్జెట్‌తో వరుసగా ఎనిమిదో సారి బడ్జెట్‌ను సమర్పించిన ఆర్థిక మంత్రిగా నిర్మలమ్మ రికార్డు సృష్టించనున్నారు. ఈ బడ్జెట్‌తో మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ 10 బడ్జెట్‌ల రికార్డుకు నిర్మలమ్మ చేరువకానున్నారు. మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ 1959–1964 మధ్య ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో మొత్తం 6 బడ్జెట్‌లు, 1967–69 మధ్య 4 బడ్జెట్‌లు సమర్పించారు. మాజీ ఆర్థిక మంత్రులు పి చిదంబరం 9 బడ్జెట్‌లు, ప్రణబ్ ముఖర్జీ 8 బడ్జెట్‌లను సమర్పించారు. అయితే, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హయాంలో వరుసగా ఎనిమిది బడ్జెట్‌లను ప్రవేశ పెట్టిన ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ రికార్డు సృష్టించబోతున్నారు. అంతేకాదు మోదీ హయాంలో అత్యధిక బడ్జెట్‌లను సమర్పించిన మంత్రిగా కూడా నిలవనున్నారు. 2019లో నరేంద్రమోదీ సారథ్యంలో రెండో దఫా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి 2019–20 ఆర్థిక సంవత్సరం నుంచి 2023–24 ఆర్థిక సంవత్సరం వరకూ వరుసగా ఐదు పూర్తి స్థాయి బడ్జెట్లను కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. గతేడాది సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తాత్కాలిక బడ్జెట్ పార్లమెంటుకు సమర్పించారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల అనంతరం 2024–25కి సంబంధించిన పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. వరుసగా ఏడవ సారి బడ్జెట్‌ను పార్లమెంట్‌కు సమర్పించారు. ఇప్పుడు ఎనిమిదోసారి బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు నెలకొల్పనున్నారు. కాగా, మోదీ తొలి విడుత మంత్రి వర్గంలో (2014) పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రిగా నిర్మలా సీతారామన్ బాధ్యతలు చేపట్టారు. 2017లో కీలకమైన రక్షణ శాఖ బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత 2019లో రెండోసారి ప్రధాని మోదీ ఎన్నికైన తర్వాత ఏర్పాటైన కేంద్ర మంత్రి వర్గంలోనూ చోటు దక్కించుకున్న నిర్మలా సీతారామన్‌కు అత్యంత కీలకమైన ఆర్థికశాఖను అప్పగించారు నరేంద్రమోదీ. నాటి నుంచి దేశీయ ఆర్థిక రంగంలో మలి విడుత ఆర్థిక సంస్కరణలను పరుగులెత్తించారు. కేంద్ర మంత్రివర్గంలో మూడోసారి వరుసగా చోటు దక్కించుకున్న ఏకైక మహిళా నాయకురాలిగా నిర్మలా సీతారామన్ రికార్డు నెలకొల్పారు.

# హర్యానా ప్రభుత్వమే దోషి

## యమునా జలాల్లో విషంపై కేజ్రీవాల్: ఇసికి ఆరు పేజీల సమాధానం



**న్యూఢిల్లీ:** యమునా జలాల్లో విషం కలిపినది హర్యానాలోని బీజేపీ ప్రభుత్వమేనని అని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. విషపూరిత జలాలను ఢిల్లీకి సరఫరా చేసిందని దుయ్యబట్టారు. నది జలాల్లో అమోనియా స్థాయి అత్యధికంగా ఉండటాన్ని ప్రస్తావిస్తూ ఆయన శుక్రవారం ఆరు పేజీల సమాధానాన్ని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి)కి అందజేశారు. ఫిబ్రవరి 5న జరగబోయే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను ప్రభావితం చేసేందుకు హర్యానా సిఎం నాయాబ్ సింగ్ సైని ఈ మేరకు కుట్ర చేశారని ఆరోపించారు. ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు ఆతిశీ, భగవంత్ సింగ్ మాన్‌తో కలిసి ఇసి అధికారులను కేజ్రీవాల్ కలిశారు. అమోనియా అధికంగా ఉన్న నీటితో నింపిన మూడు సీసాలను ఎన్నికల సంఘం ముందర ఉంచారు. యమునా జలాల్లో కలిసిన విష పదార్థం అమోనియా అని కేజ్రీవాల్ వివరించారు. నది జలాల్లో విషం కలిసినట్లు ఆధారాలు ఉన్నాయంటూ ఢిల్లీ జల్ బోర్డు (డిజెపి) మెథడాలజీని ప్రస్తావించారు. యమునా జలాల్లో జనవరి 15న 3.2 పీపీఎం (పార్ట్స్ పర్ మిలియన్)గా ఉన్న అమోనియా స్థాయి... 2627 తేదీ నాటికి ఏకంగా ఏడు పిపిఎంలకు పెరిగిందని వెల్లడించారు. ఈ విషయాన్ని సైని దృష్టికి పంజాబ్, ఢిల్లీ ముఖ్యమంత్రులు తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. తాజా పరిణామాలను బట్టి హర్యానా ముఖ్యమంత్రి ప్రమేయం స్పష్టమవుతున్నదని చెప్పారు. దేశ రాజధాని ప్రజలకు ముప్పు వాటిల్లజేసేందుకు యత్నించిన సైనిపై క్రిమినల్ కేసు పెట్టాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. హర్యానా ప్రభుత్వంపై సిఇసి చర్యలు తీసుకోకపోతే ఎన్నికల వేళ ఇలాంటి అక్రమాలను సర్వసాధారణం చేసిన వారు కాగలరని కేజ్రీవాల్ హెచ్చరించారు. హర్యానా ప్రభుత్వంపై చర్యలు తీసుకోవడానికి సిఇసికి భయం ఎందుకు? ఢిల్లీ జలాలను కలుషితం చేయడం ఆపాలని హర్యానాకు ఎందుకు ఆదేశాలు ఇవ్వలేకపోతున్నారు? అని ఇసి అధికారులను కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఢిల్లీలో బిజెపి నేతల ద్వారా జరిగే ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై సిఇసి మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. యమునా జలాలపై చేసిన ఆరోపణలకుగాను కేజ్రీవాల్ నుంచి ఎన్నికల సంఘం వివరణను కోరిన విషయం తెలిసిందే. ఇసి నోటీసు అందిన తర్వాత కేజ్రీవాల్ విలేకరులతో మాట్లాడారు. ఇసి నోటీసు తీరును బట్టి నన్ను శిక్షించాలని ముందే నిర్ణయించినట్లు అర్థమవుతోంది. బిజెపి ఆదేశాలతో మీరు నాపై అక్రమంగా ఎలాంటి చర్యలు తీసుకున్నా, ఏ శిక్ష విధించినా సంతోషంగా స్వీకరిస్తా. ఢిల్లీ ప్రజల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన విషయంలో రాజీ ప్రసక్తే లేదు. ప్రజాస్వామిక సిద్ధాంతాల పరిరక్షణకు పోరాడుతా' అని ఢిల్లీ మాజీ సిఎం వెల్లడించారు.

# దేశంలోకి చొరబాటుకు యత్నం

## ఇద్దరు టెర్రరిస్టులను.. మట్టుబెట్టిన సైన్యం

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌లో అక్రమచొరబాటుకు యత్నించిన ఇద్దరు ఉగ్రవాదులను భద్రతాబలగాలు మట్టుబెట్టాయి. గురువారం రాత్రి పూంచ్ సెక్టార్‌లోని సరిహద్దు నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వద్ద ఇద్దరు ముష్కరులు దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నించారు. గుర్తించిన భద్రతా బలగాలు వారిని అడ్డుకునేందుకు యత్నించగా, ఇరుపక్షాల మధ్య భారీగా కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో భారత సైన్యానికి చెందిన వైట్ నైట్ కార్ప్స్ జరిపిన కాల్పుల్లో ఇద్దరు టెర్రరిస్టులు హతమయ్యారు. ఎల్‌ఓసి వద్ద రాత్రంతా కాల్పులు జరిగాయని, ఘటనా స్థలంలో భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని వైట్ నైట్ కార్ప్స్ ఎక్స్ వేదికగా వెల్లడించింది. ఆ ప్రాంతంలో గాలింపు చేపట్టామని తెలిపింది. గత నెలలో కుల్గామ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. డిసెంబర్ 18న కుల్గామ్ జిల్లాలోని బెహిబాగ్ ప్రాంతంలో టెర్రరిస్టులు ఉన్నారనే సమాచారంలో భద్రతా బలగాలు కార్డన్ సెర్చ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఉగ్రవాదులు, భద్రతా దళాలకు మధ్య జరిగిన కాల్పుల్లో ఐదుగురు ముష్కరులు చనిపోయారు.

# ఢిల్లీలో క్షీణించిన గాలి నాణ్యత

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో గాలి నాణ్యతలు మరోసారి క్షీణించాయి. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో ఏక్యూఐ (గాలి నాణ్యతలు) 349 స్థాయిల్లో నమోదైందని, ఏక్యూఐని వెరీ పూర్ కేటగిరీలో వర్గీకరించినట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. ఢిల్లీలో గరిష్ఠంగా 26 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. కాగా, ఏక్యూఐ 50గా నమోదైతే గుడ్, 101 నుంచి 200 మధ్య నమోదైతే మధ్యస్థమని, 201 నుంచి 300 మధ్య నమోదైతే పూర్, 301 నుంచి 400 మధ్య నమోదైతే వెరీ పూర్, 401 500 మధ్య నమోదైతే తీవ్రస్థాయిలో గాలి నాణ్యతలు వర్గీకరించనున్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది.

# కుంభమేళాకు వెళ్లి వస్తూ ఆరుగురు మృతి

**ఘాజీపూర్:** ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మహాకుంభమేళా భక్తులతో వెళ్తున్న వాహనాన్ని ట్రక్కు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... గోరఖ్‌పూర్‌కు చెందిన కొందరు భక్తులు ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరించి తిరుగు పయనమయ్యారు. వారణాసిఘాజీపూర్ రోడ్డులోని నందగంజ్ పోలీస్ స్టేషన్ సమీపంలో గల ఉస్మి కలా మలుపు వద్దకు రాగానే వారి వాహనాన్ని ఓ ట్రక్కు అదుపుతప్పి ఢీ కొట్టింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. ఘటన సమయంలో 20 మంది భక్తులు వాహనంలో ఉన్నట్లు తెలిసింది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మృతుల సంఖ్య దాస్తున్న యుపి సర్కార్: అఖిలేశ్



**న్యూఢిల్లీ:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో తొక్కిసలాటకు యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానిదే పూర్తి బాధ్యతని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ స్పష్టంచేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని అఖిలేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'పార్లమెంటు సమావేశాల్లో బడ్జెట్ గురించి తర్వాత చర్చించవచ్చు. ముందు మహాకుంభమేళ ఘటన గురించి మాట్లాడాలి. కుంభమేళా తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కోసం, శాంతి గురించి ఎంపిలు మాట్లాడాలి' అని అన్నారు. ఈ మహా కుంభమేళాలో ఎంతమంది చనిపోయారనేది యుపి ప్రభుత్వం దాచిపెట్టి... పరిహారం చెల్లించడం లేదని ఆయన విమర్శించారు. మహా కుంభమేళా మరణాలపై యోగి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై అఖిలేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. యోగి ఆదిత్యనాథ్ నైతికంగా పతనమయ్యారని, అలాంటి వ్యక్తి రాజకీయాల నుంచి ఎప్పుడు తప్పుకుంటారనేది ఇప్పుడు ప్రశ్న అని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# సైఫ్‌ను పొడిచింది అతడే

## ఫేషియల్ రికగ్నైజేషన్‌తో పోలీసుల నిర్ధారణ



**ముంబై:** దుండగుడి దాడిలో గాయపడిన బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ కోలుకుంటున్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ముంబై పోలీసులు ఫేషియల్ రికగ్నైజేషన్ టెక్నాలజీని ఉపయోగించి సైఫ్ నివాసంలోని సీసీటీవీ ఫుటేజీని విశ్లేషించారు. ఆ వీడియోలో ఉన్నది నిందితుడు మహమ్మద్ షరీఫుల్ ఇస్లాం అని ఈ సాంకేతికత ద్వారా నిర్ధారించినట్లు వెల్లడించారు. ఇంతకుముందు... దాడి జరిగిన ప్రదేశంలో లభించిన ఫింగర్ ప్రింట్స్ నిందితుడితో సరిపోలడం లేదని జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. జనవరి 16వ తేదీ తెల్లవారుజామున నిందితుడు సైఫ్ ఇంట్లోకి ప్రవేశించి దాడి చేశాడు. విచారణలో భాగంగా నటుడి ఇంటిని పరిశీలించిన విచారణ అధికారుల బందం అక్కడ ఉన్న దాదాపు 19 వేలిముద్రలు సేకరించింది. వాటిల్లో ఏవీ నిందితుడి ఫింగర్ ప్రింట్స్‌తో మ్యాచ్ కావడం లేదని పోలీసులకు ఫోరెన్సిక్ బందం వెల్లడించినట్లు వార్తలు వచ్చాయి. ఈ కేసులో నిందితుడైన షరీఫుల్ ఇస్లాం దొంగతనం చేయాలనే ఉద్దేశంతోనే ఆ ఇంట్లోకి ప్రవేశించాడని, అయితే, పరిస్థితి తీవ్ర ఘర్షణకు దారితీసిందని ప్రాథమిక విచారణలో తేలింది. అందుకే దాడి సమయంలో సైఫ్ ధరించిన దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి దుస్తులపై రక్తపు మరకలు కనిపించడంతో అవి సైఫ్ అలీఖాన్‌వా... కాదా అని నిర్ధారించేందుకు నమూనాలు సేకరించారు.


**PUBLIC NOTICE**

This is to inform the general public, banks, and all private institutions that one **MOHAMMED JAVEED PASHA, S/o Late Ankushavali @ Ankoos,** Age: 34 years, Occupation: Private employee, and a resident of H. No. 8-24, Velair Village and Mandal, Hanumakonda District, Telangana 506142, approached my client bank, Indusind Bank Ltd., Warangal Branch, for a home loan by producing a Release Deed with Doc. No. 5661/2024, dated 11-12-2024, from his releasers:

1. MOHAMMED PARVEEN, W/o Late Ankushavali @ Ankoos
2. MOHAMMED HASEENA, W/o Late Ankushavali @ Ankoos
3. NASREEN BEGUM MOHAMMED, W/o Md. Shareef, D/o Late Ankushavali @ Ankoos

The property is a house with an open place bearing H.No. 8-24, admeasuring 175 Sq. Yards (140.44 Sq. Meters), with an RCC plinth area of 1,092.56 Sq. Feet, situated at Velair Village and Mandal, Hanumakonda District, with Assessment No. 539, under the jurisdiction of the Sub-Registrar Office, Bheemadevarapalli, and having the following boundaries:

EAST : GP CC Road
WEST : House of Billa Rajamouli
NORTH : GP CC Road
SOUTH : House of Nurjahan

Hence, the general public, banks, and all private institutions are hereby informed that if any person(s) has any objections whatsoever regarding the title or possession of the below-mentioned property, they must file their written objections along with supporting documents within seven (7) days from the date of this publication before the counsel at the address mentioned below. Failing this, my clients will assume that no objections exist and will proceed further. Any objections raised at a later stage will not be entertained.

// PUBLICATION ISSUED AT THE REQUEST OF THE PARTY //

Date :1.02.2025.
HANAMKONDA

**POTHARAJU ASHOK**
**ADVOCATE**
Office: H.No. 2-5-205/A, Nakkalagutta, Hanamkonda - 506001
**Cell: 9966101967**



**PUBLIC NOTICE**

That on 28-01-2025, my client **K.REVANTH REDDY, S/O. LATE RAVINDER REDDY,** R/o. H.No. 2-5-363, Nakkalagutta, Hanumakonda, Warangal, in order to go to Subedari, boarded Auto at Nakkalagutta, Hanamkonda carrying a bag containing original Sale Deed Document bearing Registration No.3862/1981, dated 22-09-1980 registered at JSRO Warangal (R.O), in respect of Property bearing Municipal No.2/652/B admeasuring 694.33 Sq.Mtrs situated at Nakkalagutta, Hanamkonda, Warangal and he alighted the Auto at Subedari, Hanamkonda at about 4 p.m and after going some distance, he realized that he left his bag containing the original of the above document in the Auto. My client made efforts to trace out the Auto, but he could not trace out the Auto.

That the General Public are hereby informed and requested that if any person finds the above said original document or if anyone is in possession of the above original document, to return the above original document to the below mentioned address and will be suitably rewarded.

Sd/- **T. MURALI KRISHNA,** B.B.MLB
ADVOCATE,
Flat No.501, Shanthi Sukrithi Residency, Road No.6/1, Chaitanyapuri Colony, Hanumakonda, Warangal City. **Mobile No.9247116074.**

## ప్రజావాణి రద్దు

**ప్రజాపక్షం/నల్లగొండ:** వరంగల్ ఖమ్మంనల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ఈనెల 3 న నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడంతో పాటు , ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పూర్తయ్యే వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరగదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నేడు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు సమర్పించే నిమిత్తం నల్లగొండ జిల్లా కేంద్రానికి రావద్దని ఆమె విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయిన తర్వాత యధావిధిగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆమె వెల్లడించారు.

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



**ప్రజాపక్షం/కోదాడ:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికి తక్షణమే అమలు చేయాలని సిపిఐ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బొల్లు ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కోదాడ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సూర్యానారయణను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుంచి నాలుగు పథకాలను అమలు చేస్తామని చెప్పి నేటికి అమలు చేయకుండా మండలంలో ఒకే ఒక్క గ్రామంలో అమలు చేయడం సరికాదన్నారు. అదే విధంగా వానాకాలంలో రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి నేటికి కూడా కొంతమందికి బోనస్ రాని రైతులు ఉన్నారని, రెండు లక్షల దాటిని వారికి రుణమాఫీ వర్తింపజేసి తక్షణమే ప్రభుత్వం వారి ఖాతాలో నిధులు జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వెంకటయ్య, బత్తినేని హనుమంతరావు, ఏలూరి నాగయ్య, సామినేని సుబ్బారావు, కనగాల కొండయ్య, అల్వాల గురవయ్య, రామారావు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పాత్ర కీలకం : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/దేవరకొండ:** విద్యార్థుల వ్యక్తిగత , సామాజిక జీవితాలను రూపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ మండల పరిధిలోని కొమ్మేపల్లి గిరిజన గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏకుల రఘురాం పదవి విరమణ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎంఎల్ఏ బాలునాయక్ మాట్లాడుతూ సుమారు ముప్పై నాలుగు సంవత్సరాలుగా అంకిత భావంతో పనిచేస్తూ వేలాది మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఆయన చూపిన చొరవను అభినందించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల వ్యక్తిగత ఎదుగుదల, అదేవిధంగా జీవితంలో ఉన్నతమైన నిర్ణయాలు తీసుకోవడంలో గొప్పగా మార్గనిర్దేశం చేస్తారని అన్నారు. ఉపాధ్యాయుల ప్రవర్తన, విలువలు, పనితీరుతో విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యలు ఏర్పరుచుకోవడంలో ప్రేరేపిస్తాయని గుర్తు చేశా రు. ఈకార్యక్రమంలో పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్ఖాన్, పిఏసిఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, మండల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, గురుకుల ఆర్‌సివో బలరాం, పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగి పదవీ విరమణ సహజం



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని సూర్యాపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సురేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో శుక్రవారం డిప్యూటి సూపరిండెంట్ గాజుల దాసు, ఆర్టీసీ కండక్టర్ మైస యాకస్వామిల ఉద్యోగ విరమణ మహోత్సవానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. పదవిలో ఉన్నప్పుడు చేసిన సేవలను పదవి విరమణ పొందిన రోజు గుర్తు కొస్తుందని, ప్రతి ఉద్యోగికి విరమణ తప్పదని తెలిపారు. వివిధ హోదాల్లో డిప్యూటి సూపరిండెంట్ గాజుల దాసు, ఆర్టీసీ కండక్టర్ మైస యాకస్వామిలు అంకిత భావం, నిబద్ధతతో పనిచేయడం అభినందనీయమన్నారు. ఏళ్ల తరబడి అర్టీసీలో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలను, సమయానుసారం బస్సులను ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా విధులు నిర్వహించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అర్టీసీ ఎంఎప్‌చారి, అకౌంటెంట్ జిఎల్‌రావు, పుల్లయ్య, విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు శంకరయ్య, ప్రభాకర్, పివిరావు, వెంకన్న పాల్గొన్నారు.

## త్వరలో కొత్త సంఘాల ఏర్పాటు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ మున్సిపాలిటీలో పేదరిక నిర్మూలన కార్యక్రమం ఆధ్వర్యంలో స్త్రీనిధి రుణాల రికవరి వందశాతం పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎండి.యూసుఫ్ అన్నారు. మున్సిపల్ మీటింగ్ హాల్‌లో శుక్రవారం మెప్మా ఎస్ఎల్ఎఫ్ రిసోర్స్ పర్సన్స్ సమావేశం నిర్వహించారు. ఎస్ఎల్ఎఫ్ వారిగా కొత్త సంఘాలు ఏర్పాటు చేయడం, స్త్రీనిధి రికవరి, నల్లగొండలో జరిగే ఎగ్జిబిషన్ మీద సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త సంఘాల ఏర్పాటు అతి త్వరలో చేయాలని, ప్రస్తుతం మిర్యాలగూడ మున్సిపాలిటీలో రికవరి 59శాతం ఉందని రికవరి పర్సంటేజ్ ఫిబ్రవరి 15లోపు వందశాతంకు పూర్తి చేయాలన్నారు. లేనట్లయితే తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీఎంసీ బక్కయ్య, సీవోలు వెంకటేశ్వర్లు, సుధాకర్, మల్లేశ్వరి, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

## విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** ప్రభుత్వపాఠశాలలో చదివి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మండల విద్యాధికారి రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బసాపురం బైరాపురం ప్రాథమిక పాఠశాల సందర్శించి అక్కడ విద్యార్థుల చదువులపై పరిశీలన చేపట్టారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఒకటి నుంచి ఐదు తరగతులు ఆరేడు తరగతుల పైన ప్రత్యేకంగా నేర్పించే పరిస్థితి చేయాలని వారు ఉపాధ్యాయులకు సూచించారు. ఇంగ్లీషు లెక్కలపైన పూర్తిస్థాయిలో చదవడం ఎక్కాలు చేయడం రావాలని ఉపాధ్యాయులు సమయపాలన పాటించి వెనుకబడిన విద్యార్థుల కోసం అదనపు సమయం తీసుకుని నేర్పించాలని వారు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి రుచి కరమైన భోజనాలు ఉండాలని వారు తెలిపారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మెనూ కచ్చితంగా పాటించాలని వారు కోరారు. పౌష్టికాహారంతో పాటు విద్యార్థులకు విజ్ఞానం కూడా అవసరమని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో చదివించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఫామ్‌హౌస్‌లో కెసిఆర్ కుంభకర్ణుడి నిద్ర

### దమ్ముంటే అసెంబ్లీకి రా!
### మేము తప్పుడు మాటలు చెప్పలేదు.. చెప్పినవన్ని చేస్తున్నాం
### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



**ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి:** కెసిఆర్ ఫామ్ హౌస్ లో కుంభకర్ణుడిలా నిద్రపోతున్నాడని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎద్దేవ చేశారు. శుక్రవారం నల్గొండలోని సెయింట్ ఆల్ఫా స్కూల్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్ ,కెటిఆర్, హరీష్ రావులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.వారంతా తన కాలి గోటికి కూడా సరిపోరని అభివర్ణించారు.ప్రతిపక్ష హోదాలో ఉన్న కెసిఆర్ గత ఆరు నెలలుగా తన ఫామ్ హౌస్ లో పండుకొని కుంభకర్ణుడిలా నిద్రపోతున్నాడని,దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని సవాల్ చేశారు.బయటికి వచ్చి నీ తడాఖా ఏందో చూపిస్తా అంటున్నావు చూడడానికి మేము సిద్ధంగా ఉన్నామని అన్నారు.గత పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవకుండా డిపాజిట్లు కోల్పోయారని అన్నారు. ఇంకా ఆయన ఇప్పుడేం చూపిస్తాడని ఎద్దేవ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కెసిఆర్ పాత్ర ఏమీ లేదని అన్నారు.సకల జనుల సమ్మెతో పాటు పార్లమెంట్లో మేమంతా కొట్లాడినందుకు, శ్రీకాంత చారి లాంటి వారు ఎంతోమంది ప్రాణ త్యాగం చేయడంతో సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని అన్నారు.తెలంగాణ కోసం మేమంతా పదవి త్యాగం చేసి మళ్లీ తీసుకోలేదని పేర్కొన్నారు,కెసిఆర్, ఆ పార్టీ నేతలు రాజీనామాలు చేయడం ఉప ఎన్నికలకు పోవడం ఆంధ్రోళ్ల దగ్గర డబ్బులు దండుకోవడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు.అధికారంలో ఉన్నప్పుడు నల్గొండ జిల్లాలో ప్రాజెక్టును పూర్తి చేస్తానని విస్మరించాడని ధ్వజమెత్తారు. ఇక్కడ ఒక్క ఇల్లు కూడా నిర్మించి పేదలకు ఇవ్వలేదని ఆరోపించారు. 80 శాతం పూర్తి చేసిన సొరంగాన్ని కూడా కెసిఆర్ పట్టించుకోలేదన్నారు.తాము రెండేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టును పూర్తిచేసుకుని సీఎం రేవంత్ రెడ్డితో ప్రారంభించుకోవడం జరిగిందన్నారు.బస్వాపురం,గంధమల్ల రిజర్వాయర్లకు రూ.390 కోట్లు మంజూరు చేయించుకుని పనులు పూర్తి చేయించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. కెసిఆర్ ఇవన్నీ మర్చిపోవడంతోనే గత అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికలలో ఇంట్లో కూర్చోబెట్టారని అన్నారు. పలు స్థానాలలో డిపాజిట్లు కూడా దక్కలేదని పేర్కొన్నారు. కెసిఆర్ చేసినవన్నీ దొంగ దీక్షలు..10 ఏండ్లు మాటలకు గారడితో పాలన సాగించాడని విమర్శించారు.కెసిఆర్ నీకు, దమ్ము ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని అన్నారు.కెటిఆర్ లాంటి చిల్లర బ్యాచ్ తో మాట్లాడమని, అసెంబ్లీకి వస్తే నీతోనే తాడోపేడో తేల్చుకుంటామని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలన్నిటిని అమలు చేస్తుందని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఐదుగురు జడ్జిల ఫోన్లు కూడా టాపింగ్ చేశారని అన్నారు. దీంతో ప్రభాకర్ రావు, శ్రవణ్ కుమార్ అమెరికా నుంచి రావడంలేదని అన్నారు. వారు వస్తే మేము జైలుకు పోతామని కెసిఆర్ వాళ్ళ వద్దకు హరీష్ రావును పంపి రావద్దని చెప్పాడని అన్నారు. వీటన్నింటిపై కేసులు నడుస్తున్నాయని పేర్కొన్నారు.అభివృద్ధిపై చర్చించడానికి కేసీఆర్ ఏ జిల్లాకు వచ్చిన మాట్లాడానికి సిద్ధమేనని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు.నల్లగొండ ను దత్తత తీసుకుంటానని ఇక్కడి ప్రజలను మోసం చేశాడని విమర్శించారు. 970 ఇండ్లు కట్టి ఎవరికి ఇవ్వలేదని అన్నారు. వీటిని మూడు కోట్లు పెట్టి రిపేర్ చేయించి పేద ప్రజలకు ఇస్తామని అన్నారు.పార్టీల కచ్చితంగా అర్హులైన పేదలందరికీ ఇండ్లు ఇస్తామని మంత్రి పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఏడు లక్షల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు.అయినప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేసుకుంటూ ముందుకు పోతున్నామని అన్నారు.తమ ప్రభుత్వం అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు, ఇండ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా అమలు చేస్తుందని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, మాజీ జెడ్పిటిసిలు వంగూరి లక్ష్మయ్య, పాశం సంపత్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ పాశం రామ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ జూలకంటి ధనలక్ష్మి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.



## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

### నల్లగొండ డిఎస్పి శివరాం రెడ్డి

**ప్రజా పక్షం/ నల్లగొండ టౌన్:** విద్య పట్ల పిఆర్ ఆర్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని నల్లగొండ డిఎస్పి శివరాంరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మునుగోడు రోడ్డు లో గల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాల,కళాశాల అప్పాజీపేట లో చదువుతున్న పదోవ తరగతి విద్యార్థులకు పి ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించబడిన లాస్ట్ మినిట్ రివిజన్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి డిఎస్పి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థినిలకు అందజేశారు. ఇంతటి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఇప్పటికీ విజయవంతంగా కొనసాగిస్తున్న చెల్లం పాండురంగారావును అభినందించారు. అనంతరం పాఠశాల తరఫున డిఎస్పిని రూరల్ ఎస్ఐ సైదా బాబు,ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారావు తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్లయ్య, న్యాయవాది గుర్రం వెంకటరెడ్డి, కవి,గాయకులు కస్తాల వెంకన్న, ఊరుగుండ్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయినీలు కాసాల జ్యోతి, మనో స్రవంతి, ప్రజ్ఞ, నర్మద, శైలజ, ప్యూల, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# విద్య ప్రైవేటీకరణ, కాషాయీకరణకు కుట్ర



### ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు గొపగాని రవికుమార్
### ఎఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలను జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** అఖిల భారత విద్యార్థి సమాఖ్య జాతీయ సమావేశాలు ఫిబ్రవరి 9, 10 తేదీలో మన రాష్ట్రంలోని హైద్రాబాద్ నగరంలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సమితి సమావేశాలను జయప్రదం చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు గొపగాని రవికుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులో జాతీయ సమితి సమావేశాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అనే నినాదంతో అనునిత్యం విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ఏఐఎస్ఎఫ్ ముందుంటుందన్నారు. నేటి విద్యా విధానాన్ని మారుస్తూ నూతన జాతీయ విద్యా విధానాన్ని మోడీ ప్రభుత్వం తీసుకవచ్చిందన్నారు. విద్యను ప్రైవేటీకరణ కాషాయికరణ చేస్తున్నారని అన్నారు. విద్యార్థులకు స్ఫూర్తి భగత్‌సింగ్, అంబేద్కర్, కెరియర్ నారాయణ గురు లాంటి జీవిత చరిత్రలు, డార్విన్ సిద్ధాంతాన్ని పాఠ్యాంశాల నుంచి తొలగించి బ్రిటిష్ వారికి తొత్తులుగా వ్యవహరించిన సావర్కర్ జీవిత చరిత్రను చేర్చి దేశ చరిత్రను వక్తికరిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు రాజేష్, నవీన్, మహేష్, రాజు, వినయ్, రవి పాల్గొన్నారు.



### ఎఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయండి : ఆంజనేయులు, మురళీకృష్ణ

**ప్రజా పక్షం/నల్లగొండ :** హైదరాబాదు నగరంలో ఈనెల 9,10 తేదీలలో జరిగె ఏఐఎస్ఎఫ్ జాతీయ కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయాలని అ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగల వెంకటేష్ కొరారు.శుక్రవారం నల్లగొండ పట్టణంలో జాతీయ కౌన్సిల్ సమావేశాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తున్న సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు.ఈ సమావేశాలకు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నాయకులు హాజరవుతారని,విద్యారంగ సమస్యల మీద చర్చించి విద్యార్థుల భవిష్యత్ కోసం నిర్ణయాలు తీసుకుంటారన్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వలమల్ల ఆంజనేయులు,ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు పరచాలని, ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలని, కార్పొరేట్ విద్యను కట్టడి చేయాలని, ఇంజనీరింగ్ కళాశాలలో ఫీజులను తగ్గించాలని, పెండింగులో ఉన్న స్కాలర్షిప్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరపత్రం విడుదల చేసిన వారిలో పట్టణ కార్యదర్శి గాదేపాక సూర్య తేజ,కిరణ్,మహేష్, అరవిందు, సందీపు తదితరులున్నారు.



## రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు

### రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి పిలుపు

**ప్రజాపక్షం/యాదాద్రి :** రోడ్డు భద్రతా నియమాలు పాటించి, రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా జిల్లా రవాణా అధికారి ఆధ్వర్యంలో శుక్రవారం భువనగిరి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమానికి జిల్లా రెవిన్యూ అధికారి వీరా రెడ్డి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, ఏసిపి ప్రభాకర్ రెడ్డి, జెడ్పి సీఈవో శోభారాణి, జిల్లా రవాణా అధికారి సాయికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మారిన ఆధునిక కాలంలో ప్రజల కొనుగోలు శక్తి పెరగడంతో ఇప్పుడు ప్రతి ఇంట్లో బైక్, కారులు ఉండడం సహజమని ఆయన అన్నారు. ప్రభుత్వాలు కూడా రోడ్లను బాగా విస్తరింప జేస్తున్నాయాన్ని, సింగిల్ రోడ్డు డబుల్ రోడ్డుగా, డబుల్ ను ఫోర్ లైన్ గా, ఎక్స్ ప్రెస్ రోడ్లుగా విస్తరణ చేస్తున్నప్పటికీ రోడ్డు ప్రమాధాలు జరుగుతున్నాయని దీనికి కారణం వాహనం నడిపే వారి నిర్లక్ష్యంమే అని ఆయన తెలిపారు. విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సత్యానారాయణ, ట్రాఫిక్ సిఐ మధుసూదన్, రెడ్ క్రాస్ చైర్మన్ పురుషోత్తం, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసి జిల్లా అధ్యక్షులు కొమ్ము జగదీష్ బాబు, జై భీమ్ ఆటోడ్రైవర్ వెల్ఫేర్ సొసైటీ జిల్లా అధ్యక్షులు ఏ.శ్రీనివాస్, నాయకులు గూడెం నర్సింగరావు, ఎస్‌కె నిజాం, ఉప్పలయ్య, సిద్దిక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వందశాతం పన్నులు వసూలు

### జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్ పి. రాంబాబు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** వచ్చే వేసవిలో ఎలాంటి త్రాగునీటి సమస్య లేకుండా ఇప్పటి నుండే ప్రణాళికలు సిద్దం చేయాలని జిల్లా అదనపు(రెవిన్యూ) కలెక్టర్ పి. రాంబాబు అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ పురపాలకసంఘ కార్యాలయంలో మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి,జిల్లా అదనపు (రెవిన్యూ)కలెక్టర్ పి. రాంబాబు పురపాలకసంఘ కార్యాలయ విభాగాధిపతులతో,అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 202425ఆస్తిపన్ను,ఇంటింటి నీటిపన్ను,వాణిజ్య,వ్యాపార పన్ను(ట్రేడ్‌లైసెన్స్)100 శాతం వసూళ్ళు చేయవల్సిందిగా ఆదేశించారు. ఎల్.ఆర్.ఎస్ స్కీంకు సంబంధించి దరఖాస్తులను మొత్తం ఆన్‌లైన్ పూర్తి చేయవల్సిందిగా అధికారులను ఆదేశించారు. అన్ని వార్డుల్లో ప్రతిరోజు పారిశుధ్యం పనులు చేస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ కె.శ్రీనివాస రెడ్డి,ఏఈ వినోద్‌కుమార్,సీనియర్ అసిస్టెంట్ రంగారావు,జేఏఓ శ్రీధర్‌రెడ్డి,శానిటరీ ఇన్స్‌పెక్టర్ అశోక్,వివిధ విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# 7న సాంస్కృతిక ప్రదర్శన

### ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రపంచంలో ఎక్కడ జరగాని విధంగా ఫిబ్రవరి 7 తేదిన హైదరాబాద్ మహానగరంలో సాంస్కృతిక ప్రదర్శన జరగనుందని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా సన్నాహక డప్పుల ప్రదర్శన, సభకు ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ మన ఆవేదన మన గోడు ఈ ప్రభుత్వానికి వినిపించేందుకు లక్షల డప్పులతో సిద్ధం అవుతున్నామన్నారు. గ్రామాలలో, ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలంటే డప్పే ముఖ్యమని, లక్షల డప్పుల గుండె చప్పుడు ప్రభుత్వం వింటే మంచిదన్నారు. హైదరాబాద్ సాంస్కృతిక ప్రదర్శన వచ్చే ప్రతి ఒక్కరు డప్పుతోనే రావాలన్నారు. వర్గీకరణ ముందుగా అమలు చేస్తా అన్న ముఖ్యమంత్రి రేవంత్ ఎవరి మాటలకు తలవొగ్గి వర్గీకరణ అమలు చేయడం లేదని, ఆశలు నిరాశాలు చేసి ఉద్యోగులను భర్తీ చేస్తున్నారన్నారు. ఎస్‌సి వర్గీకరణ అడ్డుకుంటుంది మాలలలోని కొంతమంది స్వార్థపారులని, వాళ్లకు అంత శక్తి ఎలా వచ్చిందన్నారు. వర్గీకరణకు అనుకూలంగా మూడు కమీషన్లు తీర్పు ఇచ్చినా, వర్గీకరణ అనుకూలంగా మూడు సార్లు అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్రస్వామి మాదిగ, ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి సీనియర్ నాయకులు సందేల శ్రీనివాస్ మాదిగ, మంద శంకర్ మాదిగ, మీసాల గణేష్, దానయ్య మాదిగ, బోయ లింగస్వామి మాదిగ, జేరిపోతుల కరుణాకర్ మాదిగ, కొల్లూరి హరీష్ మాదిగ, కోళ్ల జహంగీర్ మాదిగ, నాగరం అంజయ్య మాదిగ, బండారు రవివర్ధన్ మాదిగ, బట్టు రామచంద్రయ్య మాదిగ, బర్రె జహంగీర్, వేముల అశోక్ పాల్గొన్నారు.

## సిబ్బంది సకాలంలో ఆసుపత్రికి రావాలి

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/నల్లగొండ (కేతేపల్లి) :** కేతేపల్లి మండల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, సిబ్బంది పనితీరు బాగుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అభినందించారు.శుక్రవారం ఆమె నల్గొండ జిల్లా, కేతేపల్లి మండల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది అందరూ సకాలంలో ఆసుపత్రికి రావాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. ఆసుపత్రి ద్వారా నిర్వహిస్తున్న వైద్య సేవలపై ఆమె ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అర్చనతో ఆరా తీశారు. ఆసుపత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవలతో పాటు, సాధారణ డెలివరీలు, మాతా, శిశు సంరక్షణ తదితర అన్ని అంశాల పట్ల ఆమె సంతృప్తి వ్యక్తం చేస్తూ బాగా పనిచేస్తుండటం పట్ల ఆసుపత్రి వైద్యులు ,సిబ్బందిని అభినందించారు. కేతపల్లి మండల ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి అవసరమైన లేబర్ రూమ్ ను మరింత పటిష్ట పరిచేందుకు చర్యలు తీసుకుంటామని, డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని, ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రానికి వచ్చే రహదారి వెంట లైట్లు ఏర్పాటు చేసేందుకు తక్షణమే ఆదేశాలు జారీ చేశారు. ప్రసవాలకు సంబంధించి ఈడిడి రిజిస్టర్ ను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. హై రిస్క్ కేసులు, కవలలు ,ఇతర రిస్క్ ఎక్కువగా ఉన్న కేసులను మాత్రమే ఏరియా ఆసుపత్రులు, నల్లగొండ జిల్లా ఆస్పత్రికి పంపించాలని, తక్కిన వాటికి ఇక్కడే వైద్యం చేసే విధంగా చూడాలన్నారు. పాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అర్చన, డాక్టర్ దివ్య, తహసిల్దార్ మధుసూదన్, ఎంపిడిఓ తదితరులు ఉన్నారు.

## పది ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలి

### కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్ :** విద్యార్థులు ఉన్నత ఆశయంతో చదివి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్‌పవార్ అన్నారు. శుక్రవారం ఇమాంపేట తెలంగాణ ఆదర్శ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులకు వడ్డించే మద్యాహ్న భోజన నాణ్యతను అలాగే మెనూ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి వారితో ముచ్చటిస్తూ సహపంక్తి భోజనం చేశారు. ప్రతిరోజు భోజనం ఎలా ఉంటుంది, ఏమేమి మీకు వడ్డిస్తున్నారు అనే వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఏ విధంగా చదవాలి, పరీక్షలు ఎలా రాయాలో పలు సూచనలు చేశారు. తదుపరి పాఠశాలలో నిర్వహిస్తున్న కెరియర్ కౌన్సిలింగ్ అండ్ గైడెన్స్ అనే రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్యాల ఉన్నత పాఠశాలలకు సంబంధించి హాజరవుతున్న యాక్టివ్ టీచర్లను ఉద్దేశించి మాట్లాడారు. ఉపాధ్యాయుల్లో స్ఫూర్తిని నింపారు. పదో తరగతి విద్యార్థులకు సరైన మార్గ నిర్దేశం చేయాలని, చక్కని సలహాలు ఇవ్వాలని, విద్యార్థుల్లో దాగి ఉన్న భయాన్ని తొలగించాలని, ఒత్తిడిని ఎలా అధిగమించి, భవిష్యత్‌కు ఎలా పునాదులు వేసుకోవాలో వివరించారు. పదవ తరగతి ఫలితాలలో సూర్యాపేట జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచేందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేయాలన్నారు. శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులకు ప్రేరణ ఇచ్చే క్రమంలో అత్యంత నిరుపేద స్థితిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థి, ఒక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడి సహకారంతో మంచి భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాల అమలుకు కృషి : సాబీర్ పాషా



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్:** అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు సారధ్యంలో కృషి చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయం, శేషగిరిభవన్‌లో శుక్రవారం చుంచుపల్లి మండలం పెనగడప గ్రామపంచాయితీ పరిధిలోని వనమానగర్‌కు చెందిన 30 కుటుంబాల వారు సిపిఐలో చేరారు. వీరికి ఎర్రజెండాలను కప్పిన సాబీర్ పాషా పార్టీలోని ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సంక్షేమ ఫలాలు ప్రతీ కుటుంబానికి చేర్చాలన్నదే కమ్యూనిస్టు పార్టీ లక్ష్యమన్నారు. రాజకీయాలకు తావులేకుండా ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు అందుతాయని చెప్పారు. అధికారులు ఇందుకోసం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సింగరేణి స్థలాల పేరుతో పేదల ఇండ్లు ఖాళీ చేయించి వారిని నిర్వాసితులను చేసే పనులు సింగరేణి మానుకోవాలన్నారు. సంస్థకు అవసరం లేని స్థలాలను ప్రభుత్వానికి అప్పగించి పేదలకు మేలు చేయాలన్నారు. సింగరేణి నిర్వాసిత కుటుంబాలకు పరిహారంతో పాటు ప్రస్తుత ధరలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ గృహవసతి కల్పించే బాధ్యత యాజమాన్యం తీసుకోవాలన్నారు. పార్టీలో చేరుకున్న నూతన సభ్యులు ప్రజలకు సేవలందించాలని కోరారు. సిపిఐలో చేరిన ముఖ్యుల్లో దొమ్మేటి శ్రీనివాస్, తోట నవీన్, బోళ్ల సాయికుమార్, గుండ్ల రమేష్, తమ్మిశెట్టి సు రేష్, వేముల నాగమణి, తోట స్వరూప తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, చలిగంటి శ్రీనివాస్, మండలకార్యదర్శి వాసిరెడ్డి మురళీ, జి వీరస్వామి, ఎస్ నాగేశ్వరరావు, భద్రరావు పాల్గొన్నారు.

## పేదల ఆశలు ఫలించేనా? ధరలపై నియంత్రణేది?

**ప్రజాపక్షం/ఖమ్మం :** పేదలు కేంద్ర బడ్జెట్‌కు సంబంధించి ఎన్నో ఆశలతో ఎదురు చూస్తున్నారు. దశాబ్ద కాలంగా పేదలను విస్మరించి సంపన్నుల పక్షాన నిలబడుతున్న కేంద్రం ఈసారైనా పేదలకు ఉపకరించేవిధంగా బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందన్న ఆశతో ఉన్నారు. రూ. 50లక్షల కోట్లతో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ధరల నియంత్రణకు సంబంధించి చర్యలు తీసుకోకపోతే సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడుతుంది. వ్యవసాయ రంగం కుదేలవుతున్న నేపథ్యంలో వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రోత్సాహకాలు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి సంబంధించి ఉపాధి రంగాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. కార్పొరేట్లకు పట్టం కట్టే నిర్మలమ్మ పద్దు ఈసారైనా పేదల వైపు చూస్తుందా అని పలువురు ఎదురు చూస్తున్నారు. శనివారం ప్రవేశపెట్టే బడ్జెట్ ఏ పక్షానికి మొగ్గుతుందో వేచి చూడాలి.

## ఇంటి పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్‌లో ఇంటి పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. శుక్రవారం కార్పోరేషన్ పరిధిలోని ఇంటిపన్ను, ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల కొరకు కమాన్ బజార్, కస్బాబజార్ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బిల్ కలెక్టర్లు టీ షర్ట్, టోపీలు ధరించి రెండు బృందాలుగా ఏర్పడి దుకాణ యజమానులను కలిసి ఇంటిపన్ను, పంపుపన్ను, ట్రేడ్ లైసెన్స్‌ను వెంటనే చెల్లించాలని కోరారు.ఈ స్పెషల్ డ్రైవ్‌లో మూడు లక్షలు వసూలు చేసినట్లు కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. కమర్షియల్ ప్రాంతాలైన గాంధీచౌక్, బైపాస్ రోడ్డు, గట్టయ్య సెంటర్ ప్రాంతాల్లో రేపు, ఎల్లుండి కూడా స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. సకాలంలో ఇంటిపన్ను, పంపుపన్ను, ట్రేడ్ లైసెన్స్ చెల్లించి నగరాభివృద్ధికి ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

## రోడ్లపై దుకాణాలు తొలగింపు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు, తోపుడుబండ్లను, డబ్బా కొట్లను కార్పోరేషన్ అధికారులు తొలగించారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ అధికారులు డిఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి యూనివర్సిటీ పిజి కాలేజీ నుంచి బైపాస్ రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను, పండ్ల వ్యాపారుల తోపుడుబండ్లు, డబ్బా కొట్లను తొలగించారు. రోడ్లపై డబ్బా కొట్లు, దుకాణాలు, తోపుడుబండ్లు పెట్టడం వల్ల వాహన దారులకు ఇబ్బందులు కలగడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు. రో డ్లపై ఎటువంటి దుకాణాలు, బడ్డికొట్లు ఏర్పాటు చేయవద్దని సూచించా రు.

## క్రీడలకు తోడ్పాటు ప్రశంసనీయం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** క్రీడలకు ప్రోత్సాహం అందించడం ప్రశంసనీయమని పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు అభినందనీయమని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. గురుకుల పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న పగిడిమళ్ల యశస్విని జాతీయ క్రికెట్‌కు ఎంపికైంది. ఆర్థికంగా వెనకబడిన కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న పరిశ సీతారత్నం ట్రస్టు ఛైర్మన్ పరిశ పుల్లయ్య యశస్వినికి ఆర్థిక ప్రోత్సాహం అందించడంతో పాటు అండగా నిలుస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ చేతుల మీదుగా ఆర్థిక సాయాన్ని, జాతీయ స్థాయికి ఎంపికైనందుకు జ్ఞాపికను అందజేశారు. శుక్రవారం గురుకుల ్ధరుకుల గురుకుల పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని లక్ష్య సాధనకు అనుగుణంగా అడుగులు వేయాలన్నారు. క్రీడలు జీవితంలో ఒక భాగమని విద్యతో పాటు క్రీడల పట్ల కూడా ఆసక్తిని పెంచుకోవాలని పుల్లయ్య కోరారు. రూ. 15వేల ఆర్థిక సాయాన్ని, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మోదుగు రమేష్‌బాబు, అధ్యాపకులు జయంతి, వాసుకి శుభమంగళ, ఎస్‌జిపిఏటి జిల్లా ఆర్థిక కార్యదర్శి కనపర్తి వెంకటేశ్వర్లు, గ్రంథపాలకురాలు భూక్యా తారా, యశస్విని తండ్రి కమలారావు పాల్గొన్నారు.

## సృజనాత్మకతను వెలికితీసేందుకే ప్రతిభా పరీక్షలు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రతిభా పరీక్షలు ఉపయోగపడతాయని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ తెలిపారు. ప్రతిభా పరీక్షల ద్వారా విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకుని మానసిక ధైర్యాన్ని పెంపొందించుకోవచ్చునని ఆయన తెలిపారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే పదవ తరగతి జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటి విద్యార్థి సంఘం, స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించి ఎందరినో అత్యున్నత మేధావులుగా తీర్చిదిద్దిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని ఆయన తెలిపారు. విద్యా రంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏఐఎస్ఎఫ్ పని చేస్తుందని ఆయన తెలిపారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పదవ తరగతి టాలెంట్ టెస్ట్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రతిభా పరీక్షల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న భయాన్ని పొగొట్టేందుకు ఉపయోగపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మ ణ్, జిల్లా సహాయ కార్యదర్శులు నాగులమీరా, శివానాయక్,హరికృష్ణ, పాల్గొన్నారు.

# సంక్షోభం వీడని రియల్ వ్యాపారం

ఆర్థిక ఇబ్బందుల్లో వ్యాపారులు

మందకొడిగా విక్రయాలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** రియల్ ఎస్టేట్ వ్యాపారం సంక్షోభాన్ని వీడలేదు. రాష్ట్రంలో పరుగులు పెట్టిన రియల్ వ్యాపారం ఒక్కసారిగా చతికిలబడింది. హైదరాబాద్‌లో ఓ బిల్డర్ ఆత్మహత్య ఘటన తర్వాత మళ్లీ రియల్ వ్యాపారంపై చర్చ మొదలైంది. ఏడాది కాలంగా పూర్తిగా స్తబ్దత అవరించింది. బిఆర్ఎస్ పాలన చివరి మూడు నెలల్లో ప్రారంభమైన ఈ సంక్షోభం నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం గట్టెక్క లేదు. కొనుగోలు, అమ్మకాలు ఒక దశలో పూర్తిగా నిలిచినా ఇప్పుడు అడపా దడపా నడుస్తున్నాయి. రియల్ వ్యాపారులతో కిక్కిరిసే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి సగానికి మించి గండిపడిందన్న ప్రచారం జరుగుతుంది. రియల్ ఎస్టేట్ వెంచర్లు వేసి ప్లాట్ల విక్రయాన్ని ప్రారంభించిన రియల్ వ్యాపారులు పూర్తిగా నష్టపోయారు. హైదరాబాద్‌తో పోటీ పడిన ఖమ్మం రియల్ ఎస్టేట్ రంగం కూడా కుదేలైంది. స్థిరాస్థి వ్యాపారంపై పెట్టుబడి పెడితే పెట్టుబడికి నష్టం రాదన్న వాదన ఈ సంక్షోభం ముందు నిలబడకపోవడంతో పెట్టుబడి పెట్టి స్థలాలను కొనుగోలు చేసేందుకు ఎవరు ముందుకు రావడం లేదు. అప్పులు తెచ్చి రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టిన వారు పూర్తిగా నష్టపోయారు. ఎంతకైనా



సరే విక్రయిద్దామని ఆలోచన చేసినా కొనుగోలు చేసే వారు కనిపించడం లేదు. వడ్డీలు చెల్లించలేక, ఉన్న స్థలాలను విక్రయించుకోలేక నానా ఇబ్బందులుపడుతున్నారు. ఖమ్మం నగరంలోనే 25 వేల మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉన్నారు. వీరంతా క్రయ, విక్రయాల మీద ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే మరింత ఇబ్బందులు పడక తప్పదన్న భావనతో ఆవేదనకు గురవుతున్నారు. ఇదిలా ఉండగా రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సంబంధించి హైదరాబాద్ సహా పలు నగరాల్లో కోట్ల రూపాయల విలువైన ఆస్తుల క్రయ విక్రయాలు జరుగుతున్నాయి కానీ మధ్యతరగతి ప్రజలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడంతో వ్యాపారం సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి కారణమైంది. ఇదిలా ఉండగా రియల్ ఎస్టేట్ వ్యాపారం సంక్షోభంలో కూరుకుపోవడంతో ఘర్షణలు ప్రారంభమయ్యాయి, అప్పుడు ఓ ధర ఇప్పుడు మరో ధర ఉండడంతో క్రయ విక్రయదారుల మధ్య వివాదాలు తలెత్తుతున్నాయి. ఈ పంచాయతీలు పోలీస్ స్టేషన్ వరకు చేరుతున్నాయి. ఖమ్మంలో ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌కు సంబంధించిన వివాదం తీవ్ర స్థాయిలో చర్చనీయాంశమైంది రాష్ట్ర ప్రభుత్వం ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకునేందుకు ఏమైనా చర్యలు చేపడుతుందన్న ఆలోచన కూడా కొందరి మదిలో ఉంది. తమ ఆర్థిక స్థాయికి మించి అప్పులు తెచ్చి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో



పెట్టిన వారి పరిస్థితి దయనీయంగా మారింది. ఏమి చేయాలో అంతు పట్టక సతమతమవుతున్నారు.

## గిరిజనులకు మేలు జరిగేలా అధికారులు పనిచేయాలి

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రభుత్వం ద్వారా అమలువుతున్న పథకాలు అర్హులైన గిరిజనులకు చేరి వారికి మేలు జరిగేలా ఐటిడిఏలోని వివిధ యూనిట్ల అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అనాన్నరు. శుక్రవారం పిఓ ఛాంబర్లో ఐటిడిఏ పిఓ రాహుల్‌తో కలిసి యూనిట్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిసిసి ద్వారా గిరిజనుల నుండి సేకరించే కరక్కాయ, విప్పపువ్వు, విషముష్టితో పాటు వివిధ ఔషధ గుణాలకు సంబంధించిన గింజలను కొనుగోలు చేయడమే కాకుండా గిరినులు వారే స్వయంగా మార్కెట్ చేసుకునేలా ప్రతీ డిఆర్‌డిపిలో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఇందు కోసం యంత్రాలు ఏర్పాటు చేసి వాటిపై మహిళలకు శిక్షణ ఇస్తామని చెప్పారు. వనమహోత్సవం సందర్భంగా పనస,జిడి, మునగ మొక్కలు తప్పనిసరిగా వేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. హాస్టళ్లలో మౌళిక సదుపాయల కల్పనకు పెద్దపీటవేస్తామని, పాడైన కుక్కర్లు, వంట సామాన్లను రిపేరు చేయించాలని, గిరిజన గ్రామాల్లో రోడ్లు వేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్ఆర్ఈజిఎస్ ద్వారా వెదురు, పండ్ల మొక్కలు కూరగాయలు, ఆకుకూరలు వేసేలా అవగాహన



కల్పించాలన్నారు. వర్షపునీరు వృధా కాకుండా చిన్నచిన్న చెక్ డ్యాంలు నిర్మించుకుని నీటిని కాపాడుకోవాలన్నారు.

అనంతరం ఐటిడిఏ పరిసరాలను ఆయన పరిశీలించారు. గ్రౌండ్‌లో వర్షపు నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఐటిడిఏ కు వచ్చే వారు సేదతీరేందుకు ముస్తాబుచేయాల్నారు. ఉద్యోగుల పిల్లలు ఆడుకునే విధంగా బ్యాట్మెంటన్ కోర్టు ఏర్పాటు చేయాలన్నారు. ఐటిడిఏ నివాస గృహాల మరమ్మత్తులకు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. అనంతరం వివిధ తినుబండారాల తయారీ యూనిట్లు, కోయబొమ్మల తయారీ యూనిట్లు పరిశీలించిన ఆయన మార్కెటింగ్ సౌకర్యం కల్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి రాంబాబు, డిడి మణెమ్మతో వివిధ యూనిట్ల అధికారులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి పొంగులేటి పర్యటన

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియోజక వర్గంలో నేడు పర్యటించనున్నారు. శనివారం ఉదయం 10.30 గంటలకు నేలకొండపల్లి భక్తరామదాసు కళాక్షేత్రంలో భక్తరామదాసు జయంతోత్సవాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొంటారు. ఉదయం కొనాయిగూడెం గ్రామంలో చిట్టి ఆంజనేయ స్వామి విగ్రహా ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొంటారు. ఉదయం 11.30 గంటలకు కూసుమంచి మండలం మంగలితండా గ్రామంలో మృతుల కుటుంబాలను పరామర్శిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు నాయకన్‌గూడెంలో తిరుపతమ్మ అమ్మ వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొంటారు.

అనంతరం నేతగాని గోపి, మృతి చెందిన పుల్లయ్య కుటుంబాన్ని మంత్రి పొంగులేటి పరామర్శిస్తారు. మధ్యాహ్నం మృతుల కుటుంబాలను పరామర్శిస్తారు. మధ్యాహ్నం 1.30కు కూసుమంచి క్యాంపు కార్యాలయంలో ప్రజలకు, నాయకులకు, అభిమానులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందుబాటులో ఉంటారు. సాయంత్రం నాలుగు గంటలకు తిరుమలాయపాలెం మండలం ఎర్రగడ్డ గ్రామంలో మృతుల కుటుంబాలను పరామర్శిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు ఆరెంపుల గ్రామంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు రూరల్ మండలం పోలేపల్లిలో గరికపాటి వెంకట్రావు కుటుంబాన్ని మంత్రి పరామర్శిస్తారు.

## నిస్వార్థ కమ్యూనిస్టు లాలయ్య

సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** సుదీర్ఘ కాలం పాటు కమ్యూనిస్టు పార్టీకి వివిధ రూపాల్లో సేవలు అందించిన అచ్చెన లాలయ్య నిస్వార్థ కమ్యూనిస్టు అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ పురోగతి కోసం పెద్దమునగాల గ్రామాభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అచ్చెన లాలయ్య నాల్గవ వర్ధంతి సభ మండల పరిధిలోని పెద్దమునగాల గ్రామంలో జరిగింది. ఆయన స్మారక స్తూపం వద్ద సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ అనేక అటుపోట్లను తట్టుకుని లాలయ్య కమ్యూనిస్టుపార్టీ పక్షాన నిలబడ్డారన్నారు. కేసులను సైతం లెక్కచేయకుండా ప్రజల పక్షాన నిలిచిన లాలయ్య ఆశయ సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. మారిన రాజకీయ పరిస్థితుల్లో అవకాశవాదం పెరిగిపోయిందని పదవులు, సంపాదన కోసం విలువలకు తిలోదకాలు ఇస్తున్నారని హేమంతరావు తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలుగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, సిపిఐ, రైతు సంఘాల నాయకులు పివి రావు, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, మోదుగు చిన్న వెంకటి, పాపగంటి సుదర్శన్, వెంకటయ్య, తలారి పాపయ్య, పిచ్చయ్య పాల్గొన్నారు.

## కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా..ఒకరు మృతి

**ప్రజాపక్షం/బోనకల్:** మండల కేంద్రంలో వైరాజగ్గయ్యపేట ప్రధాన రహదారిపై సాగర్ కెనాల్ సమీపంలో కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడడంతో ఓ మహిళ అక్కడిక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళితే..మండలంలోని బోనకల్‌కు చెందిన 25మంది వ్యవసాయ కూలీలు వత్సవాయి మండలంలో మిర్చికోతకు వెళ్లివస్తుండేవారు. గురువారం ఉదయం 8 గం.ల సమయంలో వత్సవాయి వ్యవసాయదారుని ట్రాక్టర్‌లో డ్రైవింగ్‌లో అనుభవంలేని యువకుడు 25 మంది కూలీలను వత్సవాయికి తీసుకునిపోతుండగా కెనాల్ సమీపంలో వాహనాన్ని క్రాస్ చేసే ప్రయత్నంలో పల్టీ కొట్టింది. దీంతో కూలీలంతా మురుకునీటిలో పడి, ట్రాక్టర్ ట్రక్కు మీద పడింది. అటుగా వెళ్తున్న వాహనదారులు, సమీపంలోని గ్రామస్థులు జెసిబి సాయంతో ట్రక్కును తీసి క్షత్రగాత్రులను మొదటగా మండల ప్రాథమిక కేంద్రానికి, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రధాన ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో బోనకల్‌కు చెందిన యార్లగడ్డ వరమ్మ(60) అ క్కడిక్కడే మృతి చెందగా, 15 మందికి తీవ్రగాయాలయ్యాయి కాగా, పదకొండు మందికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను హు టాహుటిన ఖమ్మం ప్రధానసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో నిమ్మగడ్డ సుబ్బమ్మ, మరీదు శైలజ, ఆ త్మకూరి మహాలక్ష్మి , యార్లగడ్డ సీతయ్య, లింగ సుశీల, లింగం నాగమణి, ఆత్మకూరి సీతయ్య, తంబాల దుర్గ, మరీదు పద్మ, షేక్ మస్తాన్‌బీ, మరీదు ధనలక్ష్మి , గాలి కోటేశ్వరి, గద్దె పుల్ల మ్మ, కృష్ణయ్య, మరీదు సత్యంలకు తీవ్ర గాయాలయ్యా యి.

**ఘటనపై దిగ్భాంత్రి వ్యక్తం చేసిన డిప్యూటీ సిఎం మల్లు, రెవెన్యూ మినిస్టర్ పొంగులేటి..** ఈ ప్రమాదంలో మృతి చెందిన మృతురాలు యార్లగడ్డ వరమ్మకు తెలంగా ణ డిప్యూటీ



సిఎం మల్లు భట్టీవిక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఖమ్మం ప్రభుత్వాసుత్రి అధికారులకు ఫోన్ ద్వారా సూచించారు. మాజీ జెడ్‌పిచైర్మన్ లింగాల కమలరాజు వైద్యం పొందుతు న్న క్షతగాత్రులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని సూచించారు. మృ తురాలికి రూ.20 లక్షలు, తీవ్రగాయాల పాలైనవారికి రూ.10 ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ తీ న్మార్ మల్లన్న తన టీం జిల్లా ఇన్‌చార్జీ పెద్దప్రోలు కోటేశ్వరరావుకు ఫోన్ ద్వారా వివరాలు తెలుసుకొని, దిగ్భాంత్రి వ్యక్తం చేశారు. మృతురాలిని రా ష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిసిసి అధ్యక్షులు పు వ్వాళ్ల దుర్గాప్రసాద్, పిసిసి మెంబర్ పైడిపల్లి కిషోర్‌కుమార్, ఆత్మకమిటీ ఛైర్మన్ కర్నాటి కోటి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు గాలి దుర్గారావు, సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సహయ కార్యదర్శి ఆకెన పవన్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు , సభ్యులు తేనే వెంకటేశ్వర్లు, కటికల శ్యామ్ బాబు నివాళులర్పించారు.

## నిధులు కరువు.. నిర్వహణ బరువు

**ప్రజాపక్షం/చింతకాని:** గ్రామపంచాయతీలకు పల్లెప్రగతితో పాటు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు ఆగిపోయాయి. పాలకవర్గం పదవీకాలం ముగిసి ఏడాది పూర్తయింది.పల్లెల్లో బోరుబావుల మరమత్తులు, ట్రాక్టర్లకు డీజిల్ కొనుగోలుకు , పారిశుద్ధ్య నిర్వహణ,ఇతర పనులకు పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి పెట్టాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఇప్పటికే పలువుర పంచాయతీల నిర్వహణకు చేతి నుంచి రూ.లక్షల్లో వ్యయం చేశారు.




**కేంద్రం నుంచి రావట్లే...** ఉమ్మడి జిల్లాలోని 1068 గ్రామపంచాయతీలకు ప్రతినెలా పల్లెప్రగతి కింద రూ.523 కోట్ల మేర నిధులు విడుదలయ్యేవి. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థికసంఘం నిధులు వచ్చేవి. నీతిఅయోగ్ కమిషన్ సిఫార్సులతో పాలకవర్గాలు లేని పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో ఆ నిధులు విడుదల కాని పరిస్థితి నెలకొంది. ఏడాది కాలంలో నాలుగు నెలల కింద రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు మాత్రమే పంచాయతీల ఖాతల్లో జమయ్యాయి. ఆ నిధులను ట్రాక్టర్ల రుణవాయిదాల చెల్లింపునకు వినియోగించారు.

**ఎన్నికలు నిర్వహిస్తేనే...** ఇటీవల నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలకు సైతం కార్యదర్శులు అప్పులు తెచ్చి టెంట్లు వేయించారు. ఖమ్మంకు కూత వేటు దూరంలో ఓ కార్యదర్శి ప్రామిసరీ నోటు రాసిచ్చి అప్పులు తెచ్చి గ్రామపంచాయతీ నిర్వహణ చేపడుతోంది.భవిష్యత్తులో నిధులు రాకుంటే పరిస్థితి ఏమిటనే ఆందోళనలో వారు ఉన్నారు. ప్రత్యేకాధికారులు నెలకోసారి కూడా పంచాయతీల ముఖం చూడకపోగా అప్పులు తెచ్చి ఖర్చుచేసిన బిల్లులు పేమెంట్ చెక్కుల సంతకాలకు పర్సంటేజ్‌లు కావాలంటున్నారని కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలకు ఎన్నికలు త్వరగా నిర్వహించి నిధులు మంజూరు చేస్తేనే ప్రగతికి అడుగులు పడనున్నాయి. అధికారులు మాత్రం పంచాయతీల ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు నివేదిస్తున్నామని చెబుతున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలోని మాచిన్‌పేట గ్రామపంచాయతీ జనాభా 1500 పారిశుద్ధ్యం , ట్రాక్టర్ నిర్వహణకు నిధుల్లేక కార్యదర్శి రూ.2లక్షల అప్పు తెచ్చి వ్యయం చేశాడు. నెలవారీ ఖర్చు సుమారు రూ.1.75లక్షలు అవుతుంది.ట్రాక్టర్ డీజిల్ కొనుగోలుకు నిధుల్లేక కార్యదర్శి పాట్లు పడుతున్నారు.చింతకాని మండలం కోమట్లగూడెం గ్రామపంచాయతీ జనాభా 2040 పారిశుద్ధ్యం , ట్రాక్టర్ నిర్వహణ,వీధి లైట్ల నిర్వహణ బోర్ల రిపేర్‌కు నిధుల్లేక కార్యదర్శి రూ.4లక్షల అప్పు తెచ్చి వ్యయం చేసింది.కొణిజర్ల మండలంలోని అన్నవరం గ్రామపంచాయతీ జనాభా 650 పారిశుద్ధ్యం , ట్రాక్టర్ నిర్వహణకు నిధుల్లేక కార్యదర్శి రూ.40 అప్పు తెచ్చి వ్యయం చేశాడు. ట్రాక్టర్ డీజిల్ కొనుగోలుకు నిధుల్లేక కార్యదర్శి పాట్లు పడుతున్నాడు. గ్రామ పెద్దలను కలిసి నిధులు సమకూర్చాలని కోరుతున్నాడు.సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామపంచాయతీ జనాభా.4200 పారిశుద్ధ్యం, ట్రాక్టర్ నిర్వహణకు ప్రతి నెలా రూ.1.50లక్షల వ్యయం అవుతోంది.గతంలో పల్లెప్రగతి కింద ప్రతి నెలా రూ. 4.35 లక్షల వరకు నిధులు మంజూరయ్యేవి. ప్రస్తుతం నిధులు లేక బోరుబావుల మోటార్ల మరమత్తులు, అత్యవసర పనుల నిమిత్తం రూ. 7.5 లక్షలు అప్పుతెచ్చి కార్యదర్శి పనులు చేపట్టాడు.రూ.5లక్షల విద్యుత్తు బిల్లులు బకాయి ఉండ్లి.భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెం మండలం లచ్చగూడెం గ్రామపంచాయతీ జనాభా 1220 నెలవారీ రూ.25 వేల ఖర్చు వస్తుంది. గతంలో పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా నెలవారీ రూ.1.6లక్షలు పడేవి .దీనిలో ట్రాక్టర్ నెలవారీ కిస్తు,సిబ్బంది జీతభత్యాలు,పారిశుద్ధ్యం అత్యవసర పనులకు ఖర్చు చేసేవాళ్లం. ఇప్పుడు ట్రాక్టర్ కిస్తులు కట్టడం లేదు. ఇప్పటి వరకు రూ. 1.35 లక్షలు అప్పు తెచ్చి పంచాయతీ లో పనులు నిర్వర్తిస్తున్నారు.

## రిజర్వేషన్ అమల్లో కాంగ్రెస్ దొంగాట

మాజీ ఎంఎల్ఏ సండ్ర వెంకటవీరయ్య




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎస్సి రిజర్వేషన్ అమలు చేసి మాదిగ సామాజిక వర్గాలకు న్యాయం చేయాలన్న సుప్రీం కోర్టు తీర్పును నిర్లక్ష్యం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దొంగాట ఆడుతుందని మాజీ ఎంఎల్ఏ సండ్ర వెంకటవీరయ్య ఆరోపించారు. శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సి వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి కార్యాచరణ అమలు చేయడం లేదన్నారు. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు తప్ప దానిని అమలు చేయడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు పదవులు ఇవ్వడం లేదని రాష్ట్రంలో కీలకమైన ఉప ముఖ్యమంత్రి, అసెంబ్లీ స్పీకర్ పదవిని, ఖమ్మంజిల్లాలో రెండు ఎంఎల్ఏ స్థానాల్లోనూ మాదిగలకు ఒక్కటి కూడా ఇవ్వకుండా అన్యాయం చేస్తుందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం కేసిఆర్ సారధ్యంలో ఎస్సి వర్గాల ఉన్నతి కోసం దళితబంధు, ఎస్సి కార్పోరేషన్ నిధులు, 1025 గురుకులాలు, రెసిడెన్షియల్‌ను ఏర్పాటు చేశారని సండ్ర తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలపై శ్రద్ధ వహించడం లేదన్నారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించి దేశానికే తలమానికంగా కేసిఆర్ ఏర్పాటు చేశారని ఆయన తెలిపారు. రాష్ట్ర సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టి దళితుల పట్ల కేసిఆర్‌కు ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్లలో ఎస్సి, ఎస్టిలకు లక్ష అదనంగా ఇస్తామని ప్రకటించి అమలు చేయడం లేదని ఆరోపించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఎకరం లోపు భూమి కలిగిన రైతులకు వర్తింపజేయాలన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నేతలే పోటీ సభలు నిర్వహిస్తున్నారని ఆయన విమర్శించారు. ఎస్సి వర్గీకరణను తక్షణమే అమలు చేసి ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో దామాషా పద్ధతిలో అమలు చేయాలని సండ్ర డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంఎల్ఏ కొండబాల కోటేశ్వరరావు, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, పగడాల నాగరాజు, బెల్లం వేణు, శీలంశెట్టి వీరభద్రం, బొమ్మెర రామ్మూర్తి, బిచ్చాల తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

# ఫోకస్

# సైన్స్

# అడుగడుగునా 'చిప్స్' అవసరమే!





అధునాతన జీవితంలో అడుగడుగునా మైక్రోచిప్స్ అవసరమవుతున్నాయి. మొబైల్ ఫోన్ల నుంచి కంప్యూటర్ల వరకూ... కార్ల నుంచి రిఫ్రిజిరేటర్ల వరకూ... ఎన్నో ఉపకరణాలలో సెమీ కండక్టర్లతో నడిచే ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ (ఐసి) లేదా మైక్రోచిప్స్ వాడకం అనివార్యమైంది. మన దేశంలో అత్యధిక శాతం మంది ఉపయోగించే స్మార్ట్‌ఫోన్లలో సెల్యులార్ నెట్‌వర్క్‌ను కనెక్ట్ చేయడానికి, టచ్ స్క్రీన్‌కు, డేటా స్టోరేజీకి చిప్స్ అవసరం. అదే విధంగా కంప్యూటర్లలో సమాచారాన్ని ప్రాసెస్ చేయడానికి ఈ చిప్స్ తప్పనిసరి. రిఫ్రిజిరేటర్లు, డిష్‌వాషర్లు, వాషింగ్ మెషిన్లు, మైక్రోవేవ్‌లు... ఇలా ఇప్పుడు అందుబాటులో ఉన్న ఎన్నో ఉపకరణాలలో విద్యుత్ ప్రవాహాన్ని నియంత్రిచడం నుంచి మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడంవరకూ అన్నింటా సెమీ కండక్టర్ల చిప్స్ అవసరం ఉంది. కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లేదా ఎఐ)లో కంప్యూటింగ్ శక్తికి డిమాండ్ పెరుగుతున్న కొద్దీ వీటి డిమాండ్ కూడా పెరుగుతున్నది. కృత్రిమ మేధ అనువర్తనాలు, క్లౌడ్ కంప్యూటింగ్, మెషిన్ లెర్నింగ్‌లో ఉపయోగించే చిప్స్‌కు ఎక్కువ డిమాండ్ ఉంది. వాహన తయారీదారులకు అధిక కంప్యూటింగ్ శక్తితో కూడిన చిప్స్ అవసరం ఎక్కువ. ముఖ్యంగా పరిశ్రమ ఎలక్ట్రిక్ నుండి స్వయం ప్రతిపత్తి వాహనాలకు మారుతున్నప్పుడు, స్మార్ట్‌ఫోన్లలో ఉపయోగించే వాటి కంటే భిన్నమైన చిప్స్ అవసరమవుతాయి. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, 5జి, 6జిలు భవిష్యత్తులో చిప్స్ డిమాండ్‌ను మరిత పెంచుతాయి. కాగా, కొవిడ్ 19 మహమ్మారి కారణంగా, వర్క్ ఫ్రం హోం, ఆన్‌లైన్ లెర్నింగ్ పెరిగింది. ఈ పరిణామం సహజంగానే ఎలక్ట్రానిక్స్ పరికరాలకు డిమాండ్‌ను వేగవంతం చేసింది. సరఫరా గొలుసులను విపరీతంగా పెంచింది. ప్రపంచవ్యాప్తంగా పరిశ్రమలకు అంతరాయం కలిగించే చిప్ కొరత ఏర్పడింది. ప్రపంచ సెమీకండక్టర్ మార్కెట్ 2019తో పోలిస్తే 2020లో 6.8 శాతం పెరిగినట్టు గణాంకాలుచెప్తున్నాయి. 2022లో 573.44 బిలియన్ డాలర్ల నుండి 2029 నాటికి 1,380.79 బిలియ న్ డాలర్లకు 12.2 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధి రేటుతో పెరుగుతుందని అంచనా. ప్రపంచంలో ఇప్పుడు రష్యా, ఉక్రెయిన్ మధ్య, ఇజ్రాయిల్, పాలస్తీనాల మధ్య జరుగుతున్న యుద్ధాలు, అనేక దేశాలలో సంభవిస్తున్న సం క్షోభాలు ప్రపంచ చిప్ సరఫరా గొలుసును ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. ఇక యుయస్‌లో కొత్త ప్రభుత్వం కొలువుతీరాక చైనా చిప్స్ అమ్మకాలపై నియంత్రణలను ప్రేరేపించవచ్చు. ఈ విషయాన్ని యుఎస్ సెమీకండక్టర్ ఇండస్ట్రీ నివేదికలో ప్రపంచంలోనే అతిపెద్ద సెమీకండక్టర్ మార్కెట్ సెమీకండక్టర్ ఇండస్ట్రీ అసోసియేషన్ (ఎస్ఐఏ) తెలిపింది. ఈ కారణంగా మరో చిప్ కొరత ఏర్పడుతుందని కొన్ని అంచనాలు ఉన్నాయి. డిమాండ సరఫరా మధ్య అంతరాన్ని చిప్ తయారీదారులు కూడా అంత త్వరగా పూడ్చలేరు. ఇంక ఇక్కడ మరో సమస్య ఉంది. కొత్త సెమీకండక్టర్ ఫ్యాబ్‌లను తెరవడానికి ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ నైపుణ్యం కలిగిన ఇంజనీర్ల కొరత మరో పక్క ఉంది. ఎస్ఐఏ నుండి వచ్చిన కొత్త డేటా ప్రకారం 2030 నాటికి ఈ పరిశ్రమలు 1,15, 000 కంటే ఎక్కువ ఉద్యోగాల కల్పనకు కారణమవుతాయని అంచనావేయబడింది. మన దేశంలో జనాభా, ప్రజల ఆదాయం, సాంకేతిక పరిజ్ఞానాల పెరుగుదల కారణంగా కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ అతిపెద్ద వాటాను కలిగి ఉంది. స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు డిమాండ్ పెరగడంతో సెమీకండక్టర్ వినియోగం విస్తృతమవుతున్నది. నిరంతరం విస్తరిస్తున్న డిజిటల్ మౌలిక సదుపాయాలు, అధునాతన గాడ్జెట్ల పట్ల పెరుగుతున్న అభిరుచి, కన్జ్యూమర్ ఎలక్రానిక్స్‌ను ప్రాధమిక చోదక శక్తిగా నిలబెట్టాయి. ఇది దేశంలో సెమీకండక్టర్ మార్కెట్ పెరుగుదల గతిని ప్రభావితం చేసే కీలక రంగంగా మారింది. ప్రస్తుతం భారత్ ప్రధానంగా తైవాన్, చైనా, కొరియా, వియత్నాం దేశాల నుంచి సెమీకండక్టర్ దిగుమతులపై ఎక్కువగా ఆధారపడుతోంది. దేశంలో సెమీకండక్టర్ మార్కెట్ విలువ 2023లో 3430 కోట్ల డాలర్లు. 2023 నుండి 2032 కాలంలో కాలంలో 20.1% సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు (సిఎజిఆర్)తో 10,020 కోట్ల డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇటీవలి సంవత్సరాలలో మనదేశం సెమీకండక్టర్ పరిశ్రమలో గణనీయమైన పురోగతిని సాధించింది. సెమీకండక్టర్ డిజైన్ ఇంజనీర్ల అత్యంత నైపుణ్యం కలిగియున్న ప్రముఖ దేశాలలో ఒకటిగా మారింది. ప్రపంచంలోని సెమీకండక్టర్ డిజైన్ ఉద్యోగులలో 20 శాతం మనవారే ఉన్నారు. లక్ష మందికి పైగా విఎల్ఎస్ఐ డిజైన్ ఇంజనీర్లు ప్రపంచ సెమీకండక్టర్ కంపెనీలు, దేశీయ డిజైన్ సేవా సంస్థలలో పనిచేస్తున్నారు. ఇలావుంటే, అధునాతన ఫ్యాబ్రికేషన్ ఫెసిలిటీస్ (ఫ్యాబ్స్) స్థాపన నిర్వహణకు సంబంధించిన అధిక ముందస్తు ఖర్చుల మూలధన వ్యయం కారణంగా సెమీకండక్టర్ పరిశ్రమ గణనీయమైన నియంత్రణను ఎదుర్కొంటుంది. భారీ ప్రారంభ పెట్టుబడుల అవసరం చిన్న సంస్థలకు బలమైన అవరోధాన్ని సృష్టిస్తుంది. అదనంగా ఎగుమతి నియంత్రణలు, వాణిజ్య సుంకాలు, పర్యావరణ నిబంధనలు వంటి నిబంధనలలో మార్పులు సెమీకండక్టర్ మార్కెట్‌ను ప్రభావితం చేస్తాయి. కఠినమైన నియంత్రణ అవసరాలు భారత సెమీకండక్టర్ మార్కెట్‌కు అవరోధంగా ఉన్నాయి. ఎందుకంటే అవి కొత్త ఉత్పత్తులు సాంకేతికతల అభివృద్ధి ప్రవేశాన్ని నిరోధిస్తున్నాయి. కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు, ఇతర పర్యావరణ ప్రమాణాలకు సంబంధించిన కఠినమైన నిబంధనలు, మేధో సంపత్తి, పేటెంట్లపై న్యాయ పోరాటాలు మార్కెట్ పురోగతిని ప్రభావితం చేస్తాయి. వివాదాలు సంబంధిత కంపెనీలకు చట్టపరమైన ఆర్థిక ఇబ్బందులకు గురి చేయవచ్చు. ఈ సమస్యలను అధిగమించడాకి ముందుగా, పోటీతత్వాన్ని పెంచి, ఉత్పత్తి క్షీణతను నివారించడానికి కంపెనీలు పరిశోధన అభివృద్ధిలో నిరంతరం పెట్టుబడి పెట్టాలి. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, శక్తి వినియోగానికి సంబంధించిన సమస్యలతో సహా కంపెనీలు తమ ఉత్పత్తులను ఈ అవసరాలకు అనుగుణంగా మార్చాల్సి ఉం టుంది. సెమీకండక్టర్ తయారీ, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి స్పష్టమైన సహాయక నిబంధనలు, విధానాలు అవసరం. అనుమతుల ప్రక్రియలను క్రమబద్ధీకరించడం, ప్రోత్సాహకాలను అందించడం పరిశ్రమ వృద్ధికి దోహదపడుతుంది.

# దూరాలు కొలిచేద్దాం..



భూమి సూర్యుని చుట్టూ ఒక నిర్దిష్టమైన కక్ష్యలో తిరుగుతూ ఉంటుంది. ఈ కక్ష్య వ్యాసం 300 మిలియన్ కిలోమీటర్లు. అంటే 30 కోట్ల కిలోమీటర్లు. దూరం కనుక్కోవలసిన నక్షత్రాన్ని ఖగోళ శాస్త్రవేత్తలు భూమిపై ఒక ప్రదేశం నుంచి టెలిస్కోపు ద్వారా ముందుగా పరిశీలిస్తారు. ఆ నక్షత్రం నుంచి వెలువడే కాంతి కిరణాలు కంటితో ఏర్పడే కోణాన్ని కనుగొంటారు. దీన్ని దృష్టికోణం అంటారు. దీన్ని నమోదు చేసుకున్న తర్వాత ఆరునెలలు నిరీక్షించాల్సి ఉంటుంది. ఎందుకంటే భూమి సూర్యుని చుట్టూ ఒకసారి తిరగడానికి 12 నెలల కాలం పడుతుందని తెలుసుగా? ఆరునెలల తర్వాత భూమి తన కక్ష్యలో మొదటి స్థానం నుంచి సరిగ్గా వ్యతిరేక స్థానంలోకి చేరుకుంటుంది. అప్పుడు మళ్లీ టెలిస్కోపులో ఆ నక్షత్రాన్ని పరిశీలించి తిరిగి దృష్టికోణాన్ని కనుగొంటారు. భూమి మొదటి స్థానం, ఆరునెలల తర్వాత ఉన్న స్థానం, నక్షత్రం ఉండే స్థానాలను మూడు బిందువులనుకుంటే, ఈ మూడింటి మధ్య ఒక వూహా త్రిభుజం ఏర్పడుతుంది. ఈ త్రిభుజంలో భూమి రెండు స్థానాల మధ్య దూరం 30 కోట్ల కిలోమీటర్లని (భూకక్ష్య వ్యాసం) మనకు తెలుసు. అలాగే రెండు దృష్టికోణాలు కూడా నమోదయ్యాయి. నక్షత్రం నుంచి కాంతి ప్రయాణించే వేగం కూడా తెలుసు. ఈ కొలతలను త్రికోణమితి (Trigonometry) సూత్రంలో ప్రతిక్షేపిస్తే భూమికి, నక్షత్రానికి మధ్య దూరం ఎంతో తెలిసిపోతుంది. ఈ పద్ధతిలో భూమి నుంచి 400 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న నక్షత్రాల దూరాన్ని లెక్కించవచ్చు. మరో పద్ధతిలో నక్షత్రాల నుంచి వెలువడే కాంతిని వర్ణమాపకం (spectrometer)లో అమర్చి ఉండే పట్టకం (prism) గుండా ప్రసరింపజేసి తద్వారా ఏర్పడే వర్ణపటం (spectrum) లో రంగుల తీవ్రతలను బట్టి కూడా నక్షత్రాల దూరాలను లెక్కిస్తారు.

# ఆ శక్తిహీన కాంతి ఎక్కడిది?



నార్తన్ లైట్స్ గురించి అందరికీ తెలిసే ఉంటుంది. ఈ కాంతి పుంజాలను ఆరొరా లేదా అరొరా బోరియాలిస్, అరోరా ఆస్ట్రేలియస్ అని కూడా పిలుస్తారు. సౌరగాలి వల్ల భూమి అయస్కాంత క్షేత్రంలో ఏర్పడే అవాంతరాల ఫలితంగా అరోరాస్ లేదా నార్తన్ లైట్స్ ఏర్పడతాయి. ఇవి సహజంగా ఏర్పడిన కాంతి వలయాలు. సౌర గాలి వేగాన్ని కరోనల్ హోల్స్, కరోనల్ మాస్ పెంచుతాయి. తత్ఫలితంగా భూమి అయస్కాంత పరిధిలో కొన్ని అవాంతరాలు ఏర్పడతాయి. మాగ్నెటోస్పిరిక్ ప్లాస్మాలోని ఉత్తేజం పొందిన కణాల పంథాను మారుస్తాయి. ఈ కణాలు అయనీకరణం చెందడంతో వివిధ రంగుల్లో కాంతి పుంజాలు ఏర్పడతాయి. అయితే, ఇటీవల శాస్త్రవేత్తలు ఈ నార్తన్ లైట్స్‌లో శక్తిహీన కాంతిని గుర్తించారు. ఇవి సహజమైన ఆరోరాస్ కావని పరిశోధకులు తేల్చిచెప్తున్నారు. దీనితో ఈ విచిత్రమైన వెలుగు లేదా కాంతి ఎక్కడదన్న ప్రశ్న తలెత్తుతున్నది. కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ కాల్గరీ పరిశోధకులు ట్రాన్సిషన్ రీజియన్ ఎక్స్‌ప్లోరర్ లేదా ట్రెక్స్ మిషన్ ద్వారా తీసిన అరోరల్ చిత్రాల్లో ఏదో విచిత్రమైన కాంతిని గుర్తించారు. ఇతర అరోరల్ ఇమేజర్లు ఎరుపు లేదా ఆకుపచ్చ కాంతి తరంగదైర్ఘ్యాలను మాత్రమే స్వీకరిస్తాయి. కానీ, ట్రెక్స్ కెమెరాలు తీసిన చిత్రాల్లో బూడిద రంగులో చిత్రమైన కాంతి కనిపించింది. అదే విధంగా తెల్లటి మచ్చలను కూడా శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇవి కొన్ని వందల కిలోమీటర్ల వరకూ విస్తరించి ఉండవచ్చని పరిశోధకులు చెప్తున్నారు. అయితే, ఇది ఎలా ఏర్పడ్డాయనే ప్రశ్నకు సమాధానం ఇవ్వలేకపోతున్నారు. దీనిపై విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. కాగా, నార్తన్ లైట్స్ కాంతికి పర్యావరణ కాలుష్య కారణంగా ఏర్పడిన అడ్డంకులే ఇలాంటి శక్తిహీన కాంతిగా కనిపిస్తున్నదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లు అమలు



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** కులజనగణన సంఖ్య ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ్ల ధనుంజయ నాయుడు అన్నారు. బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు టి.వెంకట్రాములు అధ్యక్షతన వరంగల్ ఐరన్ అండ్ మర్చంట్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సందర్భంగా రాష్ట్ర కౌన్సిల్‌లో ప్రవేశపెట్టిన తీర్మానాలను ఆమోదించినట్టు తెలియచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఇవ్వడం కాకుండా, బిసి కులగణన ప్రకారం తేలిన సంఖ్యకు అనుగుణంగా మాత్రమే రిజర్వేషన్లు అమలు చేయాలని, ఈనెల ఏడవ తేదీన జరిగిపోయే శాసనసభ సమావేశాల్లో దేశంలో వెంటనే కుల జన గణన చేపట్టాలని అందుకు పార్లమెంట్‌లో బిల్లు ఆమోదించి రాష్ట్రపతి ఉత్తర్వులను ఇప్పించాలన్నారు. రాహుల్ గాంధీ చెపుతూ రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేసి కుల జనాభా ప్రకారం ఎవరి వాటా వారికి ఇవ్వాలని చెపుతున్నదానికి, కేంద్రం వెంటనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం అసెంబ్లీలో కులగణన చేపట్టాలన్నారు. బిసిలకు మంత్రిత్వ శాఖను వెంటనే ఏర్పాటు చేయాలి, కార్పొరేషన్ ఏర్పాటు చేసి బిసిలకూ ప్రత్యేకంగా సగం బడ్జెట్ కెటాయించాలి, ఉచిత విద్య, వైద్యం కార్పొరేట్ స్థాయిని మించి అందివ్వాలి. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బిసిలకు వడ్డీలేని రుణాలు, ఉన్నత చదువులకు బిసి విద్యార్థులకు సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలి, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపి ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయాలి, ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో బిసి కుల గణన ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. భవిష్యత్తులో ఈ తీర్మానాలు అమలు కోసం క్షేత్ర స్థాయిలో బిసి హక్కుల సాధన సమితి బిసిల దగ్గరకు వెళ్ళి చైతన్యం చేస్తుందంటున్నారు, హక్కుల కోసం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులలో ఎమ్మెల్యేలను, మంత్రులను కలిసి వినతి పత్రాలు ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వం కుల గణన కోసం బిల్లు పెట్టడం కోసం కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచడానికి ఛలో రాజ్ భవన్ కార్యక్రమం చేపట్టాలని ఈ కౌన్సిల్‌లో తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. హిందూ మతానికి బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పుకొంటున్న బిజెపి మోడీ ప్రభుత్వం బిసి కుల జనగణన చేయడానికి వెంటనే రాష్ట్రపతిచే కమిషన్ ఉత్తర్వులు జారీ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు, లేకపోతే హిందువులలోని బిసిలకు వ్యతిరేకంగా ఇంకా మనువాద అగ్రవర్ణ వ్యవస్థకే ప్రతినిధిగా బీజేపీని భావించవలసి వస్తుందన్నారు. బీసీలను గందరగోళం చేయడానికి అగ్రకుల పార్టీల కనుసన్నలలో ఉంటూనే కొన్ని ప్రాంతాలకు బయలుదేరుతున్నారు, నిజాయితీ కలిగి, సహేతుకమైన ఎజెండాతో కలిసి వచ్చే సంఘాలతో వ్యక్తులతో, శక్తులను కలుపుకొని ముందుకు వెళుతుందన్నారు. అన్ని జిల్లా, మండల, గ్రామీణ ప్రాంతాల్లో ఐక్య బిసి కమిటీల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కౌన్సిల్ రాష్ట్ర కమిటీ ఆఫీసు బేరర్‌గా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామిని తీసుకున్నారు. ఈ కౌన్సిల్ సమావేశంలో తాటి వెంకటేశ్వర్లు ఖమ్మం, వనం సత్యనారాయణ మంచిర్యాల, ఎస్.వెంకటయ్య మేడ్చల్, నల్గొండ, కరీంనగర్ ఇతర జిల్లాల కౌన్సిల్ సభ్యులతో పాటు, వలబోజు వెంకన్న, ఓర్సు రాజు, చీకటి ప్రకాష్, బొట్ల శ్రీనివాస్, మేకల రవి, పనాస ప్రసాద్, సిపిఐ కార్యదర్శి, సహాయ కార్యదర్శులు సౌహార్థ ప్రతినిధులుగా పాల్గొన్నారు.

# మోదీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థల విధ్వంసం

## సిపిఐ అధ్యయన తరగతులలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వీరస్వామి



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో ఎన్‌డిఏ అధికారంలోకి వచ్చిన నాటి నుండి వేగంగా ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేస్తూ, నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ రంగానికి పెద్దపీట వేస్తున్నారని అసిస్టెంట్ ప్రొఫెసర్ వీరస్వామి అన్నారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన జరిగిన పార్టీ అధ్యయన తరగతులలో వీరస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ మూలంగా అంతరాలు పేద, ధనిక మధ్య తారతమ్యాలు పెరుగుతున్నాయని, ఇది మానవ అభివృద్ధికి గొడ్డలిపెట్టుగా భావించాలన్నారు. దేశంలో రాజకీయాలను శాసిస్తూ కార్పొరేట్ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ధనిక పేదల మధ్య తారతమ్యాలు కొనసాగుతూ మానవ అభివృద్ధి విధ్వంసం జరుగుతున్నదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసి, రక్షణ రంగం, తపాలా, రవాణా ఎయిర్‌వేస్, పరిశ్రమలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ పెట్టుబడిదారులకు కట్టబెట్టడం వెనుక ప్రజలకు ఉపాధిని దూరం చేసేందుకేనని అన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు హామీ ఏమైందని, దేశం అభివృద్ధి కావాలంటే ధనిక, పేద తేడా లేకుండా ఉండాలంటే విద్య, వైద్యం, న్యాయం ప్రభుత్వ రంగంలో కొనసాగాలని అన్నారు. దాని వలన నిరుద్యోగం పెనుభూతంలా పెరిగిపోతూ ఉందని చెప్పారు. ఈ శిక్షణా తరగతులలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, భాష బోయిన సంతోష్, నాయకులు జక్కు రాజు గౌడ్, వేల్పుల సారంగపాణి, మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, మాలోత్ శంకర్ నాయక్, కొట్టె వెంకటేష్, ప్రణీత్ గౌడ్, గోకల రాజయ్య, వేల్పుల చరణ్, రవితేజ తది తరులు పాల్గొన్నారు.

# సిపిఐ నాయకులపై కేసు కొట్టివేత



**ప్రజాపక్షం/ఖమ్మం :** విధులకు ఆటంకం కలిగించారని 16 మంది సిపిఐ నాయకులపై పెట్టిన కేసును ఖమ్మం అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఏపూరి బిందుప్రియ శుక్రవారం కొట్టివేశారు. 2014 సంవత్సరంలో మమత సమీపంలోని సాగర్ కాలువ కట్టలపై పేదలు ఏర్పాటు చేసుకున్న గుడిసెలను పోలీసులు అక్రమంగా తొలగిస్తున్న సమయంలో సిపిఐ నాయకులు అడ్డుకున్నారని తమ విధులకు ఆటంకం కలిగించారని అప్పటి పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తి విచారణ తర్వాత కేసును కొట్టివేశారు. ఈ కేసులో ఉన్న సిపిఐ సీనియర్ నాయకులు మేకల సంగయ్య, ఎన్. రమాదేవిలు మరణించగా మిగిలిన వారిని నిర్దోషులుగా తేల్చారు. ఈ కేసులో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, జక్కుల లక్ష్మ య్య, ఉపేందర్, ఎల్లయ్య, స్వర్ణ ప్రశాంత్, జి.రవి, ఎ.శివ, సాగ్రామ జ్యం, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు. ఓరుగంటి శేషగిరిరావు ముద్దాయిల తరపున వాదించారు.

# ఘనంగా తక్కళ్లపల్లి జన్మదిన వేడుకలు





## శుభాకాంక్షలు తెలిపిన సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు

**ప్రజాపక్షం/హనుమకొండ :** సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు శుక్రవారం హనుమకొండలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేక్‌ను తక్కళ్లపల్లి శ్రీనివాసరావు కట్ చేయగా పలువురు సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, పంజాల రమేష్, ఎన్.అశోక్ స్టాలిన్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మ ణ్, మునగాల బిక్షపతి, బాషబోయిన సంతోష్, జక్కు రాజు గౌడ్, యేషబోయిన శ్రీనివాస్, వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, మాలోతు శంకర్ నాయక్, కండె నర్సయ్య, కొట్టె వెంకటేష్, ప్రణీత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బాషబోయిన సంతోష్, ఉట్కూరి ప్రణీత్ గౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యాలయంలో వరంగల్ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్ మియా, జిల్లా నాయకులు బుస్సా రవిందర్, గన్నారపు రమేష్, దండు లక్ష్మ ణ్, మేడిది అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పసుపు బోర్డు ఏర్పాటుకు యుద్ధప్రాతిపదికన చర్యలు

## పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో నిజామాబాద్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి




**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో నిజామాబాద్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేటి నుండి ప్రారంభం కానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీల అమలుపై నిర్ణయం తీసుకోవాలని సిపిఐగా కోరుతున్నామన్నారు. వ్యవసాయ రంగానికి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికై అధిక నిధులు కేటాయించాలని జిల్లా ప్రజల చిరకాల కోరిక అయిన బోధన్ –బీదర్ రైల్వేలైన్, ఈ మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పసుపు బోర్డు ఏర్పాటుకై యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని పసుపు పండించిన రైతాంగానికి క్వింటాలుకు 15 వేలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని జిల్లా అభివృద్ధికై నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి జిల్లా అభివృద్ధికై కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. డాక్టర్ స్వామినాథన్ సిఫారస్ ప్రకారం పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు నిర్ణయించాలని, ప్రభుత్వ రంగాలలో పని చేస్తున్న కార్మిక వర్గానికి సుప్రీంకోర్టు తీర్పునుసరించి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, పేద ప్రజలపై పన్నులు వేయకుండా ఈ బడ్జెట్ ఉండాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో నగర కార్యదర్శి ఓమయ్య, మండల కార్యదర్శి ముత్యాలు, నాయకులు దేవేందర్, పవన్ పాల్గొన్నారు.

## కొత్త డ్రామాకు తెరలేపిన కాంగ్రెస్

### మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



**ప్రజాపక్షం/నర్సంపేట :** స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టి లో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ కొత్త డ్రామాకు తెరలేపిందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. నర్సం పేట పట్టణంలోని ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రకటి ంచిన గ్రామ సభల్లో ఏ ఒక్క పథకం కూడ అధికారికంగా ప్రకటించలేదని, అప్పటికప్పుడు ప్రకటించిన ప్రొసి డింగ్ చూస్తే నవ్వు వస్తుందన్నారు. 179 గ్రామ పంచాయతీ లకు గాను 6 గ్రామ పంచాయతీల్లో మాత్రమే లబ్ధిదారులను ప్రకటించారని, మిగతా వారు మీకు ఓట్లు వేయలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ కి గ్రామల్లో ఓట్లు పడని పరిస్థితి, ఓటర్ల విశ్వాసం కోల్పోయారన్నారు. ప్రజలు అన్ని గమనిస్తూన్నారు, బాధ్యతగా వ్యవహరించని అధికారులకు ఇబ్బందులు తప్పవన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ కోసం తెచ్చిన రూ. 60 కోట నిధులను ల్యాప్స్ చేసి, మళ్లీ రాష్ట్ర వ్యాప్తంగా మళ్లీ ఆవే నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు అవే గైడ్ లైన్స్ లతో మళ్ళీ టెండర్లు పిలిచారన్నారు.

## సామాన్యులకు అందుబాటులో న్యాయసేవలు

### సీనియర్ సివిల్ జడ్జి క్షమా దేశ్ పాండే




**ప్రజాపక్షం/వరంగల్ లీగల్ :** సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన, అట్టడుగు వర్గాల కు చట్టపరమైన సహాయం అందించే లక్ష్యంతో బాలలకు లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు చేసామని హనుమకొండ జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి క్షమా దేశ్ పాండే అన్నారు. శుక్రవారం జిల్లా బాల రక్షా భవన్ లో జువేనైల్ కోర్ట్ న్యాయమూర్తి యం డి ఫరీహా అహ్మద్ తో కలిసి లీగల్ ఎయిడ్ క్లినిక్ ను ప్రారంభించారు. సామా న్యులకు అండగా న్యాయసేవ సంస్థ పనిచేస్తుందని పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జువేనైల్ కోర్ట్ న్యాయమూర్తి మా ట్లాడుతూ బాలలు, తల్లిదండ్రులు చట్టాల పై అవగాహన పెంచుకో వాల న్నారు. ఈ కార్యక్రమంలో జువేనైల్ బోర్డు సభ్యులు మేరుగు సుభాష్, డాక్ట ర్ గోపిక రాణి, డిపిఓ లు రమణ మూర్తి, రాధా రెడ్డి, పి.పి.రచిత, డిసి పిఒ ప్రవీణ్‌కుమార్, బిఆర్‌బి విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హెల్మెట్ తప్పనిసరి

### కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామప్రతినిధి:** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరిం చాలని, ప్రమాదాల నివారణకు రహదారులపై హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో డిసిపి రాజమహేం ద్ర నాయక్, ఎఎస్‌పి పండారి చేతన్ నితిన్‌లతో కలిసి కలెక్టర్ రిజ్వా న్ బాషా షేక్ రహదారి భద్రతపై జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సభ్యు లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ జాతీయ, ఇతర ప్రధాన రహదారులు కలిసే ప్రాంతాలలో స్పీడ్ బ్రేక ర్లను ఏర్పాటు చేయాలని, పట్టణంలో పెండింగ్‌లో ఉన్న రోడ్డు పునరుద్ధ రణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రహదారి భద్రత ప్రమా ణాలకు ప్రతి ఒక్కరు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఈ సమీక్ష సమావే శంలో జిల్లా రవాణా అధికారి జీవీ శ్రీనివాస్‌గౌడ్, మున్సి పల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఘనపూర్ ఏసిపి భీం శర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### కంది కొనుగోలు కేంద్రం ప్రారంభం

జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో కందిపంట కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులతో కలిసి ప్రారంభిం చారు. కలెక్టర్ మాట్లాడుతూ కంది పంట సాగు చేసిన రైతులు తమ పంటకు రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా ఒక క్వింటాల్‌కు మద్దతు ధర రూ.7,550లు కల్పించి కొ నుగోలు చేస్తున్నందున రైతులందరు తమ పంటను విక్రయించి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి రంజిత్‌రెడ్డి, మార్కెటింగ్ అధి కారి నరేంద్ర, వ్యవసాయ అధికారి రామారావు నాయక్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ సెక్రటరీ శ్రీనివాస్, పిఎసిఎస్ చీటకోడూర్ సిఇఒ భాస్కర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

### జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధిః** సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబం ధనలు పాటించాలని, రహదారి భద్రత మనందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శుక్రవారం జిలాల కేంద్రంలోని రవాణాశాఖ కార్యాలయం నుండి జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం ముగింపు సందర్భంగా రహదారి సురక్ష అభియాన్ శ్రద్ధ రోడ్డు భద్రత అవ గాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జెండా ఊపి ప్రారం భించారు.కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రహదారి భద్రత మనందరి బాధ్యత సామాజిక బాధ్యతగా రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో రవా ణాశాఖ అధికారులు, ట్రాఫిక్ రూల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. వాహనాలను అందరూ జాగ్రత్తగా నడపాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, సంబం ధిత అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండలంలోని వెల్ది మోడల్ స్కూల్‌లో 2025 26 సంవత్సరానికి గాను ఆరవ తరగతిలో ఖాళీగా ఉన్న 100 సీట్ల భర్తీ కొరకై ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ పి శ్రీధర్ తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడవ తరగతి నుండి పదవ తరగతిలో ఖాళీఅగా ఉన్న సీట్ల భర్తీ కొరకు ఆసక్తి గల విద్యార్థుల తల్లిదండ్రులు http//telanganams.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఫిబ్రవరి 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ 13వ తేదీన విద్యార్థులకు ప్రవేశపరీక్ష నిర్వ హిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇంకా ఇతర వివరాలకు 90002 83113 నెంబర్‌ను సంప్రదించాలని ఈ సందర్భంగా తెలిపారు.

# బడా పన్ను బకాయిదారులపై దృష్టి

### ✻ బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** బడా పన్ను బకాయిదారులపై దృష్టి సారించాలని బల్దియా కమిష నర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్ది యా ప్రధాన కా ర్యాలయంలోని కౌన్సిల్ హాలులో ఆర్ఐలు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్ట ర్లతో పన్ను వసూళ్ల పురోగ తిపై ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో కమిష నర్ పాల్గొని పన్ను వసూళ్లపై తగు సూచనలు చేశారు. ఇప్పటి వరకు నిర్దేశిత లక్ష్యానికి అనుగు ణంగా పన్ను వసూళ్లు జరగలేదని, ఆర్థిక సంవ త్సరం ముగియడానికి కేవలం రెండు నెలల స మయం మాత్రమే ఉందని, అసత్యాన్ని వీడి ప్ర ణాళికాబద్ధంగా సమగ్ర కార్యాచరణ రూపొందిం చుకొని పన్ను వసూళ్లు చేయాలన్నారు. ప్రతీ వా ర్డు, ఆఫీసర్ వారి, డివిజన్లలో పెద్ద మొత్తంలో బకాయి ఉన్న 200 మంది జాబితా సిద్ధం చేసు కొని డివిజన్‌కు చెందిన కమర్షియల్, రెసిడెన్షి యల్‌లో పన్ను వసూళ్లు చేయాల్సిన జాబితాలు సిద్ధం చేసుకొని వెంట ఉంచుకోవాలన్నారు. ప్రతీ రోజు మధ్యాహ్నం వరకు రెసిడెన్షియల్, కమర్షి యల్ పన్ను వసూళ్లు పూర్తి చేసి పెద్ద మొత్తంలో బకాయి ఉన్న వారి వసూళ్లు జరిపేలా చూడా ల న్నారు ప్రాపర్టీ టాక్స్ వసూళ్ల లక్ష్యం రూ. 11,621.26 లక్షలు కాగా ఇప్పటి వరకు రూ. 4511.32 లక్షలు (39 శాతం) నల్లా పన్ను వ సూళ్ల లక్ష్యం అనగా రూ. 6688.02 లక్షలు , రూ. 1048.66 లక్షలు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్ర మంలో అదనపు కమిష నర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, ప్రస న్నరాణి, పన్నుల అధికరి రామకృష్ణ, రెవెన్యూ అ ధికారులు షహజాది బేగం, శ్రీనివాస్, యూసుఫోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ ఆదేశించారు. శుక్ర వారం మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలు పాలకుర్తి, దర్దేపల్లి, మల్లంపల్లి, విస్నూర్, చెన్నూర్ పాఠశాలల టాయిలెట్స్ రిపేర్, మంచినీటి సౌకర్యం, మైనర్ రిపైర్స్, ఎలక్ట్రిఫికేషన్, అంగన్వాడీల రిపేర్ వర్క్స్‌ను ఆయన పరిశీలించారు. జేసి మాట్లాడుతూ పాఠశాలల్లో మిగిలి ఉన్న పను లను తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌లను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో ఆవుల రాములు, ఎంఈవో పోతుగంటి నర్సయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

### జిల్లా అధనపు కలెక్టర్ సంధ్యారాణి



**ప్రజాపక్షం/నర్సంపేట:** మహిళలు సొంతంగా ఆర్థికంగా వ్యాపారవేత్తలుగా ఎదగాలని వరంగల్ జిల్లా అదనపు కలె క్టర్, నర్సంపేట మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం నర్సంపేట పట్టణంలోని శాంతి ప ట్టణ సమాఖ్య సమావేశం శాంతి పట్టణ సమాఖ్య అధ్యక్షు రాలు ముస్కు నీరజ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి వారు ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘా మహిళలు ఆర్థి కంగా ఎదగాలని, సొంతంగా ఆర్థికంగా వ్యాపారవేత్తలుగా ఎదగాలని, ఒకే రకమైన వ్యాపారాలు కాకుండా కొత్తగా ఆ లోచించి ఆ ప్రాంతంలో తక్కువ పెట్టు బడి తో ఎక్కువ లా భాలు వచ్చేలా ఉండే విధంగా వ్యాపారాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఇందిరా మహిళా శక్తి క్యా ంటీన్స్, టీ స్టాల్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. హోమ్ ఫుడ్ ద్వారాకూడా పెట్టుబడి కంటే ఎక్కువ లాభాలు వస్తాయన్నా రు. శాంతి పట్టణ సమాఖ్యలోని అన్ని సమాఖ్యలు బ్యాంకు లింకేజీ, వ్యక్తి గత రుణాలతో వారు అభివృద్ధి చెందాలన్నా రు. ఈకార్యక్రమంలో మెప్మా కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎ. రాంచందర్ రావు, డిఎంసి రేణుక, ఏడిఎంసి వహీదా, శాంతి పట్టణ సమాఖ్య కార్యదర్శి హసీనా, కోశాధి కారి జి. పద్మ, టిఎల్‌పి ఆర్‌పి మాధవి, సిఎల్ఆర్‌పి డి సుమ లత, సమాఖ్యల అధ్యక్షులు, ఆర్‌పిలు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో గద్దర్ విగ్రహం ఏర్పాటు

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

### ఘనంగా గద్దర్ జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లిప్రతినిధి:** భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మంజూర్ నగర్ సెం టర్‌లో ప్రజాయుద్ధ నౌక గద్దరన్న విగ్రహం వచ్చే వర్ధ ంతి నాటికి ఏర్పాటు చేస్తామని భూపాల పల్లి ఎమ్మె ల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవా రం భూపాలపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో గద్ద ర్ జయంతి సందర్భంగా ఆ యన చిత్రపటానికి పూ లమాల వేసి ఎమ్మెల్యే సత్తన్న ఘన నివాళులు అర్పిం చారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎ మ్మెల్యే గండ్ర మాట్లాడుతూ గద్దర్ తనకలం, గళం తో తెలంగాణ ఉద్యమానికి ఊపిరులు ఊదారన్నా రు.సమాజంతో అసమానతలు, వివక్షకు వ్యతిరేకం గా ఎలుగెత్తిన గొంతుక గద్దరని కొనియాడారు. ఈ ప్రజాప్రభుత్వంలో గద్దర్ వర్ధంతిని అధికారికంగా నిర్వమించడం అభినందనీయమన్నారు.ఆయన పే రుతో అవార్డు నెల కొల్పి ప్రతి ఏటా కవులు,కళాకారు లకు, సినీపరిశ్రమ ప్రముఖులకు ప్రదానం చే యడం జరుగుతుందన్నారు. టిపిసిసిఅధికార ప్రతినిధి గాజ ర్ల అశోక్,టిపిసిసి సభ్యులు చల్లూరి మధు,జిల్లా కాం గ్రెస్ నాయకులు బుర్ర కొమురయ్య,పిప్పాల రాజేం దర్, అంబాల శ్రీనివాస్ ,తోట రంజిత్,చల్లా రేణుక, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు

### ఎస్‌పి కిరణ్ ఖరే



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికలు ఉన్నందున జిల్లాలో తక్షణమే ఎ న్నికల నియమావళి అమలులో ఉందని జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే శుక్రవారం ఒక తెలిపారు. ఫిబ్ర వరి 3న ఎన్నికల నోటిఫికేషన్ రానుందని మార్చి 8న ఎన్నికల ప్రక్రియ పూర్తివుతందని ఆయన తెలిపారు.ఎన్నికల కోడ్ ఉన్నందున ర్యాలీలు, సభలు, సమావేశాలకు సంబంధించిన అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు వారి ప్రచారం లో నేతలు కు లం, మతం పేరుతో రెచ్చగొట్టే వ్యాఖ్యాలు చేయరాదని పేర్కొన్నారు. ప్రార్థన స్థలాల్లో ప్రచారం చేయకూ దదని, ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురిచేయరా దన్నారు. సోషల్ మీడియాలో ఇతరుల ను కిం చపరిచే విధంగా పోస్టులు పెట్టవద్దని ఎస్‌పి కోరారు.ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని ఎస్‌పి హెచ్చరించారు.

## వాహనదారులకు అవగాహన



**ప్రజాపక్షం/జనగామటౌన్:** రోడ్డు భద్రత మాసోత్సవాల లో భాగంగా శుక్రవారం ము గింపు కార్యక్రమాన్ని పురస్క రించుకుని జిల్లా రవాణా అధి కారి జివి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వ ర్యంలో జనగామ చౌరస్తా నుండి కలెక్టర్ ఆఫీసర్ వరకు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు హెల్మెట్ ధరించడం గురించి వా హనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ కానిస్టేబుల్ వెంకటేష్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతతోనే ప్రమాదాలకు నివారణ

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

### రోడ్డు భద్రత మాసోత్సావాల ముగింపు సభ





**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** వాహన దారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం అత్యంత ప్రమాదకరమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్ర వారం జిల్లా ర వాణా, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్మెట్ అవగాహన మోటర్ సైకిల్ ర్యాలీ ఐడిఓసి కార్యాలయం నుండి గణేష్ చౌక్ మీదుగా బిఆర్ అంబేద్కర్ సెంటర్ వరకు కొనసా గిన ర్యాలీని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ జెం డా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో జిల్లా కలె క్టర్, ఎస్‌పిలు హెల్మెట్ ధరించి వాహనాలు నడిపి పలువురిని ఆకర్షించారు. ఈ సందర్భంగా అంబే ద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జి ల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ దేశంలో సగటు న 70 శాతం మంది రోడ్డు ప్రమాదాలలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవటంవల్ల ప్రాణాలు కోల్పోతున్నారని, మద్యం సేవించి వా హనాలు నడుపరాదని, వాహనదారులు నడిపే డ్రై వర్లు తప్పని సరిగా సీట్‌బెల్ట్ ధరించాలని సూచిం చారు. ముఖ్యంగా యువత ఎక్కువగా బైక్‌లపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తు ప్రమాదాల భారీనపడుతూ వారి తల్లిదండ్రులకు శోకాన్ని మిగులుస్తున్నారని, తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలను,ఆశ యాలను గుర్తుపెట్టు కోవాలని ఎస్‌పి సూచించా రు. అనంతరం జిల్లా కేంద్రంలో డ్రైవర్లకు కంటి అద్దాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అద నపు కలెక్టర్ అశోక్ కుమార్,జిల్లా రవాణా శాఖ అధికారి మహ్మద్ సంధాని అదనపు ఎస్‌పి భో నాల కిషన్, డిఎస్‌పి సంపత్ రావు, సిఐలు నరేష్ కుమార్, మల్లేష్, ఎస్ఐలు సింగరేణి, జొన్నో, అధి కారులు సిబ్బంది బార్ అసోసి యేషన్ సభ్యులు, పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### స్థానిక ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

వేసవిలో త్రాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా రాన్ను పది రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిం చాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐడి ఓసి కార్యాయలయ సమావేశపు మందిరంలో గ్రామ పంచాయితీ, మండల ప్రత్యేక అధికారులు ఎంపిడిఓలు,మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికా రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మా ట్లాడుతూ రాబోవు వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాలలో మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఫిబ్రవరి 1 వ తేదీ నుండి పది రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి గ్రామాలో నిరుపయోగంగా ఉన్న బోర్లు, చేతి పంపులు, పైపు లీకేజీలు,నూతన పైపు లైన్ల ఏర్పాటు గేట్ వాల్స్‌ల లీకేజీలను గుర్తించి నివే దిక అంద జేయాలని అదేశించారు. నీటి సరఫరా ఇక్కట్లను అధిగమించేందుకు మిషన్‌భగీరథ నీటి వినియోగం పై అవగాహన సదస్సు నిర్వహించా లని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలుక్టర్లు అశోక్ కుమార్,విజయ లక్ష్మి జిల్లా పంచాయితీ అధికారి నారాయణ రావు,మండల ప్రత్యేక అధికారులు,మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారు,గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారులు ఎంపిడిఓలు, ఎంపిఓలు పాల్గొన్నారు.

## టిజిఎస్ ఆర్‌టిసి డ్రైవర్ సుదర్శన్ పదవీ విరమణ



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** గత 27 సంవ త్సరాలుగా టిజిఎస్ ఆర్‌టిసిలో కల్వచర్ల. సుదర్శన్ డ్రైవర్‌గా, బస్సు చైర్మన్‌గా సేవ లందించి పదవి విరమణ చేశారు. గ్రేటర్ వరంగల్ మున్సి పల్ కార్పొరేషన్ 65వ డివిజన్ ఎల్లాపూర్ గ్రామం టిజిఎస్‌ఆర్‌టిసి సంస్థలో డ్రైవర్‌గా, బస్ చైర్మన్‌గా 27 సం వత్సరాలు సేవలందించిన కల్వచర్ల సుద ర్శన్‌కు వరంగల్ డిఎం వం గాల మోహన్ రావు వరంగల్ డిపోలో శుక్రవారం పదవి విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి గౌరవ వరంగల్ వన్ డిపో డిఎం వంగాల మోహా నరా వు కల్వచర్ల సుదర్శన్‌ను శాలువాతో సత్కరించి శుభా కాంక్షలు తెలియజేశారు. అనంతరం డిఎం మోహన్‌రావు మాట్లాడుతూ సుదర్శన్ విశిష్టమైన సేవలు అందిస్తూ తన తోటి ఉ ద్యోగులతో పాటు పై ఆఫీసర్లతో మంచి స్నేహభా వంతో ఉండేవారని, రిమార్కు లేకుండా సర్వీసును పూర్తి చేసినందుకు ప్రత్యేకంగా అభినందించినారు. అలాగేప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని అన్నారు. ఈ కార్యక్రమా నికి వచ్చిన బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపే రునా కృతజ్ఞతలు తెలుపుతున్నాను అని అన్నారు. ఈ కార్య క్రమంలో వరంగల్ వన్ డిపో డిఎం వంగాల మోహన్ రావు, కార్మికులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఎ ల్లాపూర్ గ్రామ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు

### ఇస్ట్ జోన్ డిసిపి రవీందర్



**ప్రజాపక్షం/ఆత్మకూరు:** ప్రభుత్వ ఉద్యోగు లకు పదవి విరమణ అనివార్యమని ఇస్ట్ జోన్ డిసిపి రవీందర్ అన్నారు. శుక్రవారం ఆత్మ కూరు పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న తంగేళ్ల గోవర్ధన్ పదవీ విరమణ పొందారు. ఈ పదవీ విరమణ కార్యక్రమానికి ము ఖ్యఅతిథిగా వరంగల్ ఈస్ట్ జోన్ ముఖ్యఅ తిథిగా హాజరై మాట్లాడారు. ఈ సంద ర్భం గా డిసిపి మాట్లాడుతూ పోలీస్ శాఖ అంటేనే అన్ని శాఖల యొక్క, ప్రజల యొక్క బాగో గులను చూసుకోవడం మా పోలీస్ ఉద్యోగుల ప్రత్యేక విధి అని కొనియా డారు. ప్రజాసే వలో రాజ్యాంగబద్ధంగా ఉద్యోగం చేయడం మా విధి అని అన్నారు.. పదవి విర మణ పొందుతున్న తంగేళ్ల గోవర్ధన్ ఉద్యోగం బాధ్యతల్లో ప్రజల మన్ననలు పొందారని, పోలీ స్ శాఖ నుండి విరమణ పొందడం తనకెంతో బాధ కలిగిస్తుంద న్నారు. ఈ కార్య క్రమం లో పరకాల ఎసిబి సతీష్ బాబు, ఆత్మకూరు సిఐ ఆర్ సంతోష్ కుమార్, పర కాల సిఐ క్రాంతి కుమార్, శ్యాంపేట సబ్ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్, స్థానిక ఎస్సై తిరుపతి ఇంట లిజె న్స్ హెడ్ కానిస్టేబుల్ శివకుమార్ స్పెషల్ బ్రాంచి ఏఎ స్ఐ కళాధర్ పోలీస్ శాఖ సిబ్బ ంది అతని కుటుంబ సభ్యులు అతని స్నేహితులు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎస్సై గోవర్ధన్ ఉమాదేవి దంపతు లను అందరు పాల్గొని ఘనంగా సన్మానించారు.

# విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే నిర్మాతలు

### జిల్లా విద్యాశాఖ అధికారి జి.పాణిని




**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :**విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు శక్తివం చన లేకుండా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి.పాణిని అన్నారు. జిల్లాలోని ఉపాధ్యా యులకు నిర్వహిం చ బడుతున్న కెరీర్ కౌన్సి లింగ్, గైడెన్స్ శిక్షణ కార్యక్రమం ముగింపు కార్య క్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరైరయ్యా రు. వారు మాట్లాడుతూ విద్యార్థుల ఉ జ్వల భ విష్యత్తుకు ఉపాధ్యాయులే నిర్మాతలని, విద్యార్థి ఉన్నత శిఖరాల వైపు పయని ంచాలంటే మార్గ నిర్దేశకుడిగా ఉపాధ్యాయుడు ఉండాలన్నారు. ప్రతి విద్యార్థిలో అంత ర్గతంగా శక్తి దాడి ఉం టుందని,వారిలో ఉన్న గొప్ప లక్షణాన్ని, శక్తిని గుర్తించి విద్యార్థికి తనపై తనకు నమ్మకం కలి గిస్తూ మార్గదర్శినిర్దేశం చేస్తే వారు అద్భుతాలను సాధిస్తారని అన్నారు. సమాజంలో మంచి కంటే చెడుతో త్వరగా పాకుతుందని మంచి విషయాల చెడు వ్యసనాలు విద్యార్థులను, యువతను త్వర గా ఆకర్షిస్తాయని, విద్యార్థులు యు వత వాటి ప ట్ల ఆకర్షితులు కాకుండా ఉపాధ్యాయులు సరైన మార్గనిర్దేశం చేయాలని, భవిష్యత్తు బంగారు బా టలు వేయాలంటే చదువు ఎంతో ముఖ్యమన్నా రు. మనం చేసే చిన్న తప్పటడుగులు వారి భవి ష్యత్తును, వారి కుటుంబాలను ఎలా అతలాకుత లం చేస్తున్నాయో వారికి అవగతం అయ్యేలా తెలి పి వారిని సన్మార్గం వైపు నడిపించేందుకే ఈ రెం డు రోజుల కెరీర్ కౌన్సిలింగ్, గైడెన్స్ శిక్షణ కార్య క్రమం నిర్వహించబడిందని అన్నారు. శిక్షణ పొ ందిన ఉపాధ్యాయులు వారి పాఠశాలలో విద్యా ర్థులకు వారి యొక్క భవిష్యత్తు కార్యాచరణపై మార్గ నిర్దేశం చేస్తూ విద్యార్థులను సన్మార్గంలో ముందుకు నడిపిస్తూ పరీక్షల పట్ల భయం లే కుండా ప్రశాంతమైన స్వేచ్ఛ వాతావరణంలో పరీక్షలు రాసేందుకు సంసిద్ధులను చేయాలని అ న్నారు. అదేవిధంగా ప్రతి పాటశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు విధిగా డిసిఈబి ద్వారా అంద జేయబడినటువంటి 40 రోజుల ప్రత్యేక కార్యాచ రణ ప్రణాళికను అమలు చేస్తూ పాఠశాల, విద్యా ర్థుల అవసరాలను బట్టి సృజనాత్మక కార్యక్రమా లను జోడిస్తూ ములుగు జిల్లా రాష్ట్రంలో ఉత్తమ ఫలితాలు సాధించుటకు కృషి చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ సమన్వ యకర్తలు సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ అర్షం రాజు, కోఆర్డినేటర్లు గుల్లపల్లి సాంబయ్య, సైకం శ్రీనివాస్‌రెడ్డి, రిసోర్స్‌పర్సన్‌లు జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్, మురళీధర్, ప్రతాప్, ఫణిందర్, జిల్లాలోని 53 పాఠశాల ఉపాధ్యా యులు తదితరులు పాల్గొన్నారు.

## పాలకుర్తిలో ఆన్‌లైన్ సెంటర్ సీజ్



**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండల కేం ద్రంలోని బు చ్చిరెడ్డి హాస్పిటల్ ఏరియా లో యాకేష్ అనే వ్యక్తి కీర్తి క కామన్ సర్వీ స్ సెంటర్ పేరుతో నిబ ంధనలు విరుద్ధంగా ఆధార్ వివరాలు అప్డేట్ చేస్తున్నట్లు తమకు స మా చారం అంద డంతో శుక్రవారం ఆ సెంటర్‌ను సీజ్ చేసినట్లు ఆర్ఐ రాకేష్ తెలిపా రు. వారు మాట్లాడుతూ ఆధార్ వివరాలు అప్డేట్ చేయడానికి అతనికి ఐ డీ లేకున్నా ఇతరుల ఐడీతో ఆధార్ వివరాలను అప్డేట్ చేస్తూ అధిక డ బ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. సెంటర్‌ను సీజ్‌చేసి 2 ల్యాప్‌టాప్‌లు, 2 ప్రింటర్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

## ఎఇ మణిదీప్‌కు సన్మానం

**ప్రజాపక్షం/టేకుమట్ల:** టేకుమట్ల మండలంలో విధులు నిర్వహిస్తున్నా విద్యుత్ శాఖ ఎఈ మణిదీప్ మండంలోని రైతుల పట్ల ప్రజల పట్ల మన్న లను పొందారు. ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి విధి నిర్వహ ణలో భాగంగా ఉత్తమ పని తీరు కనబర్చిన విద్యుత్‌శాఖ ఎఈ మణిదీప్‌కు కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా జిల్లా ఉత్తమ అవార్డును తీసుకున్నారు. ఈ సందర్భంగా మండల విద్యుత్ కార్మికుల ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఎఈ మణిదీప్‌కు శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గవా స్కర్, రసమల్ల సురేందర్, కర్రె నారాయణ, భాషవేని రమేష్, గద్దం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వేతనాలు చెల్లించకుంటే సమ్మె తప్పదు

## ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఉపేందర్



**ప్రజాపక్షం/రెబ్బెన :** కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించకుంటే ఫిబ్రవరి 1 నుండి సమ్మెలోకి వెళ్తామని ఎఐటియుసి బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు భోగే ఉపేందర్ అధికారులను హెచ్చరించారు. శుక్రవారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌కు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌కు చెందిన నీడ్స్ ఆఫ్ టెక్నాలజీ అనే సంస్థ కాంట్రాక్టర్ కార్మికులకు ఐదు నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాంట్రాక్ట్ సంస్థ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించడంలో విఫలమైందన్నారు. కాంటాక్ట్ కార్మికులు వేతనాల కోసం అధికారులను సంప్రదించగా పట్టించుకోవడంలేదన్నారు. దీంతో తమ కుటుంబాల జీవనం ఎలా కొనసాగుతుందని కాంట్రాక్ట్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. అధికారులు స్పందించి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో గాడి సాయి కోట ప్రవీణ్ మారం కుమార్ రాజేందర్ పాల్గొన్నారు.

# ఆసుపత్రి కార్మికుల వేతనాలివ్వండి

## ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు రాములు



**ప్రజాపక్షం/బాన్సువాడ :** బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు నాలుగు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఆసుపత్రి కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు రాములు మాట్లాడుతూ విధులు నిర్వహించిన కార్మికులకు సకాలంలో వేతనాలు అందివ్వకపోవడంతో కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఇప్పటికైనా సంబంధిత అదికారులు కార్మికులకు రావలసిన బకాయి వేతనాలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రేణుక, సురేఖ, సుశీల, గంగారాం, సాయిలు, జైల్‌సింగ్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో పులి పాదముద్రలు

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం, కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయం సమీపంలో, కర్షలఘట్ట గ్రామ సమీపంలోని ప్రాజెక్టు ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు పులి పాదముద్రలు గుర్తించిన అటవీశాఖ అధికారులు శుక్రవారం తెలిపారు. విషయం తెలిసిన వెంటనే, బెల్లంపల్లి అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి, పులి పాదముద్రలను ధ్రువీకరించారు. బుగ్గ గూడెం, కన్నాల గ్రామాల సమీపంలోని పంట పొలాలు సాగిస్తున్న రైతులు, స్థానిక ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ రేంజ్ అధికారి పూర్ణచందర్ సూచించారు. పులి ప్రమాదం నుంచి రక్షించడానికి, జనసంచారం లేని అటవీ ప్రాంతానికి పులిని తరలించేందుకు యత్నిస్తామని వారు తెలిపారు.

# బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



**ప్రజాపక్షం/కుంటాల :** నిర్మల్ జిల్లా కుంటాల మండలం మాజీ జడ్పిటిసి కొత్తపల్లి బుచ్చన్న తల్లి నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బిజెపి నాయకులు పిప్పెర వెంగల్ రావు,పసుల నవీన్ తదితరులు ఉన్నారు.

# సిసిఐ పత్తి కొనుగోళ్లు నిలుపుదల

**ప్రజపక్షం/కౌటాల :** కౌటాలలోని శ్రీ వైష్ణవి మాత కాటన్ మిల్లులో సిసిఐ పత్తి కొనుగోళ్లు ఫిబ్రవరి 1 నుండి 9వ తేదీ వరకు నిలిపివేస్తున్నట్లు సిసిఐ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి నిల్వలు పేరుకుపోవడంతో కొనుగోళ్లను నిలిపివేస్తున్నామని, ఈ స మాచారాన్ని దృష్టిలో పెట్టుకుని తొమ్మిది రోజుల పాటు పత్తిని రైతులు తీసుకురావద్దని కోరారు. కొనుగోళ్ళు పునః ప్రారంభ తేదీని ప్రకటించడం జరుగుతుందన్నారు.

# జిల్లాలో పోలీసు యాక్ట్ : ఎస్పి



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నెల రోజుల పాటు (ఫిబ్రవరి 1తేది నుండి 28 వరకు) జిల్లా వ్యాప్తంగా 30,30(1) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు ప్రజాప్రతినిధులు, ధర్నాలు, రాస్తారోకోలు నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు సభలు ,సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగి విధంగా ప్రజాధనానికి నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యకాలపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, జిల్లాప్రజాప్రతినిదులు వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు.

# మెరుగైన ప్రదర్శనతో గుర్తింపు



**ప్రజాపక్షం/దండేపల్లి :** దండేపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి భౌతిక, రసాయన శాస్త్ర ప్రతిభ పరీక్ష నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. విజేతలకు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ మెరుగైన ప్రదర్శనతో గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రతిభ పరీక్ష ఇన్‌చార్జ్ అప్పాల మనోహర్, ఉపాధ్యాయులు సంఘర్ష్ రాజేశ్వరరావు, పాత రమేష్, బోలిశెట్టి రాజన్న, రాజశేఖర్, వినోద్, శ్రీనివాస్ విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

# స్వీయ నియంత్రణతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

## కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** స్వీయ నియంత్రణతోనే రోడ్డు ప్రమాదాలను నివరించవచ్చని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపును పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా పోలీసుశాఖ సౌజన్యంతో జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అజాగ్రత్తగా, అతివేగంగా వాహనాలు నడపటం, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవటం వంటివి రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. వ్యక్తిగతంగా వారి కుటుంబాలతో పాటు ఇతరులకు తీరని నష్టం చేకూరుస్తున్నారని, ఎవరికి వారు బాధ్యతగా ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించినప్పుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు. సదస్సులో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఎసిపి నారాయణ, కోటేశ్వర్‌రావు, కిరణ్‌కుమార్, ప్రశాంత్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.






### మెరుగైన వైద్యసేవలందించాలి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నందున ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. శుక్రవారం జక్రాన్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకితభావంతో కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీలో వైద్యవిభాగాలను పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేసి అందుబాటులో లేని వారిపై ఆరా తీశారు. వైద్య సేవల కోసం పీహెచ్‌సీకి వచ్చిన రోగులను పలుకరించి వారికి అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. వైద్య పరికరాలను పరిశీలించి, సీబీపీ మిషన్ వినియోగంలో ఉందా అని సిబ్బందిని ఆరా తీశారు. అన్నిరకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, కాలం చెల్లిన ఔషధాలను ఎప్పటికప్పుడు తీసివేసి కొత్త స్టాక్ వినియోగించాలని సూచించారు.

### ఆహార పదార్థాలు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

అనంతరం కలెక్టర్ డిచ్‌పల్లి మండలం సుద్దపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్సియల్ పాఠశాలను, సుద్దులంలోని జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. సుద్దపల్లి రెసిడెన్సియల్ పాఠశాలలో కిచెన్, డార్మెటరీ, డైనింగ్ హాల్‌లను పరిశీలించి సదుపాయాలు పరిశీలించారు. బాలికల కోసం వండిన అనం, పప్పు ఇతర ఆహార పదార్థాల నాణ్యత తనిఖీ చేశారు. బియ్యం నిల్వలు, సరుకుల స్టాక్‌ను పరిశీలించారు. కూరగాయలు సక్రమంగా భద్రపర్చకపోవడాన్ని గమనించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. సుద్దులం జడ్పీ హైస్కూల్‌లో తాగు నీటి వసతి, కిచెన్ షెడ్ టాయిలెట్స్, క్రీడా మైదానం తదితర వాటిని పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులందరికీ రెండు జతల చొప్పున ఏకరూప దుస్తులు అందాయా ? అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతలు అసంపూర్తిగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ వెంటనే వాటి నిర్మాణాలను పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. పదిలో నూటికి నూరు శాతం ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులున్నారు.

# విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి

## కలెక్టర్ వల్లూరు క్రాంతి

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** విద్యార్థుల ఆరోగ్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, పాఠశాల, హాస్టళ్లలో మౌలిక వసతులు, మంచి ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు)ను కలెక్టర్ వల్లూరి క్రాంతి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, భోజనశాల, హాస్టల్ పరిస్థితులను పరిశీలించారు. పాఠశాలలో వినియోగిస్తున్న బియ్యం, కూరగాయలు, కిరాణా సరుకుల నిల్వలను భద్రపరిచే స్టోర్ రూంను, బియ్యం నాణ్యత పరిశీలించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆహార పదార్థలను సరైన రీతిలో నిల్వ చేయాలని సూచించారు. కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే భోజనం మెనూ ప్రకారం ఉందో లేదో పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఆహార నాణ్యత గురించి అడిగా తెలుసుకున్నారు. డైనింగ్ హాల్, కిచిన్ షెడ్యూల్ ఆహారం, తయారీ విధానాలు ఉపయోగిస్తున్న పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. టెన్త్ క్లాస్ విద్యార్థుల ప్రిఫేరేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరీక్షల్లో మెరుగైన ఫలితాలను సాధించేందుకు విద్యార్థులకు అదనపు సహాయం అందించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్, దేవదాస్, ఆర్‌సిఓ గౌతంకుమార్, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.



### కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఐఐటి సందర్శన

ఇండియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ కందిని కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ సందర్శించారు ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి గవర్నర్‌కు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. ఈసందర్భంగా కళాశాల డైరెక్టర్ నూతన పరిశోధనలు, విద్యార్థులకు అవకాశాలు ఐఐటి నుంచి ప్రభుత్వ తోడ్పాటు వంటి విషయాలపై గవర్నర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ బిఎస్ మూర్తి, అదనపు ఎస్‌పి సంజీవరావు, ఆర్‌డిఓ రవీందర్‌రెడ్డి, డిఎస్‌పి సత్తయ్య, కంది తహసీల్దార్ విజయలక్ష్మి, డిటీ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# నందిపేట్‌లో కొత్త సహకార సంఘం ఏర్పాటుకు సహకరించండి

## ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత

**ప్రజాపక్షం/నందిపేట్ :** నందిపేట్ మండల కేంద్రంలో కొత్త సహకార సంఘం ఏర్పాటుకు సహకరించాలని కోరుతు శుక్రవారం నందిపేట్ గ్రామాభివృద్ధి కమిటి సభ్యులు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం మరికొన్ని సహకార సంఘాలను ఉన్న వాటిని విడగొట్టి ఏర్పాటు చేయాలని ఆలోచించింది. శుక్రవారం నందిపేట్‌లో బిజెపి యువనాయకులు సుమిత్ టిఫిన్ సెంటర్‌ను రాకేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామాభివృద్ధి కమిటి సభ్యులు కలిసి వినతి పత్రం అందజేశారు. కొత్తసహకార సంఘంలో ఆంధ్రనగర్, కౌల్‌పూర్, వెల్మల్, నందిపేట్ గ్రామ పంచాయతీ రైతులకు మేలు జరుగుతుంది. కావున ఈ సహకార సంఘం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి యువ నాయకులు పిస్క కుశల్, కంటం సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# వెదురుతో వినూత్న వస్తువుల తయారీకి మహిళలకు శిక్షణ

## అదనపు కలెక్టర్ దీపక్ తివారి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** వెదురు వినూత్న వస్తువుల తయారీకి మహిళలకు శిక్షణ ఇస్తే మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ మండలంలోని సాలెగూడా గ్రామ పరిధిలో నిర్మాణంలో ఉన్న వెదురు ప్రాసెసింగ్ యూనిట్ సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వెదురుతో వినూత్న వస్తువులు తయారు చేసే ప్రణాళిక రూపొందించాలన్నారు. యూనిట్ పూర్తి చేసే లోపు అవసరమైన వెదురు నిల్వల సేకరణకు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. నాణ్యమైన పరికరాలను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి వంకొముురంటశాలతో పాటు విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



# బాసరలో వసంత పంచమి వేడుకలకు ఏర్పాట్లు

## కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** వసంత పంచమికి బాసరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బాసరలో పర్యటించిన కలెక్టర్ వసంత పంచమి వేడుకలకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు. గోదావరి పుష్కర ఘాట్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. గోదావరి పుష్కర ఘాట్ ప్రదేశంలో నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. నదిలో స్నానమాచరించిన భక్తులు దుస్తులు మార్చుకునేందుకు అవసరమైన గదులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నది వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. రాత్రి వేళల్లో ఇబ్బందులు కలగకుండా అవసరమైన విద్యుత్ దీపాలను అమర్చాలని సూచించారు. అనంతరం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవి అమ్మవారికి కలెక్టర్ దర్శించుకున్నారు. అనంతరం వివిఐపి గెస్ట్‌హౌస్‌లో అధికారులతో కలిసి వసంత పంచమి వేడుకల నిర్వహణపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. బాసరలో ఫిబ్రవరి 1 నుండి 3 వరకు వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వేడుకల పర్యవేక్షణకు బైంసా ఆర్డిఓను ప్రత్యేక అధికారిగా నియమించినట్లు తెలిపారు. గోదావరి పుష్కర ఘాట్, ఆలయ పరిసరాలన్నీ సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ఉంచాలన్నారు. రైల్వే స్టేషన్, బస్టాండ్‌లనుండి భక్తులు ఆలయానికి సులువుగా చేరుకునే విధంగా రోడ్డు మార్గాన్ని తెలిపే విధంగా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఆలయంలో ప్రవేశం, నిష్క్రమణ వివరాలు తెలిపే విధంగా సూచన బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. పార్కింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, దేవాదాయ శాఖల అధికారులు, సిబ్బంది, సమన్వయంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డిఓ కోమల్‌రెడ్డి, బాసర దేవాలయ ఇఓ సుధాకర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఆర్‌అండ్‌బి ఇఇ అశోక్ కుమార్, మిషన్ భగీరథ ఇఇ సందీప్, తహసీల్దార్ పవన్ చంద్ర, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, దేవాదాయ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

### ఉత్తమ ఫలితాలు సాధనకు ఉపాధ్యాయులు కృషిచేయాలి

పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలాని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదవ తరగతి పరీక్షలపై సమీక్ష సంబంధిత శాఖల అధికారులతో సమావేశం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేరే గ్రామాల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విధంగా బస్సులను నడిపేలా ఆర్టీసీ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. గత రెండు సంవత్సరాలుగా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలువడం జరిగిందని, ఈ సంవత్సరం కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. ఉపాధ్యాయులు అధికారులు,ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. సమావేశంలో డిఇఓ పి.రామారావు, డిపిఓ శ్రీనివాస్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌లు పద్మ, సలోమి కరుణ ప్రధానోపాధ్యాయులు, కేజీబీవి, ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.




# రాసలీల సిసిపై చర్యలేవి?

## ఒక్కొక్కటిగా బయటపడుతున్న ఆరోపణలు..

## కిందిస్థాయి సిబ్బందిపై వేధింపులు..

**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** నిర్మల్ జిల్లా కేంద్రంలో సంచలనం సృష్టించిన ఓ జిల్లా అధికారి సిసిపై చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అదే కింది స్థాయి ఉద్యోగులు ఇలాంటివి చేస్తూ దొరకుతే అలాగే వదిలేస్తారా..? అని పలువురు చర్చించుకుంటున్నారు. అలాగే సిసి బాగోతాలు..ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. నిర్మల్ మండలంతో పాటు జిల్లాలోని బాసర మండలాల్లో డిటిగా పనిచేసిన సందర్భంలో ఆయన పై అనేక ఆరోపణలు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. రెవెన్యూ శాఖలో డిటిగా ఉన్నతమైన ఉద్యోగంలో ఉన్నప్పటికీ ఆయన క్రింది స్థాయి ఉద్యోగులను కించపరిచే విధంగా వ్యవహరించినట్లు విమర్శలు వెలువెత్తున్నాయి. డ్యూటీలో ఉన్నప్పుడు ఆయా మండలాల్లో ఇసుక మాఫియాపై బెదిరింపులకు పాల్పడుతూ అందినంత కాడికి దోచుకున్నట్లు సైతం ప్రచారం జరుగుతుంది. గ్రామస్థాయిలో పనిచేసే విఆర్‌ఎలు, గ్రామ కార్యదర్శులను వేధించినట్లు ప్రచారం జరగుతోంది. కలెక్టర్ సిసిగా మారిన తర్వాత ఆయన కలెక్టర్ కార్యాలయంలో పనిచేసే అన్ని శాఖల ఉద్యోగులతో సఖ్యతగా ఉండకుండా కలెక్టర్‌ను కలుసుకునేందుకు అవకాశం ఇవ్వకుండా వేధించే వారని పలువురు విమర్శిస్తున్నారు. శాఖల వారీగా అధికారులకు ఫోన్ చేసి కలెక్టర్ సిసి పేరుతో తమ కార్యక్రమాలను అనుకూలంగా మార్చుకోవడం, వ్యక్తిగత లాభార్జనకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. నిర్మల్ పట్టణంలోని ఓ టౌన్షిప్‌లో ఉన్న భవనంలో ఇప్పటికే ఎన్నోసార్లు అమ్మాయిలతో ఒంటరిగా కాలం గడిపినట్లు పక్కా సమాచారంతోనే ఆయన బాధితులు పోలీసులకు, మీడియాకు ఉప్పందించినట్లు తెలుస్తోంది. ఒక జిల్లా ఉన్నత స్థాయి అధికారి వద్ద బాధ్యతగా విధులు నిర్వహించవలసిన అధికారి తన బాధ్యతలను మరిచి తప్పుదోవ పట్టినా సంబంధిత ఉన్నత అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బుధవారం జరిగిన ఘటనలో చేసిన తప్పులు ఒప్పుకోకపోగా నా వ్యక్తిగత జీవితం మీరెవరు ఇక్కడికి ఎందుకు వచ్చారు అంటూ మీడియాపై అక్రోషం వెళ్లగక్కడం ఆయన పనితీరుకు నిదర్శనం అని పలువురు పేర్కొంటున్నారు. కుటుంబ సభ్యులలను సైతం పట్టించుకోవడం లేదని ఆయన సమీప బంధువులే తెలుపుతుండడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమని పలువురు ఆరోపిస్తున్నారు. సంఘటన జరిగి రెండు రోజులైనప్పటికీ అధికారుల నుండి ఎలాంటి చర్యలు లేకపోవడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. ఇకనైనా జిల్లా అధికారులు స్పందంచి సదరు రాసలీల ఉద్యోగిని విధుల నుండి తొలగించాలని పలువురు కోరుతున్నారు.

**ఇష్టపడి కలుసుకుంటే కేసులు ఉండవా?..** వారు ఇష్టంతో కలుసుకుంటే కేసులు ఉండవా? మరి ఇతర లాడ్జీలలో తనిఖీ నిర్వహిస్తుండగా దొరికిన జంటలపై కౌన్సెలింగ్ ఇస్తూ కేసులు నమోదు చేస్తున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. వారు ఇష్టపడి లాడ్జిలో కలుసుకుంటారేమో? వారిపై కేసులు పెడుతున్నారా? ఇష్టంతో వచ్చారని వదిలేస్తున్నారా? అధికారులకు ఒకతీరు, సామాన్యులకు ఒక న్యాయమా అని పలువురు ఈ సంఘటనపై చర్చించుకుంటున్నారు.

# టెన్త్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలి : డిఇఓ

**ప్రజాపక్షం/మంచిర్యాల :** టెన్త్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య అన్నారు. మంచిర్యాల జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని హాజీపూర్, భీమారం, నస్పూర్, చెన్నూర్, దండేపల్లి, మందమర్రి, జైపూర్, లక్షెట్టిపేట, మంచిర్యాల మండలాల ప్రభుత్వ, కెజిబివి, ఎయిడెడ్, టిజిఎంఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను ఎలా సంసిద్ధం చేయాలనే అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఇఓ యాదయ్య మాట్లాడుతూ సిలబస్ ఇప్పటికే పూర్తి కావడంతో ఫిబ్రవరి 1 నుంచి రివిజన్ క్లాసులు ప్రారంభించాలని సూచించారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, మండల విద్యాధికారులు ఈ తరగతులను పరిశీలించాలని సూచించారు. గత సంవత్సరం కంటే ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎసిజిఇ, దామోదర్‌రావు, డిసిఇబి కార్యదర్శి కొండూ భీమ్ రావు, సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, డిసిఇబి సహాయ కార్యదర్శి కుమారస్వామి, ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడ

# అమ్మాయిలు అదరహో

## టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌కు భారత్




భారత అమ్మాయిలు అదరహో అనిపించారు. అండర్ 19 మహిళల టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌కు టీమ్ఇండియా దూసుకెళ్లింది. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో సెమీస్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 113 పరుగులు చేయగా.. భారత్ 15 ఓవర్లలో కేవలం ఒక్క వికెట్‌ను మాత్రమే కోల్పోయి 117 పరుగులు చేసి గెలుపొందింది. ఓపెనర్లు కమలిని (56*), గొంగడి త్రిష (35) రాణించారు. దీంతో ఆదివారం జరగనున్న టైటిల్ పోరులో దక్షిణాఫ్రికాతో భారత్ తలపడనుంది.

**ఆడుతూ పాడుతూ..**

ఈ టోర్నీలో భారత బ్యాటర్లు తొలి మ్యాచ్ నుంచే మంచి ఫామ్ కనబరిచారు. దానినే కొనసాగిస్తూ సెమీస్‌లోనూ చెలరేగిపోయారు. ఇంగ్లాండ్ నిర్దేశించిన స్వల్ప లక్ష్యాన్ని ఆడుతూ పాడుతూ ఛేదించారు. ఓపెనర్లు కమలిని గొంగడి త్రిష తొలి వికెట్‌కు 60 పరుగులు జోడించి జట్టు విజయానికి పునాది వేశారు. ఈ క్రమంలో త్రిష ఔటైనప్పటికీ భారత ఇన్నింగ్స్‌ను సనికా చల్కే (11*)తో కలిసి కమలిని ముందుకు తీసుకెళ్లింది. కేవలం 15 ఓవర్లలోనే లక్ష్యాన్ని పూర్తి చేసింది. ఇంగ్లాండ్ బౌలర్ ఫోబ్ బ్రెట్ ఒక వికెట్ తీసింది.

**బౌలింగ్‌లోనూ హవా..**

టాస్ నెగ్గి బ్యాటింగ్‌ను ఎంచుకున్న ఇంగ్లండ్‌ను భారత బౌలర్లు హడలెత్తించారు. ఓపెనర్ జెమీమా గ్రీస్ (9) రెండు బౌండరీలు కొట్టినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. ఆమె వికెట్‌ను తీసిన ఆయుషి శుక్లా (2/21) ఇంగ్లాండ్ పతనానికి నాంది పలికింది. ఆ తర్వాత పరునిక సిసోదియా (3/21), వైష్ణవి శర్మ (3/23) బౌలింగ్‌లో సత్తా చాటారు. డేవినా పెరిన్ (45), కెప్టెన్ అబి నోర్‌గ్రోవ్ (30), అము సురేన్ కుమార్ (14) మినహా మిగతా వారెవరూ రెండంకెల స్కోరు చేయలేదు. దీంతో చివరికి 113 పరుగులకే పరిమితం కావాల్సి వచ్చింది.

**మరో ఫైనలిస్ట్ దక్షిణాఫ్రికా..**

అంతకుముందు తొలి సెమీస్‌లో ఆస్ట్రేలియాపై దక్షిణాఫ్రికా పోరాడి విజయం సాధించింది. ఆసీస్ నిర్దేశించిన స్వల్ప లక్ష్య ఛేదనలో సఫారీ జట్టు చెమటోడ్చింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 105/8 స్కోరు చేసింది. దక్షిణాఫ్రికా బౌలర్ ఆష్లే వాన్ వైక్ (4/17) దెబ్బకు ఆసీస్ ఇబ్బంది పడింది. లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా 18.1 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసి విజయంతో ఫైనల్‌కు చేరుకుంది.

# సచిన్‌కు ప్రతిష్టాత్మక పురస్కారం..



భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్‌ను భారత క్రికెట్ బోర్డు ఘనంగా సత్కరించనుంది. శనివారం జరగబోయే వార్షికోత్సవంలో సచిన్‌కు 'లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం' అందజేయనున్నట్లు పీటీఐకి బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. "సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ ఆఫ్ ది ఇయర్ 2024 అవార్డును సచిన్‌కు ప్రదానం చేయనున్నాం. భారత క్రికెట్‌కు ఆయన అందించిన సేవలు అమోఘం" అని పేర్కొన్నాయి. ప్రపంచ క్రికెట్‌లో రికార్డులు సృష్టించిన సచిన్‌కు అవార్డు ప్రకటనపై పలువురు ప్రశంసిస్తున్నారు. ఈ పురస్కారం స్వీకరించబోయే 30వ భారత క్రికెటర్ సచిన్. గతేడాది భారత మాజీ కోచ్ రవిశాస్త్రి, మాజీ క్రికెటర్ ఫరూఖ్ ఇంజినీర్‌కు ఈ అవార్డు వరించింది.

**ఇదీ సచిన్ ఘనత..**

భారత్ తరపున 664 మ్యాచ్‌లు ఆడిన ఏకైక క్రికెటర్. సచిన్ మొత్తం 34,357 పరుగులు చేశాడు. ఇందులో 100 సెంచరీలు, 201 వికెట్లూ ఉన్నాయి. ఈ 51ఏళ్ల క్రికెట్ దిగ్గజం 2011 వన్డే ప్రపంచ కప్ నెగ్గిన జట్టులో సభ్యుడు. 2013లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. టెస్టుల్లో 15,921 పరుగులు, వన్డేల్లో 18,426 పరుగులు చేశాడు. ఒకే ఒక్క ఇంటర్నేషనల్ టీ20 మ్యాచ్ ఆడాడు. ప్రపంచ క్రికెట్‌లో ఎవరికీ సాధ్యం కానిరీతిలో ఆరుసార్లు వన్డే ప్రపంచ కప్ పోటీల్లో పాల్గొన్నాడు. తన సుదీర్ఘమైన 24ఏళ్ల క్రికెట్ కెరీర్‌లో ఎన్నో మైలురాళ్లను అందుకొన్నాడు. వన్డేల్లో తొలి డబుల్ సెంచరీ చేసిన బ్యాటర్ సచిన్ కావడం విశేషం.

# కోహ్లికి డిడిసిఎ సన్మానం..



దాదాపు 12 ఏళ్ల తర్వాత భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి దేశవాళీ మ్యాచ్ ఆడాడు. రంజీ ట్రోఫీలో భాగంగా రైల్వేస్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఢిల్లీ తరపున బరిలోకి దిగాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఆరు పరుగులే చేసిన కోహ్లి.. ఫీల్డింగ్‌లో మాత్రం చురుగ్గా వ్యవహరించాడు. రెండో రోజు ఆట ముగిసిన తర్వాత విరాట్‌ను ఢిల్లీ క్రికెట్ సంఘం ప్రతినిధులు సత్కరించారు. శాలువా కప్పి ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు. భారత్ తరఫున అంతర్జాతీయంగా వంద టెస్టులకు పైగా ఆడిన కోహ్లిని సత్కరించినట్లు ప్రతినిధులు వెల్లడించారు.

**ఆయుష్ బదోని సెంచరీ మిస్..**
**ఆధిక్యంలో ఢిల్లీ**

టాప్ ఆర్డర్ విరాట్ కోహ్లి (6) విఫలమైనప్పటికీ.. రైల్వేస్‌తో మ్యాచ్‌లో ఢిల్లీ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తొలి ఇన్నింగ్స్‌లో రైల్వేస్ 241 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. ఇక రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఢిల్లీ ఏడు వికెట్ల నష్టానికి 334 పరుగులు చేసింది. క్రీజులో సుమిత్ (78), సిద్ధాంత్ శర్మ (15) ఉన్నారు. అంతకుముందు కెప్టెన్ ఆయుష్ బదోని (99: 77 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడినప్పటికీ.. సెంచరీ చేసే అవకాశాన్ని త్రుటిలో మిస్ చేసుకున్నాడు.

రీల్

# పెళ్లి తర్వాత జీవితం ఏమీ మారలేదు

**వరలక్ష్మి శరత్‌కుమార్**



వివాహం తర్వాత కూడా సినీరంగంలో కొనసాగడంపై ఆమె తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. పెళ్లి తర్వాత తన జీవితం ఏమీ మారలేదని అన్నారు. తనకంటే ఎక్కువగా తన భర్త నికోలయ్ జీవితం మారిందని చెప్పారు. "పెళ్లి తర్వాత నా జీవితంలో పెద్ద మార్పులు ఏమీ రాలేదు. కానీ నికోలయ్ లైఫ్‌లో మాత్రం ఎన్నో మార్పులు వచ్చాయి. ముఖ్యంగా ఆయన నా కోసం హైదరాబాద్ షిఫ్ట్ అయ్యారు. తన పేరు నికోలయ్ సచ్‌దేవ్ వరలక్ష్మి శరత్‌కుమార్‌గా మార్చుకున్నారు. కెరీర్ పరంగా నేను ఎన్నో సాధించాలని ఆయన ఆశిస్తున్నారు. వర్క్ విషయంలో నాలో స్ఫూర్తి నింపుతుంటారు" అని చెప్పారు. అనంతరం పెళ్లి గురించి మాట్లాడుతూ.. "పెళ్లి గురించి నేను ఎప్పుడూ ఆలోచించలేదు. అసలు చేసుకోవాలనే ఉద్దేశం కూడా నాకు ఉండేది కాదు. వివాహం అనేది నాకు సెట్ కాదనే భావనలో ఉండేదాన్ని. కాలానుగుణంగా నికోలయ్‌తో నాకు పరిచయం ఏర్పడింది. అతడే నా జీవితానికి సరైన భాగస్వామి అని అర్థమైంది. ఆవిధంగా పెద్దల అంగీకారంతో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టాం" అని తెలిపారు. వరలక్ష్మి శరత్‌కుమార్ నటించిన 'మదగజరాజ' చిత్రం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకువచ్చి విజయాన్ని అందుకుంది. దాదాపు 12 ఏళ్ల క్రితం తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పుడు విడుదల కావడంపై ఆమె మాట్లాడుతూ.. "ఈ సినిమా విడుదల గురించి విని నేను ఆశ్చర్యానికి గురయ్యా. సంక్రాంతి కానుకగా తమిళనాడులో దీనిని విడుదల చేయగా ప్రేక్షకులు ఫుల్ ఎంజాయ్ చేశారు.

# తండేల్ రాజ్ కోసం పుష్ప రాజ్




టాలీవుడ్ యంగ్ హీరో అక్కినేని నాగ చైతన్య నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'తండేల్' ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ చేసింది. దర్శకుడు చందూ మొండేటి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా పీరియాడిక్ నేపథ్యంలో సాగే ప్రేమకథ చిత్రంగా రానుంది. ఇక ఈ సినిమాలో అందాల భామ సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తుండటంతో చైతూసాయి పల్లవి కెమిస్ట్రీ వెండితెరపై చూసేందుకు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఉన్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ఈ మూవీ పోస్టర్స్, టీజర్, ట్రైలర్ ఈ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. ఇక పాన్ ఇండియా స్థాయిలో ఈ మూవీని పలు భాషల్లో ప్రమోట్ చేస్తూ ఈ మూవీపై పాజిటివ్ వైబ్స్ క్రియేట్ చేశారు. కాగా, ఇప్పుడు ఈ సినిమాపై బజ్‌ను మరింతగా పెంచేలా ఈ సినిమా కోసం ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను తీసుకొస్తున్నారు చిత్ర యూనిట్. 'తండేల్ జాతర' కోసం అల్లు అర్జున్ చీఫ్ గెస్ట్‌గా రానున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. ఫిబ్రవరి 1న సాయంత్రం 5 గంటలకు జరగబోయే ఈ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. ఇలా తండేల్ రాజ్ కోసం పుష్ప రాజ్ వస్తే, ఈ సినిమాపై సాలిడ్ బజ్ క్రియేట్ కావడం ఖాయమని చిత్ర యూనిట్ భావిస్తుంది. ఇక ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించగా బన్నీ వాస్ ప్రొడ్యూస్ చేస్తున్నారు.

# అఖండ–2 ఫస్ట్ లుక్‌పై ఇంట్రెస్టింగ్ టాక్!




నందమూరి నట సింహం నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన లేటెస్ట్ చిత్రం డాకు మహారాజ్ తో తన కెరీర్లో మరో సాలిడ్ హిట్‌ని అందుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రం తర్వాత బాలయ్య నుంచి మరింత స్ట్రాంగ్ లైనప్ కనిపిస్తుండగా వీటితో తన అవైటెడ్ క్రేజీ సీక్వెల్ చిత్రం అఖండ 2 తాండవం కూడా ఒకటి. దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న ఈ భారీ సినిమా కోసం అభిమానులు ఓ రేంజ్‌లో ఎదురు చూస్తుండగా ఇపుడు ఈ సినిమా ఫస్ట్ లుక్ పై ఇంట్రెస్టింగ్ అప్డేట్ వినిపిస్తుంది. దీనితో మొదటి భాగంలో బాలయ్య కనిపించిన దానికంటే తలదన్నేలా బోయపాటి శ్రీను మరింత పవర్‌ఫుల్ షేడ్‌ని బాలయ్య కోసం సిద్ధం చేశారట. డెఫినెట్‌గా ఈ కొత్త లుక్ ఆశ్చర్యపరిచేలా ఉంటుంది అని తెలుస్తుంది. మరి ఈ లుక్ రిలీజ్ పై మరిన్ని డీటెయిల్స్ రావాల్సి ఉన్నాయి. ఇక ఈ చిత్రానికి కూడా థమన్ సంగీతం అందిస్తుండగా ఈ ఏడాది సెప్టెంబర్ 28న గ్రాండ్‌గా పాన్ ఇండియా లెవెల్లో నిర్మాతలు రిలీజ్‌కి తీసుకొస్తున్నారు.





# అసెంబ్లీకి రా!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 2014 నుండి 2023 డిసెంబరు వరకు కెసిఆర్ చేసిన రైతు రుణమాఫీ కేవలం 18 వేల కోట్లు మాత్రమేనని, ఇందులో మిత్తికి పోగా నికరంగా రుణమాఫీ చేసింది కేవలం 3000 కోట్లు మాత్రమేనని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోని 21 వేల కోట్లు రుణమాఫీ చేశామని తెలిపారు. తాము రుణమాఫీ చేయలేదంటూ కెసిఆర్ ఫామ్‌హౌస్‌కు వచ్చి నోళ్లకు జోలి చెప్పడం కాదని, తెలంగాణ ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. అప్పుడే రైతుల జాబితాతో సహా తాము చేసిన రుణమాఫీ లెక్కలను చూపిస్తామన్నారు. ఇచ్చిన హామీలు ఎగ్గొట్టి పంగనామాలు పెట్టిన చరిత్ర తమది కాదని, హామీలను ప్రణాళికాబద్ధంగా అమలు చేసే ఘనత కాంగ్రెస్ పార్టీదని గుర్తు చేశారు. జహంగీర్ పీర్ దర్గాకు, వేములవాడ రాజన్నకు నిధులు ఇస్తామని మోసం చేసిన చరిత్ర కెసిఆర్‌దని, పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పి ఎండబెట్టిన దుర్మార్గుడని ఆవేదన వ్యక్తం చేశారు. మీ నాయకత్వంపై నమ్మకం ఉంటే అసెంబ్లీకి రావాలని, ఏడాదిలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులపై లెక్కలు చూపిస్తామని రేవంత్ రెడ్డి కెసిఆర్‌కు సవాల్ చేశారు. పదేళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన కెసిఆర్ సోషల్ మీడియాలో లైకులు వచ్చాయని చెప్పుకుంటుంటే మానసిక స్థితి ఎట్లా ఉందో అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. బిసి కులగణన, మాదిగ వర్గీకరణపై ఫిబ్రవరి మొదటి వారంలో అసెంబ్లీ సమావేశాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాలం చెల్లిన వెయ్యి రూపాయల నోటు మాదిరిగా కెసిఆర్ ఉండిపోయారని వివరించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ నుండి మొదలుకొని ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చూపించి విజయమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు, శ్రేణులకు సూచించారు.

**విద్యతోపాటు సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలి**

విద్యతోపాటు సాంకేతిక రంగాలను అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలో ఉందనే విషయాన్ని తాను విశ్వసిస్తానని చెప్పారు. గత ప్రభుత్వం విద్య రంగానికి కేటాయించిన నిధులు సరిపోవని గుర్తించి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్న ఉద్దేశంతో బడ్జెట్లో విద్యకు ఏడు శాతం పెంచి 21 వేల కోట్లు నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. అంచలంచలుగా 15 శాతంకు పెంచేందుకు కృషి చేస్తానని అన్నారు. తామందరం ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని వచ్చిన వాళ్ళమేనని, అలాంటి ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తే సామాన్యుడికి ద్రోహం చేసినట్లేనని తెలిపారు. అందుకే విద్యాశాఖను వేరే ఒకరికి అప్పగిస్తే ప్రాధాన్యత మారుతుందేమో అన్న ఉద్దేశంతో తన వద్దే ఉంచుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలో 20 సంవత్సరాలుగా ప్రమోషన్లు లేకుండా ఉన్న దాన్ని గుర్తించి 21 వేల మంది టీచర్లకు ప్రమోషన్లు, 35 వేల మంది టీచర్లకు బదిలీలను ప్రకడ్బందీగా నిర్వహించామని చెప్పారు. 140 కోట్ల జనాభా కలిగిన మన్ దేశానికి ఒక్క బంగారు పతకం రాలేదని, అతి చిన్న దేశం అయినా సౌత్ కొరియాకు 32 పథకాలు సాధించిందని, అందుకే మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలన్న ఉద్దేశంతో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు గ్రూప్1, వివిధ ఉద్యోగాలను ఇవ్వడంతోపాటు ఆర్థికంగా ప్రోత్సహించామని సిఎం గుర్తు చేశారు. విద్యతోపాటు క్రీడ, సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందిస్తూ మేలి రత్నాలను తయారు చేయాలని ప్రభుత్వ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఇది ఇలా ఉంటే 30 వేల ప్రభుత్వ పాఠశాలలో 24 లక్షల మంది విద్యార్థులు ఉంటే, అంతగా క్వాలిఫైడ్ టీచర్లు లేని కేవలం 12,500 ప్రైవేటు పాఠశాలల్లో 31 లక్షల మంది చదవడం చూస్తుంటే విద్యా వ్యవస్థలో ఎక్కడో ఏదో లోపం ఉందని, దీన్ని మీరు..మేము గుర్తించి సవరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సిఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆనాడు సమాజంలో సమస్యలను వెలికి తీసి ఉద్యమాలు చేపట్టే ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలు సమస్యల పరిష్కారానికి కృషి చేసేయని, ఆ విధంగా విద్యార్థులు, ప్రొఫసర్లు చేసిన పోరాటాల ఫలితంగానే నాడు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. విద్య ,ఉద్యోగ ఉపాధి అవకాశాలు సాధించుకోవాలంటే విద్యతోపాటు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకున్నప్పుడే ఈ పోటీ ప్రపంచంలో తట్టుకోగలమని ఆయన చెప్పారు. అందుకే మొగిలిగిద్ద గ్రామానికి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సిఎం ప్రకటించారు. ఎంతోమంది మేధావులకు విద్యను అందించిన ఈ పాఠశాల అభివృద్ధికి 10కోట్ల రూపాయల నిధులు కేటాయించడంతోపాటు గ్రామ అభివృద్ధికి మరో ఆరు కోట్లు వెచ్చించినట్లు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అదేవిధంగా మొగిలిగిద్ద గ్రామంలో మైనార్టీ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరగా అందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కోదండరావ్, పట్నం మహేందర్ రెడ్డి, కూచకుల దామోదర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ అర్బన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి,షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి,ప్రొఫసర్ హరగోపాల్ తోపాటు వివిధ శాఖల అధికారులు కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.



# బిజెపి ఖర్చు రూ.1,737 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

చేసింది. అలాగే పార్టీ బడ్జెట్‌లో ప్రచారానికి సంబంధించిన ప్రయాణ ఖర్చులు మరో ముఖ్య భాగంగా ఉన్నాయి. పార్టీ కేంద్ర ప్రధాన కార్యాలయం అధికారం ఇచ్చిన స్టార్ క్యాంపెయినర్ల ప్రయాణ ఖర్చు రూ.168.92 కోట్లు కాగా, ఇతర నాయకుల ప్రయాణానికి రూ.2.53 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొంది. సార్వత్రిక ఎన్నికల్లో వరుసగా మూడవసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ... ప్రచారంపై ఎక్కువగా ఆధారపడిందని దాని ఖర్చు విధానాల నుంచి స్పష్టమవుతోంది.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com